అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
బుధవారం 18-09-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 213
Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam
12 పేజీలు వెల : 6.50



బై బై గణేశా!

గ్రేటర్‌లో కన్నుల పండుగగా నిమజ్జనం

శోభాయాత్రలో వేలాదిమందిగా పాల్గొన్న ప్రజలు

7 గంటలు సాగిన ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర

జనసంద్రమైన సాగర్ పరిసర ప్రాంతాలు

పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనం మంగళవారం వైభవంగా ఘనంగా జరిగింది. నవరాత్రులు పూజలందుకున్న గణనాథులు జనం నీరాజనాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి ప్రారంభమైన నిమజ్జన సందడి బుధవారం వరకు కొనసాగనుంది. నిమజ్జనం సందర్భంగా సెలవు కావడంతో తరలివచ్చిన భారీ జన సందోహంతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతాలు ఇసుక వేస్తే రానంత జనంతో నిండిపోయాయి. గణపతి బప్పా మోరియా, జై బోలో గణపతి మహారాజ్.. నినాదాలతో పరిసరాలు హోరెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వైవిధ్యభరితమైన గణపతి విగ్రహాలతో పాటు ఖైరతాబాద్ శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి శోభాయాత్ర, నిమజ్జన వేడుకలు అద్యంతం కన్నుల పండువగా సాగాయి. బ్యాండ్ బాజా, డప్పు చప్పుళ్లతో సందర్శకులు డ్యాన్సులు చేస్తూ వేలాది వినాయక విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌కు తరలించారు. అలాగే పలు ...10లో

బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షలు

వేలంలో కొలను శంకర్‌రెడ్డి సొంతం వివరాలు 11లో



అమరులకు నివాళి అర్పిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు..

ప్రజల సీఎంను

ఎన్ని అడ్డంకులొచ్చినా హైడ్రా ఆగదు

43 లక్షల మందికి రూ.500లకే వంట గ్యాస్

ఉచిత బస్సు ప్రయాణంతో 87 కోట్ల మందికి లబ్ధి

ఈ ఏడాది 4,50,000 ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

డిసెంబర్ 9న తెలంగాణతల్లి విగ్రహం ఆవిష్కరణ

సెప్టెంబర్ 17 ఒక చారిత్రక ఘట్టం, దానిని వివాదాస్పదం చేయడం తగదు : ప్రజాపాలన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

సాయుధ పోరాటయోధులకు ఘన నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"నేను ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు. ప్రజల కోసం పని చేసే ముఖ్యమంత్రిని. ఎన్ని అడ్డంకులొచ్చినా హైడ్రా ఆగదు. తెలంగాణ అంటేనే త్యాగం. ఆ త్యాగాల పునాదుల మీదనే రాష్ట్రం ఏర్పడింది. కాని కొంత మంది తెలంగాణను సొంత జాగీరులా భావించి విధ్వంసం చేశారు. పదేండ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు. ఎన్నికల ముందిచ్చిన మాట ప్రకారం ఆర్థిక స్వావలంబన, సాంస్కృతిక పునర్జీవం వైపు తెలంగాణను నడిపిస్తున్నాం. బానిస సంకెళ్ల నుంచి నేడు తెలంగాణ విముక్తి పొందిన దినం. కాని దీన్ని కూడా వివాదం చేసే ప్రయత్నాన్ని కొంతమంది చేస్తున్నారు" అని సీఎం రేవంత్ రెడ్డి ...11లో

ఎన్ని అడ్డంకులెదురైనా హైడ్రా ఆగదు

"తెలంగాణ ఫ్యూచర్ స్టేట్‌గా మాత్రమే కాదు. క్లీన్ స్టేట్‌గా కూడా ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే హైడ్రాను ఏర్పాటు చేశాం. ఒకప్పుడు లేక్ సిటీగా పేరొందిన హైదరాబాద్, నేడు ఫ్లడ్స్ సిటీగా మారి పోయింది. చెరువులు, నాలాలు కాపాడు కోకపోతే భవిష్యత్ తరాలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ఇటీవల కేరళలో ప్రకృతి విలయ ...11లో



అనుమతి లేకుండా

కూల్చివేతలొద్దు

సుప్రీం తాత్కాలిక ఆదేశాలు

అక్టోబరు 1న తదుపరి విచారణ

న్యూఢిల్లీ : తమ స్పష్టమైన అనుమతి లేకుండా దేశంలో ఎక్కడా కూడా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే పబ్లిక్ రోడ్‌లపై, ఫుట్‌పాత్‌లపై, రైల్వే లైన్‌లపై, నీటి వనరుల వద్ద ఆక్రమణలకు ఈ ఆదేశాలను వర్తింపచేయరాదని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. వివిధ నేరాల్లో నిందితులుగా వున్న వ్యక్తుల ఇళ్లను కూల్చివేస్తూ అధికారులు ఈ బుల్డోజర్ చర్యలు తీసుకోవడాన్ని సవాలు ...3లో

సీబీఐ రిపోర్టు షాకింగే

ఆ వివరాలను బయటపెడితే కేసుపై ప్రభావం

కోల్‌కతా అభయ కేసులో సుప్రీం కోర్టు 3లో..

ఎర్రజెండా రాజ్యం వస్తేనే

బతుకుల్లో మార్పు

వీర తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటు: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, సికార్ ఎంపీ అమ్రారాం

సాయుధ పోరాట స్ఫూర్తితోనే మోడీ నల్ల చట్టాలు రద్దు

నవతెలంగాణ-జనగామ

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితోనే దేశంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను పార్లమెంటులో రద్దు చేయించగలిగామని సికార్ ఎంపీ, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, రైతు ఉద్యమ నేత అమ్రారాం తెలిపారు. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట పక్షోత్సవాల ముగింపు సభను జనగామ పట్టణంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా పట్టణంలోని క్రిస్టియన్ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా, నెహ్రూ పార్కు మీదుగా ధర్మ కొండల్ రెడ్డి గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కోలాటాలు, డప్పు చప్పులతో ఉత్తేజపూరితంగా సాగిన మహా ప్రదర్శన.. ఆటపాటలతో ముందుకు సాగింది. అనంతరం సభా స్థలి వద్ద కామ్రేడ్ సీతారాం ఏచూరి ...11లో





జనగామా సభలో సీపీఐ(ఎం) సికార్ ఎంపీ అమ్రారాం,రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్, జిల్లా కార్యదర్శి కనకారెడ్డి తదితరులు, భారీ ర్యాలీ...



ఎల్‌జీతో అతిశి, కేజ్రీవాల్

ఢిల్లీ సీఎంగా అతిశి

ఆప్ శాసనసభాపక్షం నిర్ణయం

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్

ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రి, మూడో మహిళా ముఖ్యమంత్రిగా మార్లెనా

వారం రోజుల్లో ప్రమాణస్వీకారం

26, 27 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు, బలనిరూపణ

నవతెలంగా-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రిగా అతిశి మార్లెనా పేరును ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఖరారు చేసింది. సీఎల్పీ నేతగా ఆమెను ఆప్ ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం అతిశికి ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించాలని కేజ్రీవాల్ నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో ఆప్ సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా అతిశి పేరును ...11లో

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా

రాణి కుముదిని



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ రాణి కుముదిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మంగళవారం ఈ మేరకు జీవో 62ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ డి.ఎస్. జారీ చేశారు. ఆమె మూడేండ్ల పాటు ఆ పదవిలో ఉండనున్నారు. ఆమె గతంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల కార్యదర్శిగా, ఎస్ఎఫ్‌డీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా, ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా, కార్మిక, హార్టికల్చర్ శాఖల కమిషనర్‌గా, గృహనిర్మాణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.కొంతకాలం కేంద్ర సర్వీసులో వ్యవసాయ శాఖ జాయింట్ సెక్రెటరీగా కూడా పనిచేశారు.

రాజకీయాల కోసం

సెప్టెంబర్ 17కు వక్రీకరణ

పాలనే లేదంటే ప్రజాపాలన దినోత్సవమా? : కేటీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

చరిత్ర తెలియని కొంత మంది తమ రాజకీయాల కోసం సెప్టెంబర్ 17ను వక్రీకరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. జాతీయ సమైక్యతా దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పాలనే ...10లో

అయోధ్యలో రామ రామ..

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సామూహిక లైంగికదాడి

యువతికి న్యాయం చేయాలి :

పోలీసుల నిర్లక్ష్యంపై రాజకీయ పార్టీల ఆందోళన



లక్నో: అయోధ్య రాముడి గుడిలోనే దుండగులు బరితెగించారు. అయోధ్యలోని రామజన్మ భూమి గుడి కాంప్లెక్స్‌లో పనిచేసే ఒక యువతి సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఇలా ఒక్కసారి కాదు మూడుసార్లు అఘాయిత్యం జరిగిం దని ఆ యువతి పోలీసులు దృష్టికి తెచ్చింది. కేసు నమోదు ...11లో

సాయుధ పోరాట చరిత్రను

వక్రీకరిస్తున్న బీజేపీ

- ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?
- పోరాటానికా... తెలంగాణ విలీనానికా : సీఎం రేవంత్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న
- విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్



- మఖ్దూంభవన్‌లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు

వివరాలు 2లో

సాయుధ పోరుకు

సారథులు-వారసులు కమ్యూనిస్టులే

చరిత్ర వక్రీకరణలను తిప్పికొట్టాలి

హన్మకొండ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ ముగింపు సభలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/నయీంనగర్/విలేకరులు

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో వార్షికోత్సవ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మకొండలోని ఏకశిలా పార్క్ వద్ద ఉన్న సాయుధ పోరాట యోధులు ఠాను నాయక్ విగ్రహానికి తమ్మినేని పూలమాల వేశారు. అనంతరం గిరిజన భవన్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి బోట్ల చక్రపాణి అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. వీరవనిత ఐలమ్మ వర్ధంతి సెప్టెంబర్ 10 నుంచి నిజాం



మాట్లాడుతున్న తమ్మినేని

సంస్థానం భారతదేశంలో విలీనం అయిన సెప్టెంబర్ 17 వరకూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరపాలన్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ పిలుపును జయప్రదం చేసిన ప్రజలు, కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. నాయకులు సృష్టిస్తే పోరాటం రాదని, పేదల కడుపు మండితే పోరాటం వస్తుందన్నారు. అలాంటి పేదలైన చిట్యాల ఐలమ్మ, దొడ్డి కొమరయ్య సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. నిజాం ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న ఖాసీం రజ్వీ ఏర్పాటు చేసిన రజాకర్ల ప్రయివేటు సైన్యం.. పేదలపై దాడులు చేసినపుడు, వారి మాన, ప్రాణాలతో చెలగాటమాడటంతో ...10లో

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్ర జెండాదే : జాన్ వెస్లీ

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్రజెండాదేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ అన్నారు. వనపర్తి జిల్లా వీపనగండ్ల మండల కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యాలయంలో మండల కార్యదర్శి బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో జాన్‌వెస్లీ పాల్గొన్నారు. ముందుగా సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఏచూరి, ఐలమ్మ, లక్ష్మీ దేవమ్మ, సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నరసింహ చిత్రపటాలకి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్‌తో పాటు జాన్‌వెస్లీ పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఎలాంటి పాత్ర లేదన్నారు. కానీ ఈ పోరాటాన్ని వక్రీకరించి విమోచనా ...10లో

జమ్ముకాశ్మీర్‌లో

నేడు తొలి దశ పోలింగ్

10 ఏండ్ల తరువాత అసెంబ్లీ ఎన్నికలు

24 అసెంబ్లీ స్థానాలు.. 23 లక్షల మంది ఓటర్లు

శ్రీనగర్: సుమారు 10 ఏండ్ల తరువాత జమ్మూకాశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఏడు జిల్లాల్లో తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి. తొలి దశ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 24 స్థానాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది. నేటి పోలింగ్‌లో 23 లక్షల ఓటర్లు తమ ఓటును వినియోగించుకోనుండగా, 219 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వీరిలో 90 మంది స్వతంత్ర్య అభ్యర్థులు ఉన్నారు. బుధవారం ఎన్నికల జరిగే జిల్లాల్లో మూడు జిల్లాలు (8 అసెంబ్లీ స్థానాలు) జమ్ము ప్రాంతంలోనూ, నాలుగు జిల్లాలు (16 అసెంబ్లీ స్థానాలు) కాశ్మీర్ లోయలోనూ ఉన్నాయి. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు చేసిన తరువాత జమ్మూకాశ్మీర్ అసెంబ్లీకి జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలపై దేశం దృష్టి ఉంది.



మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు మూడు దశల్లో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నారు. రెండో దశ ఈ నెల 25న జరగనుంది. ఎన్నికల సంఘం సమాచారం ప్రకారం తొలి దశలో 23,27,580 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 11,76,462 మంది పురుషులు, 11,51,058 మంది మహిళా ఓటర్లు. 60 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. 1.23 లక్షల మంది ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలి దశ కోసం 3,276 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 14 వేల మంది పోలింగ్ స్టాఫ్‌ను నియమించారు. తొలి దశ ఎన్నికల కోసం ...11లో

గిరిజన గ్రామాల్లో విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : మంత్రి సీతక్క

- ములుగు జిల్లాలో కంటైనర్ ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



నవతెలంగాణ - ములుగు (కన్నాయిగూడెం)

దట్టమైన అడవీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, గిరిజన పిల్లలను విద్యావంతులుగా చేయడానికి కృషి చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో ఏర్పాటు చేసిన కంటైనర్ ప్రభుత్వ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఉపాధ్యా ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేయడానికి కేంద్ర అటవీశాఖ నిబంధనలు అడ్డు వస్తున్నాయన్నారు. దాంతో ఎలాగైనా గిరిజన బిడ్డలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరో రెండు మూడు చోట్ల ఇలాంటి పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యా వ్యవస్థ నాశనం అయిపోయిందని, వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల మేరకు అన్ని సంక్షేమ పనులను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్ గీతే, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీఓ కె.సత్యపాల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఈఈ అజయ్ కుమార్, డీఈఓ పాణిని, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్ట్ 15లాగే తెలంగాణకు సెప్టెంబర్ 17

- చరిత్రను పట్టించుకోని పార్టీలను

ప్రజలు తరిమికొడతారు : తెలంగాణ విమోచన దినోత్సవంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మన దేశానికి ఆగస్ట్ 15 ఎంత ముఖ్యమో తెలంగాణకు సెప్టెంబర్ 17 అంత ముఖ్యమనికేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిజాం నుంచి తెలంగాణ ప్రజలకు విమోచనం కల్పించిన పటేల్ కృషిని, నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్రను పట్టించుకోని పార్టీలను ప్రజలు తరిమికొడతారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మంగళవారం సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసు బలగాల గౌరవవందనాన్ని స్వీకరించారు. పలు బృందాలు ప్రదర్శించిన తెలంగాణ కళారూపాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రజాకార్ల వారసత్వానికి చెందిన ఎంఐఎం పార్టీకి భయపడి విమోచన దినోత్సవం జరుపకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. పనిముట్లనే ఆయుధంగా చేసుకుని ప్రజలు నిజాంపై పోరాటం చేశారని గుర్తుచేశారు. రజాకార్ల ఆగడాలతో ఇక్కడి ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవించారని చెప్పారు. నిజాం హయాంలో బలవంతపు మతమార్పిళ్లు జరిగాయన్నారు. హిందూ మహిళలను రజాకార్ల సైన్యం బలవంతంగా ఎత్తుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడిందని చెప్పారు. పాకిస్థాన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని కలపాలని నిజాం భావించాడనీ, ఆ దిశగా చర్చలు కూడా జరిపాడని ఆరోపించారు. నిజాంతో పటేల్ శాంతి చర్చలు జరిపితే..తమ సంస్థానం జోలికొస్తే కోటిన్నర హిందువులను చంపేస్తామని ఖాసీం రజ్వీ బెదిరించారన్నారు. దీంతో పటేల్ నేతృత్వంలో సైన్యం ఆపరేషన్ పోలోతో హైదరాబాద్ సంస్థానాన్ని భారత్‌లో విలీనం చేసిందని గుర్తుచేశారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..దేశ భక్తులకు, దేశ విచ్ఛిన్నశక్తులకు మధ్య భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం జరిగిన పోరాటమే తెలంగాణ ఉద్యమం అన్నారు. నిజాం దురాగతాలను, నిరంకుశత్వాన్ని ఈ గడ్డ ఎప్పటికీ మరిచిపోదన్నారు. భరతమాత కడుపులో క్యాన్సర్ గడ్డ నిజాం, రజాకార్ల సైన్యం అనీ, దాన్ని పటేల్ ఆపరేషన్ పోలోతో సర్జరీ చేసి తెలంగాణ గడ్డకు విముక్తి కలిగించారని చెప్పారు. విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం తెలంగాణ ఉద్యమ వీరులను అవమానించడమేనన్నారు. తాము ముస్లింలకు వ్యతిరేకం కాదనీ, రజాకార్ల వారసులకు, వారికి కొమ్ముకాసేవాళ్లకు వ్యతిరేకమని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా నిరాజం నిరంకుశ పాలనపై ప్రజలు పోరాడారని కొనియాడారు. తెలంగాణలో ప్రతి గ్రామానికీ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధిలో అందరూ పాలుపంచుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని కొనసాగిద్దాం

- ప్రొఫెసర్ కోదండరాం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు చేసిన పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దామని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో సెప్టెంబర్ 17- తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా కోదండరాం తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో ఒక కీలకమైన రోజుగా అభివర్ణించారు. ఆ రోజును ప్రజల పోరాట ఫలితంగా సాధించిన విజయంగా గుర్తించాలని సూచించారు. 1989లో ఆవిష్కృతమైన 'మా తెలంగాణ' అనే పత్రిక తెలంగాణ రాష్ట్రం విలీనానికి సంబంధించిన చరిత్రపై ప్రజల్లో అవగాహన పెంచిందన్నారు. అప్పటి నుంచి సెప్టెంబర్ 17ను చర్చలోకి తెచ్చి, తెలంగాణా ఉద్యమంలో కీలక ఘట్టంగా నిలిపిందని గుర్తు చేశారు.

సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతం?

పోరాటానికా... తెలంగాణ విలీనానికా : సీఎం రేవంత్‌కు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని ప్రశ్న



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరిస్తే సహించబోమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ పనిగట్టుకుని ముస్లిం రాజుకు వ్యతిరేకంగా హిందువులు పోరాటం చేశారంటూ ఆ చరిత్రను వక్రీకరిస్తున్నాయని విమర్శించారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో హిందువులు, ముస్లింలు కలిసి బందూకులు పట్టి సాగించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం వాస్తవ చరిత్ర చెరిగిపోదని చెప్పారు. ఆ పోరాట స్ఫూర్తి ఎప్పుడూ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో తిరుగుబాటు చైతన్యాన్ని కలిగిస్తుందన్నారు. మనిషి ఉన్నంత కాలం అరుణ పతాకం రెపరెపలాడుతూనే ఉంటుందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం 76వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకులను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను కూనంనేని సాంబశివరావు, అరుణ పతాకాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా ఎగరేశారు. సాయుధ పోరాట అమరవీరులకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ పేరు ఉచ్చరించడానికి పాలకులకు భయమని అన్నారు. విమోచన దినమంటూ కేంద్ర ప్రభుత్వం, సమైక్యతా దినమంటూ మాజీ సీఎం కేసీఆర్, ప్రజాపాలన దినోత్సవమంటూ ముఖ్యమంత్రి రేవంత్ అంటున్నారని చెప్పారు. ప్రజాపాలన దినోత్సవం దేనికి సంకేతమని

> విలీన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని డిమాండ్
> మఖ్దూంభవన్‌లో సాయుధ రైతాంగ పోరాట వారోత్సవ వేడుకలు

ఆయన ప్రశ్నించారు. పోరాటానికి సంకేతమా లేదంటే తెలంగాణ విలీనానికి సంకేతమా అని సీఎం రేవంత్‌రెడ్డిని అడిగారు. ప్రజా పాలన పేరుతో నాటి పోరాటం పేరే ఉనికిలో లేకుండా పోయే ప్రమాదముం దన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనం సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం, నిజాం రాజు మధ్య జరిగిన ఒప్పందంలో చట్టబద్ధంగా విలీనం అని పొందపర్చారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వమైనా, రాష్ట్ర ప్రభుత్వమైనా చట్టబద్ధమైన తెలంగాణ విలీన దినోత్సవం పేరుతోనే ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కమ్యూనిస్టులను అణచడానికే ఆపరేషన్ పోలో : అజీజ్ పాషా

కమ్యూనిస్టులను అణచివేయడం కోసమే ఆపరేషన్ పోలోను నాటి కేంద్ర ప్రభుత్వం చేపట్టింది తప్ప నిజాం రాజును అణచివేయడానికి కాదని సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానిది మహత్తర చరిత్ర అని చెప్పారు. కొన్ని పత్రికలు, మరికొన్ని రాజకీయ పార్టీలు ఈ చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం చేస్తున్నాయనీ, అది ఎప్పటికీ సాధ్యం కాదన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం సృష్టించిన పదం తెలంగాణ విమోచనం అని మీడియా అకాడమి చైర్మెన్ కె శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. భారత్‌లో తెలంగాణ విలీనమైంది తప్ప విమోచనం కాలేదన్నారు. బీజేపీ నాయకులు కమ్యూనిస్టుల పోరాటాన్ని, త్యాగాలను విమర్శిస్తే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో రైతుల హక్కులను కాపాడేందుకు ఉద్యమిస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాలమల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, నాయకులు అంజయ్య నాయక్, కె కాంతయ్య, అనిల్ కుమార్, చంద్రమౌళి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదు

ఆ పార్టీ దిగజారుడు రాజకీయం చేస్తుంది

> - నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు : గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశంలో తెలంగాణ విలీనం జరిగినప్పుడు బీజేపీ పుట్టనే లేదనీ, అయినా ఆ పార్టీ విమోచన అంటూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. దేశాన్ని ముక్కలు చేయాలనే కుట్రలో భాగంగా ఆ పార్టీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ విలీనం ప్రక్రియలో ఎలాంటి పాత్రలేని కమలనాథులు కాంగ్రెస్ పార్టీకి నీతులు చెప్పాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ ఎంతో విజన్ ఉన్న గొప్ప నేతలు అని కొనియాడారు. దేశం కోసం వారు చేసిన సేవలు చరిత్రలో నిలిచిపోయాయని గుర్తు చేశారు. బీజేపీకి, ఆ చరిత్రకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారనీ, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ఆ సమయంలో జనసంఘ్, బీజేపీ అడ్రస్‌లేవని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో తెలంగాణ విలీన దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా గాంధీ, పటేల్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహేష్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17, 1948 వరకు మన సంస్థానానికి స్వతంత్రం రాలేదన్నారు. నెహ్రూ, పటేల్ ఎంతో దూరదృష్టితో వ్యవహరించి ఈ ప్రాంతాన్ని దేశంలో విలీనం చేయించారని కొనయాడారు. ఆ సమయంలో బీజేపీ అనుబంధ సంఘాలు బ్రిటీష్ ప్రభుత్వానికి వంత పాడాయని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి, పటేల్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన్ను తమ నాయకుడిగా కమలనాథులు ప్రచారం చేసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ విలీనం గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదని స్పష్టం చేశారు. ఎ దేండ్లుగా రాష్ట్రా భివృద్ధిని కేసీఆర్ తుంగలో తొక్కారని విమర్శించారు. రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే, ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసింది రాజీవ్ గాంధీయేనన్నారు. రాజీవ్‌గాంధీ గురించి మాజీ మంత్రి కేటీఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ తల్లి గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. సచివాలయ గర్భం(మధ్య భాగం)లో తెలంగాణ విగ్రహం పెడుతుంటే, బీఆర్ఎస్‌కు ఉన్న ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. బీజేపీ పెట్టే చిచ్చులో పడొద్దనీ, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొంది అభివృద్ధి పథంలో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఎవరు ఎంత జనాభా ఉంటే వారికి అంత వాటా అని రాహుల్ గాంధీ చెప్పారని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వి. హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, డీసీసీ అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మెన్ మెట్టుసాయికుమార్, కార్పొరేషన్ల చైర్మెన్లు, అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీసీ గురుకుల బాలికల పాఠశాలలో నిరసన

ఉడకని అన్నం, నీళ్ల చారు పోస్తున్నారని విద్యార్థినుల ఆవేదన

> - పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే, విద్యాధికారి
> - సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ -హాలియా

ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల చారు, రుచిగా లేని కూరలను తినలేకపోతున్నామంటూ విద్యార్థినులు నిరసన తెలిపారు. పాఠశాలలో సకాలంలో సిలబస్ పూర్తి చేయడం లేదని నల్లగొండ జిల్లా హాలియాలోని బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం ప్రార్థన సమయం అనంతరం విద్యార్థినులు పలు అంశాలపై ఉపాధ్యాయులను నిలదీశారు. అనంతరం క్లాసులకు వెళ్లకుండా ఆడిటోరియంలో నిరసనకు దిగారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. దాంతోపాటు భోజనం తినేలా ఉండటం లేదని, సరిగా ఉడకని, అన్నం, నీళ్ల చారు పోస్తున్నారని, కూరలు రుచిగా ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. పరిస్థితులను ఉపాధ్యాయులకు వివరిస్తే తిడుతున్నారన్నారు. విషయం తెలుసుకున్న మండల విద్యాధికారి బాలు నాయక్ పాఠశాలకు చేరుకొని విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్ ఆంక్షలతో తమను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి



హాలియా బీసీ బాలికల గురుకుల పాఠశాలను నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలపై పాఠశాల విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యార్థినులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. విద్యాబోధన సరిగా ఉండటం లేదని చెప్పారు. నాణ్యమైన భోజనం అందించడం లేదని వాపోయారు. అంతేకాకుండా ఉపాధ్యాయులు బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల వంట గదిలోని వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నం, చారు, కూరలు రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఇక నుంచి నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ క్రాంతిని ఆదేశించారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని, మరోసారి జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి

బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచకుండా పౌష్టికాహారం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గురుకుల పాఠశాలకు పంపే బియ్యంలో పురుగులుంటున్నాయన్నారు. ఆ బియ్యం అలాగే వండి పెడుతున్నారని అనేకసార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, విద్యార్థినులు తినలేకపోతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మూడు నెలలుగా విద్యార్థులకు గుడ్లు పెట్టడం లేదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీ సీఎంగా అతిశి

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ అధినేత కేజ్రీవాల్ ప్రతిపాదించగా ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారు. ఈ మేరకు శాసనసభా పక్ష నేతగా అతిశి ఎన్నికయ్యారు. మరోవైపు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనాను కలిసి తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. తన మంత్రి వర్గ సహచరులతో కలిసి కేజ్రీవాల్ ఎల్‌జీని కలిశారు. ఆప్ శాసనసభా పక్ష నేతగా మంత్రి అతిశిని ఎన్నుకున్నట్టు లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఆయన తెలిపారు. ఆయన వారసురాలిగా పార్టీ ఎంపిక చేసిన ఆప్ నేత అతిశి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆమె విజ్ఞప్తి చేసింది.

ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కేజ్రీ

లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసి అతిశిని కొత్త ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నట్టు ప్రకటించటంతో పాటు, కేజ్రీవాల్ రాజీనామాను అందించారు. వారం రోజుల్లో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకోనున్నట్టు ఆప్ తెలిపింది. అనంతరం ఎల్‌జీ మాట్లాడుతూ అతిశి ప్రమాణ స్వీకారం అయ్యే వరకు కేజ్రీవాల్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. కాగా, ప్రమాణ స్వీకారం అనంతరం ఈ నెల 26, 27 తేదీల్లో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో ఆమె బలనిరూపణ చేసుకోనున్నారు.

ఆప్‌తోనే సాధ్యం : అతిశి

సీఎంగా ఎన్నికైన తరువాత అతిశి తొలిసారి మీడియాతో మాట్లాడారు. ముందుగా తనకు సీఎంగా అవకాశం కల్పించినందుకు కేజ్రీవాల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తాను ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను పరిరక్షిస్తానని అన్నారు. 'నేను వేరే పార్టీలో ఉండి ఉంటే.. బహుశా నాకు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ కూడా దక్కేది కాదు. కానీ కేజ్రీవాల్ నాపై ఎంతో నమ్మకంతో నన్ను ఎమ్మెల్యేను, మంత్రిని చేశారు. ఈరోజు ముఖ్యమంత్రి బాధ్యతలు ఇచ్చారు. ఇలాంటిది ఆమ్ ఆద్మీ పార్టీలో మాత్రమే సాధ్యమవుతుంది. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఇంతటి అవకాశం కల్పించిన కేజ్రీవాల్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయను' అని అతిశి తెలిపారు. ఢిల్లీకి ఒకే ఒక్క ముఖ్యమంత్రి ఉన్నారని, అది అరవింద్ కేజ్రీవాలే అని ఆమె అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆప్ అధినేతను తిరిగి ఎన్నుకోవడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఢిల్లీ ప్రజలు, ఆప్ ఎమ్మెల్యేలు, తాను ఆ లక్ష్యంతో పని చేస్తామన్నారు. కేజ్రీవాల్‌పై తప్పుడు కేసులు నమోదు చేసి ఆరు నెలల పాటు కటకటాల పాలు చేశారని బీజేపీపై అతిశి మండిపడ్డారు. కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలచే లక్ష్యంగా పెట్టుకున్నారని అతిషి ఆరోపించారు. "సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడమే కాకుండా కేంద్ర చేతులో దర్యాప్తు సంస్థల పంజరంలోని చిలుక కాకూడదని పేర్కొంది" అని ఆమె గుర్తు చేశారు. "అది వేరే నాయకుడైతే, వారు ముఖ్యమంత్రి కుర్చీని వీడేవారు కాదని, కానీ కేజ్రీవాల్ ప్రజాకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆయన రాజీనామా చేశారు. ఇది మాకు బాధాకరమైన క్షణం" అని అన్నారు. త్వరలో జరగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని ప్రజలు ప్రతిజ్ఞ చేశారని ఆమె తెలిపారు. ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ "మేము తామ నిర్ణయం గురించి ఎల్‌జీకి తెలియజేసాం. ప్రభుత్వ ఏర్పాటుకు అతిశి లేఖ సమర్పించారు. ప్రమాణ స్వీకారానికి తేదీని నిర్ణయించాలని మేము ఎల్‌జీని అభ్యర్థించాం" అని పేర్కొన్నారు.

ఆప్ ప్రభుత్వంలో అతిశి కీలక పాత్ర

కేజ్రీవాల్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కీలక బాధ్యతలు నిర్వహించిన అతిశి, అన్నీ తానై పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ బాధ్యతలను చక్కదిద్దారు. ప్రభుత్వంలోని మొత్తం 14 విభాగాలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆమె, క్యాబినెట్ మంత్రుల్లో అత్యధిక విభాగాలను కూడా చూస్తున్నారు. విద్య, ఆర్థికం, ప్రణాళిక, పీడబ్ల్యూడీ, వాటర్, పవర్, పౌర సంబంధాలు వంటి కీలక శాఖలను నిర్వహిస్తున్నారు. ఎడ్యుకేషన్‌పై వేసిన స్టాండింగ్ కమిటీకి ఆమె చైర్ పర్సన్‌గానూ పనిచేశారు. ఢిల్లీలో పాఠశాలల్లో విద్య వ్యవస్థను మెరుగుపరచడానికి ఆప్ ప్రభుత్వం చేసిన కృషిలో కీలకంగా వ్యవహరించారు. కల్కాజీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆమె ప్రస్తుతం కొనసాగుతున్నారు. అంతేకాకుండా ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సభ్యురాలిగా ఉన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీశ్ సిసోడియా అరెస్ట్ అయ్యాక ఆమె మంత్రి అయ్యారు. సీఎం కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా జైలులో ఉన్నప్పుడు పార్టీని నడిపించారు. ఆగస్టు 15న ఢిల్లీ ప్రభుత్వ స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసేందుకు అతిశిని కేజ్రీవాల్ ఎంచుకున్నారు. విద్యా శాఖ మంత్రిగా దేశ రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. అలాగే ఢిల్లీలో మంచి నీటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు జలవనరుల శాఖ మంత్రిగా అతిశి, నీటి విడుదల కోసం కేంద్రంలోని బీజేపీతో పాటు, పక్కనున్న హర్యానాలోని బీజేపీ ప్రభుత్వంతో యుద్ధమే చేశారు.

ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రి... మూడో మహిళా ముఖ్యమంత్రి

అతిశి ఢిల్లీ ఎనిమిదో ముఖ్యమంత్రిగా, మూడో మహిళ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టానున్నారు. అంతేకాకుండా 43 ఏండ్ల అతిశి అతి పిన్న వయస్కురాలైన ముఖ్యమంత్రిగా ఉండనున్నారు. కాంగ్రెస్‌కు చెందిన షీలా దీక్షిత్, బీజేపీకి చెందిన సుష్మా స్వరాజ్‌ల తరువాత ఢిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రి పదవి అతిశికి దక్కింది. దేశంలో ప్రస్తుతం మహిళ ముఖ్యమంత్రిగా పశ్చిమబెంగాల్‌లో మమతా బెనర్జీ ఒక్కరే ఉన్నారు. ఇప్పుడు అతిశితో దేశంలో ఇద్దరు మహిళా ముఖ్యమంత్రులు కానున్నారు.

మార్క్స్, లెనిన్ పేర్లతో అతిశి పూర్తి పేరు

అతిశి పూర్తి పేరు.. అతిశి మార్లెనా సింగ్. 1981 జూన్ 8న న్యూఢిల్లీలో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, తృప్త వాహీ. వీరిద్దరు ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు ఆమెకు మార్క్స్, లెనిన్ పేర్ల కలయితో 'మార్లేనా' అనే పేరు పెట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు, 2018లో ఆమె "అతిశి"ని తన పేరు మార్చుకున్నారు. అప్పటి నుంచి ఆమె అతిశి మార్లేనాగా ఉన్నారు. న్యూఢిల్లీ పూసా రోడ్డులోని స్ప్రింగ్ డేల్ హైస్కూల్‌లో చదువుకున్నారు. 2001లో ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీని అందుకున్నారు. అనంతరం ఇంగ్లాండ్ వెళ్లి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చేరి, చెవెనింగ్ స్కాలర్‌షిప్ అందుకున్నారు. 2003లో చరిత్రలో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఆ తరువాత 2005లో రోడ్స్ స్కాలర్‌తో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్డలెన్ కాలేజీకి అతిశి హాజరయ్యారు.

బీజేపీ ఆశలు గల్లంతే?

జమ్మూకాశ్మీర్‌లో పాతిక సీట్లు కూడా కష్టమే

- అంతర్గత కుమ్ములాటలతో సతమతం
- హిందూ ఓట్లకూ ఎసరు



శ్రీనగర్ : 2014లో శాసనసభ ఎన్నికలు జరిగినప్పుడు జమ్మూకాశ్మీర్ ఓ రాష్ట్రం. 2019లో బీజేపీ జమ్మూకాశ్మీర్ రాష్ట్ర హోదాను రద్దు చేసింది. జమ్ము కాశ్మీర్... రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. లఢక్‌కు శాసనసభ లేదు. రాబోయే ఎన్నికల కోసం జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. మారిన భౌగోళిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో అధికారాన్ని చేజిక్కించుకొని హిందూ ముఖ్యమంత్రిని నియమించాలని బీజేపీ ప్రయత్నిస్తోంది.

బీజేపీకి 43 స్థానాలు చాలు

జమ్మూకాశ్మీర్ శాసనసభలో 90 స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 46 స్థానాలు అవసరం. మారిన ఎన్నికల చిత్రపటం కారణంగా జమ్మూకు అదనంగా ఆరు, కాశ్మీర్‌కు ఒక స్థానం వచ్చాయి. అంటే హిందువుల ప్రాబల్యం అధికంగా ఉన్న స్థానాల సంఖ్య 24 నుంచి 31కి పెరిగింది. అదే బీజేపీ ఆశలకు కారణమవుతోంది. సవరించిన చట్టాల ప్రకారం ఐదుగురు సభ్యులను నామినేట్ చేసుకోవచ్చు. ఇది కూడా బీజేపీకి అందివచ్చిన వరమే. వారికి ఓటింగ్ హక్కు కూడా ఉంటుంది. ఒకవేళ మెజారిటీకి కొన్ని స్థానాలు తగ్గినప్పటికీ నామినేటెడ్ సభ్యుల మద్దతుతో కుర్చీపై కూర్చోవాలని కమలదళం భావిస్తోంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఇతర పార్టీలకు 46 స్థానాలు అవసరం కానీ బీజేపీకి 43 ఉంటే చాలు. లెఫ్టినెంట్ గవర్నర్ నియమించే సభ్యులు ఎలాగూ బీజేపీకే ఓటేస్తారు.

పాతిక కూడా కష్టమే

అయితే పరిస్థితులు బీజేపీ అనుకునేంత ఆశా జనకంగా ఏమీ లేవు. ఆర్టికల్ 370 రద్దుతో ఆర్థిక పరిస్థితులు తల్లకిందులయ్యాయి. నిరుద్యోగం పెరిగింది. హిందూ ప్రాంతంలో కూడా బీజేపీకి గతంలో ఉన్న ఆదరణ కన్పించడం లేదు. 43 స్థానాల సంగతి దేవుడెరుగు... కనీసం పాతిక సీట్లు రావడం కూడా గగనమేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. దీంతో ముస్లింల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్లు చీలి తనకు లాభిస్తుందని బీజేపీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకుంది. అక్కడ బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి ఐక్యత ఆశించిన స్థాయిలో లేదు. కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాల్లో సొంతగా అభ్యర్థులను నిలిపింది. వీటిలో నాలుగు జమ్మూలోనే ఉన్నాయి. స్నేహపూర్వక పోటీ అని చెబుతున్నప్పటికీ అది కూటమికి ఇబ్బందేనని చెప్పాలి. నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్, పీడీపీ తదితర పార్టీల మధ్య ఓట్లు చీలి ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న చెనాబ్ లోయలోని దోహా, భండర్‌వా స్థానాలు తన ఖాతాలో పడతాయని బీజేపీ లెక్కలేసుకుంటోంది.

బీజేపీతో కలిస్తే అంతే

ఏదేమైనా ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 43 స్థానాలను గెలుచుకోవడం బీజేపీకి కష్టమేనని చెప్పాలి. అప్పుడు కాశ్మీర్ పార్టీల మద్దతుపై ఆధారపడాల్సి వస్తుంది. అయితే ఏ కాశ్మీర్ పార్టీ కూడా బీజేపీకి స్నేహహస్తం అందించడం లేదు. బీజేపీతో చేయి కలిపితే ఆశాభంగం తప్పదని ప్రాంతీయ పార్టీలకు తెలుసు. 2014లో ఆ పార్టీతో పొత్తు పెట్టుకొన్న పీడీపీ చావుదెబ్బలు తిన్నది. పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ, గులాం నబీ ఆజాద్ నేతృత్వంలోని డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ ఆజాద్ పార్టీ కూడా వివిధ సందర్భాల్లో బీజేపీతో అంటకాగి దెబ్బతిన్నాయి. వాటిపై బీజేపీకి బీ-టీమ్ అనే ముద్ర పడింది.

జమ్మూలో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్

జమ్మూ ప్రాంతంలో బీజేపీ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సే. ఈ ప్రాంతంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం మెరుగుపడింది. 2014 శాసనసభ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు కాంగ్రెస్ అక్కడ మెరుగైన ఫలితాలు సాధిస్తుందని అంటున్నారు. కాగా అంతర్గత కుమ్ములాటల కారణంగా జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ విజయావకాశాలు దెబ్బతినే అవకాశాలు కన్పిస్తున్నాయి. సీనియర్ నేతలను కాదని బీజేపీ కొత్త ముఖాలకు అవకాశం ఇచ్చింది. అభ్యర్థుల జాబితాను మార్చి కార్యకర్తల ఆగ్రహానికి గురైంది. ప్రచారంలో బీజేపీ వెనుకబడిపోయిందని పరిశీలకుల అంచనా. ఆ పార్టీ కేవలం ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కేడర్ పైనే ఆశలు పెట్టుకుంది. హిందువుల ఓట్లు తనకు గంపగుత్తగా పడతాయని ఆశిస్తోంది.

కాశ్మీర్ లోయలో ఏం జరుగుతోంది?

ఇప్పుడు కాశ్మీర్ లోయలో అసాధారణ ఎన్నికల ఉత్సుకత కన్పిస్తోంది. ఎన్సీ-కాంగ్రెస్ కూటమి, బీజేపీ, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, అప్నీ పార్టీ మధ్య పోరు సాగుతోంది. 2014లో బీజేపీతో పొత్తు పెట్టుకొని బలహీనపడినప్పటికీ పీడీపీ ప్రభావాన్ని తోసిపుచ్చలేము. కాశ్మీర్ లోయలో చిన్నా చితకా పార్టీల అభ్యర్థులు కూడా బరిలో ఉన్నారు. స్వతంత్రులు సరేసరి. ఇంజినీర్ రషీద్‌కు చెందిన అవామీ ఇత్తెహాద్ పార్టీ 40 మంది అభ్యర్థులను స్వతంత్రులుగా నిలబెట్టింది.

జమాతే ఇస్లామీ 12 మంది స్వతంత్రులకు మద్దతు ఇస్తోంది. ఇంజినీర్ రషీద్ జైలు నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఉత్తర కాశ్మీర్‌లో ఎన్సీ నేత ఒమర్ అబ్దుల్లాను మట్టికరిపించారు. పీపుల్స్ కాన్ఫరెన్స్, అప్నీ పార్టీ ప్రభావం పెద్దగా కన్పించకపోయినా కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను ప్రభావితం చేయగలవు. ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న కొన్ని చిన్న చిన్న పార్టీలు సొంతంగా కొందరు అభ్యర్థులను బరిలో దింపాయి. రషీద్ పార్టీకి కొన్ని గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడం గమనార్హం.

సీబీఐ రిపోర్టు షాకింగే!

ఆ వివరాలను బయటపెడితే కేసుపై ప్రభావం

వాస్తవాలను వెలికితీయడమే దర్యాప్తు లక్ష్యం

సీబీఐ నిద్ర పోవట్లేదు

నిజాన్ని వెలికితీసేందుకు కొంత సమయమివ్వాలి

కోల్‌కతా అభయ కేసులో సుప్రీంకోర్టు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సీబీఐ రిపోర్టులో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించే విషయాలే ఉన్నాయని, అయితే ఆ వివరాలను బయటపెడితే, దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకున్న కలకత్తాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ జూనియర్ డాక్టర్ అభయ హత్యాచారం కేసును మంగళవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నిద్ర పోవటం లేదని, నిజాన్ని వెలికితీసేందుకు వారికి కొంత సమయం ఇవ్వాలని పేర్కొంది. అలాగే బాధితురాలి ఫొటో, పేరును వికీపీడియా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవలాని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించారు.

సుప్రీం ఆదేశాల మేరకు సీబీఐ కేసుకు సంబంధించిన స్టేటస్ రిపోర్టును ధర్మాసనానికి సమర్పించింది. ఆ రిపోర్టులో పేర్కొన్న విషయాలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు గుర్తించిన వివరాలను బయటపెట్టడం వల్ల దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని భావించింది. వాస్తవాలను వెలికితీయడం దర్యాప్తు లక్ష్యమని స్పష్టం చేసింది. ప్రిన్సిపల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)ను అరెస్టు చేశారని, దర్యాప్తు పూర్తి అయ్యే వరకు వేచి చూద్దామని తెలిపింది. ఘటన జరిగిన ఐదు రోజుల తరువాత సీబీఐకి కేసు అప్పగించడం వల్ల పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, కేసులో పురోగతి పరిమితంగా ఉందని సీజేఐ జస్టిస్ డివై చంద్రచూడ్ అన్నారు.

హాస్పిటల్ ఆర్థిక అవకతవకలపై దర్యాప్తుకు సంబంధించి రిపోర్ట్‌ను సమర్పించాలని సీబీఐకి ఆదేశించింది. ఈ సందర్భంగా కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారం అంశంపై బెంగాల్ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కేసు విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని నిలిపివేయాలని కోరారు. ఇలాంటి కేసులను ప్రత్యక్ష ప్రసారం చేసినప్పుడు అది కేసుపై ప్రభావాన్ని చూపుతుందన్నారు. తాము నిందితులకు ప్రాతినిథ్యం వహించడం లేదని, ఆస్పత్రికి 50 ఏండ్ల రెప్యుటేషన్ ఉందని అన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ఇది ఓపెన్ కోర్టు అని, ఇది ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశమని తెలిపింది. కపిల్ సిబల్ స్పందిస్తూ ఇది తమ ప్రతిష్టకు సంబంధించిందని అన్నారు. ఛాంబర్‌లోని మహిళా న్యాయవాదులకు యాసిడ్ దాడి, లైంగికదాడి చేస్తామని బెదిరింపులు వస్తున్నాయని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న న్యాయవాదులకు సోషల్ మీడియాలో బెదిరింపులు వస్తున్నాయని సిబల్ ప్రస్తావించారు. ధర్మాసనం స్పందిస్తూ.. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని ఆపబోమని స్పష్టం చేసింది. లాయర్లు, ఇతరులకు ఏదైనా ముప్పు వాటిల్లితే చర్యలు తీసుకుంటామని సిబల్‌కు కోర్టు భరోసా ఇచ్చింది.

నైట్ షిఫ్ట్‌లో పని చేసే మహిళలను అడ్డుకోలేం

నైట్ షిఫ్ట్‌లో పనిచేసే మహిళలను అడ్డుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రాత్రి పూట పని చేయకూడదని వాళ్లకు చెప్పలేమని పేర్కొంది. నైట్ షిఫ్ట్‌ల నుంచి మహిళా డాక్టర్లకు విముక్తి కల్పిస్తూ బెంగాల్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఆ ఘటన తరువాత ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత దృష్ట్యా మహిళా డాక్టర్లు నైట్ షిఫ్ట్ లేకుండా చూసుకోవాలంటూ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని ఆదేశించింది. "రాత్రిపూట పనిచేయవద్దు అని మహిళలకు ఎలా చెబుతాం. వాళ్లకు మినహాయింపులు కాదు, సమాన అవకాశాలు కావాలి. అన్ని పరిస్థితుల్లోనూ పనిచేసేందుకు మహిళా డాక్టర్లు ఆసక్తిగా ఉన్నారు. వాళ్లు కచ్చితంగా అన్ని పరిస్థితుల్లో పనిచేయాలి. బెంగాల్ సర్కారు తమ నిర్ణయాన్ని సరి చేసుకోవాలి. 12 గంటల షిఫ్ట్‌ను దాటేసి మహిళలు పనిచేయరాదని చెప్పలేం. సైనిక దళాల్లో రాత్రి పూట పనిచేసే మహిళలు ఉన్నారు" అని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం మహిళా డాక్టర్లకు రక్షణ ఇచ్చేందుకు వెనుకాడితే, అప్పుడు కేంద్ర ప్రభుత్వం వాళ్లకు రక్షణ ఇస్తుందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. నైట్ షిఫ్ట్ విషయంలో సవరణ చేస్తూ కొత్త నోటిఫికేషన్ జారీ చేస్తామని బెంగాల్ సర్కారు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తెలిపారు.

అనుమతి లేకుండా కూల్చివేతలొద్దు

(మొదటిపేజీ తరువాయి)

చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను విచారించిన బెంచ్‌పై మేరకు తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

"ఈ కోర్టు అనుమతి లేకుండా తదుపరి విచారణ తేదీ వరకు ఎలాంటి కూల్చివేతలు జరగరాదు. అయితే బహిరంగ స్థలాలు, ఫుట్‌పాత్‌లు, వీధులు వంటి చోట్ల అనధికార నిర్మాణాల విషయంలో ఇలాంటివి వర్తించబోవు." అని కోర్టు ఆదేశించింది.

ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీని లక్ష్యంగా చేసుకుంటున్నారంటూ కథనాలు రూపొందిస్తున్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.

"బయట వచ్చే వార్తలు, కథనాలు మమ్మల్ని ప్రభావితం చేయవు. ఈ దశలో ఏ కమ్యూనిటీ లక్ష్యంగా అవుతోంది అనే ప్రశ్నల్లోకి వెళ్లం. అక్రమ కూల్చివేతలు ఒక్కటి చోటు చేసుకున్నా అది రాజ్యాంగ విలువలకు విరుద్ధమే." అని జస్టిస్ విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. అక్టోబరు 1వ తేదీకి విచారణను వాయిదా వేశారు.

నేరాలకు పాల్పడిన నిందితులను శిక్షించేందుకు అన్నట్లుగా వారి ఇళ్లను కూల్చివేసే పద్ధతిని నియంత్రించేందుకు దేశవ్యాప్తంగా మార్గదర్శకాలను రూపొందించాలని భావిస్తున్నట్లు ఈ నెల 2వ తేదీన బెంచ్ పేర్కొంది. అయితే అదే సమయలో అనధికార కట్టడాలు లేదా నిర్మాణాలను కాపాడరాదని నొక్కి చెప్పింది. ఇందుకు గానూ కొన్ని మార్గదర్శకాలు అవసరమవుతాయని, అప్పుడు కూల్చివేతలు కూడా చట్టానికి అనుగుణంగా జరుగుతాయని బెంచ్ పేర్కొంది.

కాగా యూపీ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ మాత్రం తన ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూనే వున్నారు. 'అందరి చేతులు బుల్డోజరుపై సరిపోవు' అంటూ లక్నోలో జరిగిన ఒక అధికారికక కార్యక్రమంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. అలాగే యూపీ విద్యుత్ శాఖ మంత్రి ఎ.కె.శర్మ కూడా ప్రభుత్వం బుల్డోజర్లను ఉపయోగించడాన్ని సమర్థిస్తున్నారు. గూండాయిజం, మాఫియా రాజ్‌ను తుడిచిపెట్టడానికిక ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ ఉపయోగించే సాధనమని వ్యాఖ్యానించారు.

కాగా ఈ వ్యాఖ్యలపై బెంచ్ తీవ్రంగా స్పందించింది. "సెప్టెంబరు 2 నాటి ఆదేశాలు తర్వాత, బుల్డోజరు న్యాయం కొనసాగుతుందని స్టేట్‌మెంట్‌లు వస్తున్నాయి." అని గవాయ్ అన్నారు. బుల్డోజర్ చర్యలను సమర్థిస్తూ ప్రకటనలు చేస్తున్నారు. మన దేశంలో ఇలా జరుగుతుందా? ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్ళిందా? దీనిపై మార్గదర్శకాలు రూపొందించాలి." అని జస్టిస్ విశ్వనాథన్ అన్నారు.

ఒక వ్యక్తి నేరానికి పాల్పడ్డాడని ఆ వ్యక్తి కుటుంబానికి చెందిన ఇళ్లను కూల్చివేసేందుకు బుల్డోజరులను గుజరాత్ ప్రభుత్వ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ఉపయోగించడాన్ని సెప్టెంబరు 12న త్రిసభ్య ధర్మాసనం తీవ్రంగా విమర్శించింది. నిందితుడి ఇంటిని కూల్చివేస్తామని బెదిరించడం చట్టబద్ధ పాలన గల దేశంలో ఊహించలేనిదని బెంచ్ పేర్కొంది. పిటిషనర్ జావేద్‌అలీ మెహబూమియా సయీద్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ప్రజాపాలన దినోత్సవాల్లో జాతీయ జెండాల ఆవిష్కరణ



సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంత్రి పొన్నం ప్రభాకర్



నల్లగొండ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో మంత్రి వెంకట్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో మంత్రులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్‌లోని సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండాను ఎగురవేశారు.

పాల్గొన్న మంత్రులు, స్పీకర్, శాసన మండలి చైర్మెన్

నవతెలంగాణ -విలేకరులు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భువనగిరి కలెక్టరేట్‌లో శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సూర్యాపేటలో బీసీ సంక్షేమ చైర్మెన్ నిరంజన్‌రెడ్డి జెండాను ఎగురవేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్, కరీంనగర్ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వరంగల్ జిల్లాలోని ఓసిటి ఎదురుగా ఐడీఓసీ మైదానంలో జాతీయ పతాకాన్ని రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

గ్రామాల్లో ఫైబర్ నెట్, సీసీ కెమెరాలు

పైలెట్ ప్రాజెక్టుగా మూడు గ్రామాల ఎంపిక : ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ : ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా టీ-ఫైబర్ ద్వారా కేంద్రం సహకారంతో ప్రతి గ్రామానికీ సేవలందించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సూచన మేరకు ఫైబర్ నెట్‌వర్క్ కోసం సంగారెడ్డి జిల్లా సంగుపేట, నారాయణపేట జిల్లా మద్దూరు, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్ గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్టు తెలిపారు. అదనంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ మూడు గ్రామాల్లో 360డిగ్రీస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించి సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు. రెండు నెలల్లో పైలెట్ ప్రాజెక్టు పూర్తి చేసి అక్కడ ఎదురయ్యే మంచి చెడులను, సాంకేతికపరమైన లోపాలను గుర్తించి ఎలాంటి సదుపాయాలు కల్పిస్తే నాణ్యమైన సేవలు లభిస్తాయో ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చి, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం వద్ద ఏర్పాటు చేస్తే తొలగిస్తామనడం సరికాదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా మెప్పు కోసమే రాజీవ్ విగ్రహాన్ని బీఆర్‌ఎస్ నేతలు తొలగిస్తామంటున్నారని ఆరోపించారు. దేశంలో సాంకేతిక విప్లవం తీసుకొచ్చిన ఘనత రాజీవ్ గాంధీదేనన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గతంలో అప్పులు తెచ్చి దుబారా చేశారని, ఇప్పుడు వాటిని సద్వినియోగం చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. పదేండ్లుగా నిర్బంధంలో ఉన్నామన్నారు. ఎమ్మెల్యేల అనర్హత వేటు అనే అంశం శాసనసభ స్పీకర్ పరిధిలోనిదన్నారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మెన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఉన్నారు.



కరీంనగర్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



వరంగల్ ఐడీఓసీ మైదానంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్



ములుగు కలెక్టరేట్‌లో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క



మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు

సంపాదకీయం

కాకూడదు...సం'క్షామం'




'సంక్షేమం, అభివృద్ధి... ఈ రెండూ మా ప్రభుత్వానికి రెండు కండ్లు. వాటిని జోడెద్దుల్లాగా పరుగులు పెట్టిస్తాం...' సరిగ్గా 20 ఏండ్ల క్రితం కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన వైఎస్ రాజశేఖరరెడ్డి అన్న మాటలివి. తెలంగాణ ఏర్పడ్డాక దశాబ్ద కాలంపాటు అధికార పీఠానికి దూరంగా ఉన్న ఆ పార్టీని గద్దెమీద కూర్చోబెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం తొమ్మిది నెలల క్రితం అవే మాటలను వల్లెవేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సంక్షేమం, ప్రజా పాలనలో అందరి సమస్యలనూ పరిష్కరిస్తామంటూ ఆయన భరోసానిచ్చారు. ఆ మేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్ (ప్రగతి భవన్)తో పాటు జిల్లాల్లోనూ 'ప్రజావాణి' కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి విదితమే. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించటం, వాటిని కంప్యూటరీకరించటం, మెసేజ్‌ల రూపంలో రశీదు (ఎక్నాలెడ్జ్‌మెంట్)లనివ్వటం వరకూ ఓకే.

> ఇప్పుడు రేవంత్ సర్కారు కూడా అదే రకమైన పోకడపోతే... ప్రజల్లో అసంతృప్తి పెరగటం ఖాయం. కేసీఆర్ జమానాతో పోలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతా వరణం, ఆందోళనలు చేసుకునే హక్కు, ప్రజా ప్రతినిధులను, ఇంకా చెప్పాలంటే సాక్షాత్తూ ముఖ్య మంత్రినే కలిసేందుకు అపాయింట్‌మెంట్లు దొరకటం హర్షించదగ్గ విషయాలే. కానీ ప్రజా ప్రతి నిధులను కలిసినంత ఈజీగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు దొరక్కపోవటమే ఇబ్బంది కలిగిస్తోంది.

కానీ ఆ తర్వాతే కథ ముందుకు సాగటం లేదని వినికిడి. రేషన్ కార్డులకు సంబంధించి తాజాగా ప్రభుత్వం ప్రకటించిన ఓ నిర్ణయమే అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. రేవంత్ సర్కారు కొలువుదీరిన కొత్తలోనే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకూ ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ తదితరాంశాల కోసం నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన విషయం మనకు ఎరుకే. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి ద్వారా మొత్తం 55 వారాల్లో 5.30 లక్షల దరఖాస్తులు అందినట్టు సర్కార్ వెల్లడించింది. హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో నిర్వహిస్తున్న ఆ కార్యక్రమానికి ఇప్పటి వరకూ 66 వేల అర్జీలు వచ్చాయన్నది అధికారిక వర్గాల లెక్క. వీటిలో అత్యధికం ఇండ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఉపాధి కల్పనకు సంబంధించినవే ఉండటం గమనార్హం. ఆయా దరఖాస్తుల్లో లక్షకు పైగా పెండింగ్‌లో ఉన్నాయనే విషయాన్ని అదే అధికారులు విడుదల చేసిన బులెటిన్ చెబుతోంది. పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పుడు... ఉన్న దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా మీనమేషాలు లెక్కించటం విడ్డూరం. అక్టోబరులో రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభిస్తామంటూ మంత్రివర్గ ఉపసంఘం చెప్పటం మరీ హాస్యాస్పదం. అంటే ఇప్పటి వరకూ వచ్చిన దరఖాస్తులను ఇంతవరకూ చూడలేదా? చూసినా వాటిని ఏం చేయాలో తెలియలేదా? అనే సందేహాలు రాకమానవు. డిసెంబరు ఏడో తేదీ నాటికి కాంగ్రెస్ కొలువుదీరి ఏడాది పూర్తి కాబోతున్న స్థితిలో... ఇంకా కమిటీలు, కాలయాపనలు అంటే జనంలో విశ్వసనీయతను తమంతట తాము తగ్గించుకున్నట్టే.

గత పదేండ్లపాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీ(టీ)ఆర్ఎస్... ఆ కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వకుండా పేదల సహనానికి పరీక్ష పెట్టింది. దీంతో ఆ కార్డు ప్రాతిపదికగా ఉన్న అనేక ప్రయోజనాలను వారు పొందలేకపోయారు. ఇప్పుడు రేవంత్ సర్కారు కూడా అదే రకమైన పోకడపోతే... ప్రజల్లో అసంతృప్తి పెరగటం ఖాయం. కేసీఆర్ జమానాతో పోలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం, ఆందోళనలు చేసుకునే హక్కు, ప్రజా ప్రతినిధులను, ఇంకా చెప్పాలంటే సాక్షాత్తూ ముఖ్యమంత్రినే కలిసేందుకు అపాయింట్‌మెంట్లు దొరకటం హర్షించదగ్గ విషయాలే. కానీ ప్రజా ప్రతినిధులను కలిసినంత ఈజీగా ప్రజల సమస్యలకు పరిష్కారాలు దొరక్కపోవటమే ఇబ్బంది కలిగిస్తోంది. ఇప్పటికిప్పుడు కాంగ్రెస్ కుర్చీని లాక్కుని, ఆ సీటు మీద తాను కూర్చోవాలన్నట్టు వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ చెప్పినంత తీవ్ర స్థాయిలో కాకపోయినా అనేకానేక సమస్యలు రాష్ట్రంలో పేరుకుపోయాయి.

గురుకులాల్లోని టీచర్లకు రెండు నెలలుగా వేతనాలు రాకపోవటం, పిల్లలకు నాణ్యమైన, పౌష్టికాహారం అందకపోవటం, మహిళల ఉచిత ప్రయాణానికి బస్సులు సరిపోకపోవటం, ఆస్పత్రుల్లో వైద్యులకు సరైన భద్రత లేకపోవటం, బదిలీల్లో సీనియర్లను జిల్లాలకు పంపించటం, అక్కడ సరైన మౌలిక వసతులు, సదుపాయాలు లేకపోవటం, 33 జీవో వల్ల వైద్య కళాశాలల్లో అడ్మిషన్లలో జాప్యం జరగటం వీటిలో ముఖ్యమైనవి. ఇవిగాకుండా రైతు రుణమాఫీ అసంపూర్ణం, రైతు భరోసా ఇంత వరకూ ఇవ్వకపోవటం, ఎన్నికల్లో హామీనిచ్చిన విధంగా సామాజిక పింఛన్లను పెంచకపోవటం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ఆర్థిక సాయం ముచ్చటే లేకపోవటం కూడా రేవంత్ సర్కార్‌ను అప్రదిష్ట పాల్జేస్తున్నాయి. ఇవన్నీ పేదలు, రైతులకు సంబంధించిన కీలకాంశాలు.. వారి సంక్షేమానికి చెందిన విషయాలు. ఆయా పథకాలు, కార్యక్రమాలను విస్మరిస్తే ఇబ్బందులు తప్పవనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తెరిగితే దానికే మంచిది.



లాల్ సలామ్...

కాలపు సెలిమలో ఇంకిపోయిన
బడుగుల సముద్రమా
లాల్ సలామ్..
కాలపు తీరంలో కరిగిపోయిన
విప్లవ కెరటమా
లాల్ సలామ్..

కాలపు ప్రయాణంలో
ప్రగతి పథివై సాగిన మహానేతా
ప్రశ్నించే ప్రజల గొంతుక
లాల్ సలామ్..
ఎర్రజెండా సూర్యతేజమా
ఎజెండాను దేశమంతా చాటిన
కమ్యూనిజ భావసారమా
లాల్ సలామ్..

ప్రజల పొద్దై ప్రజాభిమాన ముద్దుయై
కాలపు సడిలో జ్ఞాపక చరితైన
ఏచూరి సీతారామా
లాల్ సలామ్..

రాజకీయ క్షేత్రంలో
ప్రజాస్వామ్య పంథాలో
మెరుగైన మేరుశిఖరమె..
ప్రతి హృదయ ఉత్తేజ కిరణమై
మానవత్వ ప్రతిమై
కల్మశంలేని కాంతి పుంజమై
భారత పుస్తకంలో ఏచూరి సీతారామై
ఓ గొప్ప ప్రజా ప్రస్థాన
కమ్యూనిజం కొండ
లాల్ సలామ్..
ఎన్నో గుండెల్లో చప్పుడై విలసిల్లిన
ఈ కమ్యూనిజం దిగ్గజమా
లాల్ సలామ్..

- అభిరామ్

అమెరికా ఎన్నికల్లో కమ్యూనిజం చర్చ!



ఎం కోటేశ్వరరావు
8331013288


నవంబరు ఐదవ తేదీన అమెరికాలో ఎన్నికలు సజావుగా జరుగుతాయా? తనకు ప్రతికూలంగా ఫలితం వస్తే డోనాల్డ్ ట్రంప్ అంగీకరిస్తాడా? గెలుపుకోసం ఎంతకైనా తెగిస్తాడా? ఇలా ఎన్నో ప్రశ్నలు, సందేహాల నడుమ ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మరోసారి ట్రంప్ మీద హత్యాయత్నం జరిగిందని, దుండగుడిని పట్టుకున్నట్లు భద్రతా సిబ్బంది ప్రకటించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో తన స్వంత మైదానంలో గోల్ఫ్ ఆడుతుండగా భద్రతా సిబ్బంది సమీపంలో ఉన్న పొదల్లో సాయుధ దుండగుడిని గమనించి కాల్పులు జరిపారు. దాంతో దుండగుడు రయన్ రౌత్ తన వద్ద ఉన్న ఎకె-47 మాదిరి తుపాకి, మరికొన్ని వస్తువులను వదలి తన కారులో పారిపోగా 65 కిలోమీటర్ల తరువాత పట్టుకున్నట్లు చెబుతున్నారు. రౌత్ కాల్పులు జరిపాడా లేక పొదల్లో శబ్దాలకారణంగా అతని ఉనికిని గుర్తించి భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారా అన్నది వెంటనే స్పష్టం కాలేదు. అతని సామాజిక మాధ్యమ ఖాతాలను పరిశీలించగా డెమోక్రటిక్ పార్టీ అభిమాని అని తేలినట్లు చెప్పారు. అయితే అది వాస్తవం కాదని గత ఎన్నికల్లో ట్రంప్‌కు ఓటువేశాడని, తాజా ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడిన భారతీయ మూలాలున్న వివేక్ రామస్వామి చివరి వరకు పార్టీ అభ్యర్థిగా డోనాల్డ్ ట్రంప్ మీద పోటీలో ఉండాలని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినట్లు మరొక ప్రచారం. జూలై 13వ తేదీన జరిపిన కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి తమ్మెకు గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే దుండగుడిని పట్టుకొని కాల్చి చంపారు. భద్రతా వైఫల్యానికి బాధ్యత వహిస్తూ రహస్య భద్రతా సిబ్బంది డైరెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ట్రంప్ మద్దతుదారైన ప్రపంచ ధనికుడు ఎలాన్ మస్క్ తాజా ఉదంతం మీద స్పందించిన తీరుకు నెటిజన్లు మండిపడుతున్నారు. హత్యాయత్నాలు అధ్యక్షుడు జోబైడెన్, పోటీలో ఉన్న కమలాహారిస్ మీద ఎందుకు జరగటం లేదు, ట్రంప్ మీదనే ఎందుకు అంటూ 'ఎక్స్' ద్వారా మస్క్ స్పందించాడు. ఇది అత్యంత బాధ్యతారహితం అని అనేక మంది గర్హించారు. ట్రంప్‌కు ఏమీ కానందుకు జో బైడెన్, కమలా హారిస్ ఊపిరి పీల్చుకున్నారు. సాధారణంగా అధ్యక్షులు గనుక గోల్ఫ్ ఆడితే ఆ మైదానం చుట్టూ భద్రతా సిబ్బంది వలయంగా ఏర్పడతారు. ట్రంప్ మాజీ గనుక అలాంటి రక్షణ కల్పించలేదని అధికారులు వివరణ ఇచ్చారు. అమెరికాలో హింసాకాండకు తావులేదని ఎక్స్‌లో కమల స్పందించారు. అమెతో జరిగిన సంవాదంలో ట్రంప్ వెనుకబడినట్లు సర్వేలు తేల్చిన తరువాతే ఈ ఉదంతం జరగటం అనేక అనుమానాలకు తావిస్తోంది.

ఒకవేళ ఓడితే ఫలితాన్ని డోనాల్డ్ ట్రంప్ అంగీకరిస్తాడా, గతంలో మాదిరే అనుచరులను రెచ్చగొట్టి దాడులకో మరొకదానికో పాల్పడతాడా? అన్న అనుమానాలు పెరుగుతున్నాయి. ఎన్నికలు జరిగే నవంబరు ఐదవ తేదీ దగ్గర పడేకొద్దీ అనూహ్యపరిణామాలు సంభవిస్తాయోమోనని భావిస్తున్నారు. జో బైడెన్ అధ్యక్ష అభ్యర్థిగా ఉన్న సమయంలో ట్రంప్ ముందంజలో ఉన్నాడు. తొలిసారి హత్యాయత్నం తరువాత ఆధిక్యత మరింత పెరిగి విజయం ఖాయం అనే వాతావరణం ఏర్పడింది. కమలాహారిస్ రంగ ప్రవేశంతో అదంతా తారుమారైంది. తీవ్రమైన పోటీ స్వల్ప ఆధిక్యంలో కమల ఉన్నట్లు సర్వేలు వెల్లడించాయి. సెప్టెంబరు పదవ తేదీన వారిద్దరి మధ్య జరిగిన సంవాదంలో ట్రంప్ తేలిపోయాడు. కొన్ని సర్వేలు కమల 23పాయింట్ల ఆధిక్యతతో ఉన్నట్లు పేర్కొన్నాయి. తరువాత జరిగిన మరికొన్ని సర్వేలలో కూడా ఆమెదే పైచేయిగా ఉంది.దాంతో తాను మరోసారి ఆమెతో బహిరంగ చర్చలో పాల్గొనాల్సిన అవసరం లేదని ట్రంప్ సంచలన ప్రకటన చేశాడు. దీంతో పోలింగ్‌కు ముందే ఓటమిని అంగీకరించి నట్లు కావటంతో మాటమార్చాడు. పిచ్చోడు ఎప్పుడేం మాట్లాడ తాడో ఏం చేస్తాడో తెలియదు, ట్రంపు కూడా అంతే. అక్టోబరులో జరిగే మరో రెండు చర్చల్లో పాల్గొనేదీ లేనిదీ చెప్పలేము. ఒక వేళ సిద్దపడకపోతే పారిపోతున్నట్లుగానే ఓటర్లు భావిస్తారు.కమలతో సంవాదాన్ని నిర్వహించిన ఏబిసి సంస్థ వీక్షకుల అభిప్రాయాన్ని తారుమారు చేసిందని తానే ముందున్నట్లు ట్రంప్ ప్రకటించుకున్నాడు.గొప్ప చర్చ చేసినందుకుగాను ఓటర్లు తనకు మద్దతు ఇవ్వటం ప్రారంభించారని, సర్వేల్లో అదే వెల్లడైనా కుహనా మీడియా వాటిని వెల్లడించటం లేదు రిగ్గింగు చేసినట్లు స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికలో రాసుకున్నాడు.

> ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోయినా కమ్యూనిజం, సోషలిజాల గురించి పెద్ద చర్చే నడుస్తున్నది. గతకొద్ది దశాబ్దాలుగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టిన కారణంగా అనేక మంది బుర్రల్లో అది రాయిలా గడ్డకట్టింది. తాను గెలవాలంటే పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఒక అస్త్రంగా చేసుకోవాలని ట్రంప్ ఎంచుకున్నాడు.దానిలో భాగంగా 'కామ్రేడ్ కమల మన దేశానికి భయంకరమైన వ్యక్తి. అమె ఒక మార్క్సిస్టు లేదా కమ్యూనిస్టు, ఎప్పుడూ కమ్యూనిస్టుగానే ఉన్నారు, భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటారు, ఎన్నుకుంటే అమెరికా చరిత్ర ముగిసినట్లే' అని న్యూయార్క్ ఎకనమిక్ క్లబ్ ప్రసంగంలో అన్నాడు. అమెరికా చరిత్రలో తొలిసారిగా ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి, స్వేచ్ఛను తిరస్కరిస్తూ మార్క్సిజం, కమ్యూనిజం, ఫాసిజాలను అనుసరిస్తున్నారన్నాడు.

అమెరికా ఎన్నికల్లో మైలురాళ్లుగా చెప్పుకోవాల్సి వస్తే జూలై 15న రిపబ్లికన్ పార్టీ జాతీయ సమావేశం ట్రంప్‌ను, ఆగస్టు 19న కమలాహారిస్‌ను డెమోక్రటిక్ పార్టీ జాతీయ సమావేశం అభ్యర్థులుగా ఖరారు చేశాయి.సెప్టెంబరు పదిన ట్రంప్-కమల తొలి సంవాదం జరిగింది.నవంబరు ఐదున ఎన్నికలు జరుగుతాయి. ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. జనవరి ఆరున ఫలితాలను నిర్ధారిస్తారు.జనవరి 20న నూతన అధ్యక్ష పాలన ప్రారంభం అవుతుంది. ప్రముఖులుగా ఉన్నవారు, ఓటర్లను ప్రభావితం చేసే వారు కొందరు ఎన్నికల్లో ఏదో ఒక పక్షాన్ని లేదా అభ్యర్థిని బలపరుస్తారు. ఎక్స్ అధిపతి, ప్రపంచంలోనే పెద్ద కుబేరుడు ఎలన్ మస్క్ ట్రంప్‌ను సమర్ధిస్తున్నాడు. అదే విధంగా ప్రముఖ గాయని, నటి, రచయిత్రి టేలర్ స్విఫ్ట్ కమలా హారిస్‌ను బలపరుస్తున్నట్లు ప్రకటించింది. ఎలన్ మస్క్ సామాజిక మాధ్యమాల్లో ఉన్న అసహ్యకరమైన మనిషి అంటూ మస్క్ కుమార్తె వివియన్ జెనా విల్సన్ విరుచుకుపడింది.టేలర్ స్విఫ్ట్‌ను ఉద్దేశించి ఒక ఎక్స్ చేస్తూ " బాగుంది టేలర్..నేను నీకు ఒక బిడ్డను ఇస్తా, నా జీవితాతం నీ కుక్కలకు కాపలా కాస్తా " అని మస్క్ పేర్కొన్నాడు. అమెరికా ఎన్నికల ప్రచారం ఎంతలా దిగజారి ఉంటుందో దీన్ని బట్టి అర్ధం చేసుకోవచ్చు. టేలర్ వ్యతిరేకతను తట్టుకోలేని ట్రంప్ అందుకు తగిన మూల్యం చెల్లిస్తావంటూ బెదిరింపులకు పూనుకున్నాడు.

ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పోటీలో లేకపోయినా కమ్యూనిజం, సోషలిజాల గురించి పెద్ద చర్చే నడుస్తున్నది. గతకొద్ది దశాబ్దాలుగా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొట్టిన కారణంగా అనేక మంది బుర్రల్లో అది రాయిలా గడ్డకట్టింది. తాను గెలవాలంటే పాతబడిన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఒక అస్త్రంగా చేసుకోవాలని ట్రంప్ ఎంచుకున్నాడు.దానిలో భాగంగా కామ్రేడ్ కమల మన దేశానికి భయంకరమైన వ్యక్తి. అమె ఒక మార్క్సిస్టు లేదా కమ్యూనిస్టు, ఎప్పుడూ కమ్యూనిస్టుగానే ఉన్నారు, భవిష్యత్‌లో కూడా అలాగే ఉంటారు, ఎన్నుకుంటే అమెరికా చరిత్ర ముగిసినట్లే' అని న్యూయార్క్ ఎకనమిక్ క్లబ్ ప్రసంగంలో అన్నాడు. అమెరికా చరిత్రలో తొలిసారిగా ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి, స్వేచ్ఛను తిరస్కరిస్తూ మార్క్సిజం, కమ్యూనిజం, ఫాసిజాలను అనుసరిస్తున్నారన్నాడు. ఆమె రూపంలో స్టాలిన్ జన్మించాడని చెప్పాడు. మౌలికంగా కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా ఆమె కమ్యూనిస్టు టోపీ, ఎర్ర కోటు ధరించినట్లు ఒకటి, ఇంకా కమ్యూనిస్టు అని చెప్పే రకరకాల చిత్రాలను సృష్టించి వైరల్ చేయించాడు. కమల అభ్యర్థిగా నిర్ణయంగాక ముందే డెమోక్రటిక్ పార్టీని దేవుడు లేడని చెప్పే కమ్యూనిస్టు అని వర్ణించాడు. మన ప్రత్యర్థిని ఒక కమ్యూనిస్టు,సోషలిస్టు లేదా అమెరికాను నాశనం చేసే మరోవ్యక్తిగా చిత్రించి ప్రచారం చేయాలని తన మద్దతుదార్లను బహిరంగంగానే కోరాడు.ఎలన్‌మస్క్ తన సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా కమ్యూనిస్టు వ్యతిరేకతను రెచ్చగొడుతున్నాడు. సోవియట్ నాయకుల మాదిరి కమల బొమ్మలను సృష్టించాడు.ఆమెను తొలి రోజు నుంచే ఒక కమ్యూనిస్టు నియంతగా మార్చాడు. అమెరికన్ల ఆర్థిక స్వేచ్ఛను హరించేందుకు సిద్ధంగా ఉన్న ఒక సోషలిస్టు అంటూ వ్యాఖ్యలను జోడించి ప్రచారంలో పెట్టాడు.



> కమలా హారిస్ కమ్యూనిస్టు కాదు, డెమోక్రటిక్ పార్టీలో ఉన్న ఉదారవాదుల్లో ఒకరు మాత్రమే. డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ కొన్ని అంశాలలో ఆమె వైఖరిని బట్టి పురోగామివాదిగా పరిగణిస్తున్నట్లు చెప్పాడు. అమెరికాలో గాడిద(డెమోక్రటిక్ పార్టీ)-ఏనుగు (రిపబ్లికన్ పార్టీ) గుర్తుల మీద ఎవరు పోటీ చేసినా రెండింటినీ బలపరిచే కార్పొరేట్లకు ఆమోదమైతేనే రంగంలో ఉంటారు. కమల కూడా అంతే. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఏమి చెప్పినప్పటికీ కార్పొరేట్లకు ప్రాతినిధ్యం వహించే గోల్డ్‌మన్ శాచస్ సంస్థ ట్రంప్ కంటే కమల మెరుగని పేర్కొన్నది. ఆమె గెలిస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు శక్తి వస్తుందని, ట్రంప్ వస్తే దెబ్బతింటుందని చెప్పింది.

కమలా హారిస్ కమ్యూనిస్టు కాదు, డెమోక్రటిక్ పార్టీలో ఉన్న ఉదారవాదుల్లో ఒకరు మాత్రమే. డెమోక్రటిక్ సోషలిస్టు నేత బెర్నీ శాండర్స్ కొన్ని అంశాలలో ఆమె వైఖరిని బట్టి పురోగామివాదిగా పరిగణిస్తున్నట్లు చెప్పాడు. అమెరికాలో గాడిద(డెమోక్రటిక్ పార్టీ)-ఏనుగు (రిపబ్లికన్ పార్టీ) గుర్తుల మీద ఎవరు పోటీ చేసినా రెండింటినీ బలపరిచే కార్పొరేట్లకు ఆమోదమైతేనే రంగంలో ఉంటారు. కమల కూడా అంతే. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఏమి చెప్పినప్పటికీ కార్పొరేట్లకు ప్రాతినిధ్యం వహించే గోల్డ్‌మన్ శాచస్ సంస్థ ట్రంప్ కంటే కమల మెరుగని పేర్కొన్నది. ఆమె గెలిస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు శక్తి వస్తుందని, ట్రంప్ వస్తే దెబ్బతింటుందని చెప్పింది. కమ్యూనిస్టు నియంత మెరుగని ప్రపంచంలోని అతి పెద్ద పెట్టుబడిదారులు ఎలా చెబుతున్నా రంటూ కొందరు గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడిదారుల చక్రవర్తి ట్రంప్ ఆర్థిక ప్రణాళిక ప్రకారం కమ్యూనిస్టు కామ్రేడ్ కమల చెబుతున్నదాని కంటే లోటు ఐదు రెట్లు పెరుగుతుందని తటస్థంగా ఉంటే పెన్ వార్టన్ బడ్జెట్ నమూనా నివేదిక చెప్పిందని ఒకరు పేర్కొన్నారు. ఇంతకీ కమల లేదా డెమోక్రటిక్ పార్టీ చెబుతున్నదేమిటి ? యాభైవేల డాలర్లతో ప్రారంభించే చిన్న అంకుర సంస్థలకు పన్ను రాయితీలను వర్తింపచేయటం, బడా సంస్థలకు పన్నులు పెంచటం, దీన్నే కమ్యూనిజం అంటున్నారు. స్కూలు పిల్లలకు ఉచితంగా మధ్యాహ్న భోజనం పెట్టటాన్ని కూడా సోషలిజం అని వర్ణించేబాపతు ఇలా చెప్పటంలో ఆశ్చర్యం ఏముంది?

వాషింగ్టన్ ఎగ్జామినర్ అనే మీడియాతో కమలాహారిస్ మాట్లాడిన అంశాలను రిపబ్లికన్లు కమ్యూనిజంగా వర్ణించటాన్ని పురోగామి మార్పు ప్రచార కమిటీ స్థాపకుల్లో ఒకరైన ఆడమ్ గ్రీన్ ఎద్దేవా చేశాడు. రానున్న వారాల్లో గుడ్ల ధర ఏడు నుంచి తొమ్మిది డాలర్లకు పెరగటాన్ని అడ్డుకుంటామని కమలా హారిస్ చెబుతున్నారు, మితవాదులు దాన్నే గనుక కమ్యూనిజం అంటే అత్యధిక అమెరికన్లు దాన్నే కోరుకుంటారు, మీరేం మాట్లాడుతున్నారో అర్ధమౌతోందా అని గ్రీన్స్ ప్రశ్నించాడు.ధరలను అదుపు చేయటాన్ని కూడా ట్రంప్ కమ్యూనిజంగా వర్ణించాడు. కరోనా కాలం నాటితో పోల్చితే ప్రస్తుతం అమెరికాలో ధరలు 20శాతం పెరిగాయి.నిజవేతనాలు గణనీయంగా పడిపోతున్నా యి. అందుకే బతుకు దుర్భరమౌతున్న కారణంగా అనేక మంది యువతకు సోషలిజం, కమ్యూనిజాల గురించి తెలియకపోయినా అదే కావాలని కోరుకుంటున్నారు. ట్రంప్ వంటి వారు చేసే విపరీత ప్రచారం వాటి గురించి ఆసక్తి పెంచేందుకు దోహదం చేస్తున్నదంటే అతిశయోక్తి కాదు. అందుకే పెట్టుబడిదారీ దేశాల్లో చేస్తున్న సర్వేల్లో యువతలో సోషలిజం పట్ల సానుకూలత వెల్లడి అవుతున్నది. అమెరికాలో డెమోక్రాట్లను కమ్యూనిస్టులని ప్రచారం చేయటం ఇదే మొదటి సారి కాదు. ఈ ఎన్నికల్లో అది మరింతగా పెరిగింది.

మారింది ప్రభుత్వమే..విధానాలు కాదు



వి.ఎస్. రావు
9490098890

అధికారంలోకి రాగానే ఆర్టీసి బస్‌లలో మహిళలకు ఉచిత రవాణాను అనుమతిస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన వాగ్దానం నిలబెట్టుకున్నది. మహిళలకు ఉచిత ప్రయాణం మంచిదేనని, ఆర్టీసి నిలబడ్తుందని, మహిళలు రవాణాపై పెట్టే ఖర్చు ఇతర అవసరాలకు వాడుకొన్నందున రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పెరుగుతుందని ఈ స్కీంను స్వాగతిస్తూ డిసెంబర్ 7న ఇదే పత్రికలో వ్యాసం రాశాము.

ఈ స్కీం అమలుకు అవసరమైన మౌలిక వనరులు, బస్‌లు, సిబ్బంది లేకపోయినా ప్రభుత్వం ప్రకటన చేసిన రెండు రోజులలోనే ఆర్టీసి అమలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజల పట్ల ఆర్టీసి కార్మికులకు వున్న ప్రేమ, బాధ్యత అర్థమవుతుంది. ఈ స్కీం అమలు చేయబట్టి తొమ్మిది నెలలు గడిచింది. సెప్టెంబర్ పదోతేదీన గౌరవ ముఖ్యమంత్రి ఆర్టీసిపై సమీక్ష నిర్వహించారు.మహాలక్ష్మీ స్కీం అమలు చేసిన నాటి నుండి సమీక్ష చేసిన నాటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని, రూ.2840.71 కోట్లు మహిళల డబ్బు ఆదా అయిందని రవాణా మంత్రి తెలిపినట్లు పత్రికలలో వచ్చింది. ఆ డబ్బులలో ఆర్టీసికి ఎంత ఇచ్చారనేది అధికారులు కానీ, ప్రభుత్వం కాని ప్రకటన చేయలేదు. పై లెక్కలను పరిశీలిస్తే రోజుకి సగటు 31 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇందుకుగాను రూ.11 కోట్లు ఆర్టీసి ఆదాయం కోల్పోతున్నది అని అర్థం చేసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది.ఆ బడ్జెట్‌లో ఆర్టీసికి రూ. 3084 కోట్లు కేటాయించింది. ఇదికాక ఎస్సీ, ఎస్టీ,సబ్‌ప్లాన్ నిధులు నుండి రూ.1000 కోట్లు ప్రతిపాదించిందిు. బడ్జెట్‌లలో ప్రవేశపెట్టినవి యధాతధంగా అమలు చేసిన చరిత్ర లేదు. రివైజ్డ్ ఎస్టిమేషన్స్ పేరుతో కుదిస్తారు. చివరికి ఇచ్చేదెంతో తెలియదు. 3084 కోట్లు పూర్తిగా ఆర్టీసికి ఇస్తారని భావిస్తే కేవలం నెలకు 257 కోట్లు అవుతుంది. రోజుకి 8.5 కోట్లు, ఖర్చేమో 11 కోట్లు అవుతుంది. రోజుకి 2.5 కోట్లు ఆర్టీసి నష్టపోతుంది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో ప్రతిపాదించిన నిధులను రవాణా శాఖ పద్దులలో చేర్చి చూపించలేదు కనుక అవి వస్తాయా?లేదా? అనేది వేచి చూడాలి.



విద్యార్థులకు, ఎన్.జి.ఓ లు, ఇతరులకు ఇస్తున్న రాయితీల విలువ సుమారు 600 కోట్లు వుంటుంది.దీనికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. అంటే రోజుకి 1.64 కోట్లు (ఆర్టీసి) ఆదాయం కోల్పోతుంది. ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించే వారి దగ్గర నుండి ఐదు రకాల సెస్‌లను వసూలు చేస్తున్నారు. అయితే ఆ ఆదాయాన్ని రోజువారి లెక్కలలో చూపించడం లేదు. రోజుకి 31 లక్షల మంది ప్రయా ణిస్తున్న మహిళలకు సంబంధించిన సెస్‌ల డబ్బులు ప్రభుత్వం రీ-ఎంబర్స్ చేయాలి. ఇది కూడా సుమారు 600 కోట్లు వుంటుంది. రోజుకి 1.64 కోట్లు. ఈ మొత్తం పరిశీలించినప్పుడు బడ్జెట్‌లో పెట్టకుండా ఆర్టీసిపై పడుతున్న భారం (2.5 + 1.64+ 1.64) రోజుకి 5.78 కోట్లు. అంటే ఏడాదికి రూ.2110 కోట్లు ఆర్టీసిపై భారం పడుతున్నది. రూ.2110 కోట్లు ప్రభుత్వం చెల్లిస్తుందా? లేదా? అనేది ముఖ్యమంత్రి సమీక్షలో స్పష్టత రాలేదు. ఆర్టీసీకి 6322 కోట్లు అప్పులు, లయబిలిటీస్ వున్నాయని, అప్పులు రీ స్ట్రక్చర్ చేసుకోవాలని, వడ్డీ భారం తగ్గించుకోవాలని ముఖ్యమంత్రి సూచించినట్లు, దానిని అమలులోకి తెచ్చేందుకు ఒక కమిటీని వేసినట్లు వార్తల ద్వారా తెలుస్తున్నది.

మహాలక్ష్మి పథకం సమర్థవంతంగా అమలు జరగాలన్నా నిజంగా అర్హులైన లబ్దిదారులు అందరూ ఈ పథకం ద్వారా ఉచిత ప్రయా ణం పొందాలంటే మరో 3వేల బస్‌లు కొత్త, పాత రూట్లలో ప్రవేశపెట్టాలి. డిసెంబర్ 2023 నాడు 35-40 లక్షలుగా వున్న ప్రయా ణీకుల సంఖ్య నేడు 55-60 లక్షలు వుంటుంది. అందులో 65శాతం వరకు మహాలక్ష్మిలు వుంటున్నారు. 3వేల బస్‌లు కొనుగోలుకు ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క పైసా ఇవ్వలేదు. నిజం చెప్పాలంటే గడచిన నాలుగేండ్లలో గత ప్రభుత్వం కానీ, తొమ్మిది నెలలుగా పాలిస్తున్న కొత్త ప్రభుత్వం కానీ బస్‌ల కొనుగోలుకు నిధులివ్వలేదు. సరిపోయినన్ని బస్‌లు లేక ప్రయాణీకులు అవస్తలు పడుతున్నారు. దీనికితోడు పెరిగిన పనిభారంతో కార్మికులూ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. రోజుకి 2-3 గంటలు డ్యూటీ లేటు కావడం, ఆధార్ పరిశీలించి టిక్కెట్లు ఇవ్వడం, టిమ్స్‌లోని లోపాల వల్ల సాధారణ టిక్కెట్లు బదులు జీరో టిక్కెట్లు రావడం, రద్దీలో వాటిని గమనించలేకపోతే పైఅధికారులు కేసులు రాసి ఇంటికి పంపడం, టిమ్స్ సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేయకపోవడం, వాటిపైన ఇచ్చిన వినతిపత్రాలు అధికారులు పట్టించుకోకపోవడం, ఇలా ప్రతిరోజూ కార్మికులు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు.

ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. కానీ ఆర్టీసి పట్ల, ఆర్టీసి కార్మికుల పట్ల పాలకుల వైఖరి మారలేదు అనుకోవలసి వస్తున్నది. ఆర్టీసిని ప్రజా రవాణా సంస్థగా కాకుండా వ్యాపార సంస్థగా చూస్తున్నారు. ఆర్టీసికి ఇవ్వవలసిన రీ-ఎంబర్స్‌మెంట్లు కూడా పూర్తిగా బడ్జెట్‌లో పెట్టడంలేదు. పెట్టినా కూడా పూర్తిగా చెల్లించడం లేదు. ఆర్టీసికి వున్న అప్పులను ప్రభుత్వ పెట్టుబడిగా మార్చి భారం తగ్గించాలని అడుగు తుంటే 'రీ-స్ట్రక్చర్ చేసుకోండి' అంటున్నారు. గత ప్రభుత్వం 2018లో పదిమంది నిపుణులతో 'ఎక్స్‌పర్ట్ కమిటీ' వేసినా, నివేదికను ఇంత వరకు బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ప్రభుత్వం సూచనతో మరో కమిటీని నియమిస్తున్నారు. కొత్తబస్సుల కొనుగోలు నిధులివ్వక పోవడ ంతో నేటికీ ప్రయాణికులకు కాలంచెల్లిన బస్సులే దిక్కవుతున్నాయి.వెంటనే వాటిని మార్చాలి, కానీ అందుకు నిధుల లేమి ఆటంకంగా వుంది.

బడ్జెట్‌లో రెండు శాతం నిధులు ఆర్టీసికి మూడేండ్లిస్తే ఆర్టీసి స్వతంత్రంగా నిలబడుతుందని కార్మిక సంఘాలు ఎప్పుడినుంచో కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రజల అవసరాల మేరకు బస్‌లు పెంచడం, మంచి కండిషన్‌లో వున్న బస్‌లు కావాలనేది ప్రధానంగా ప్రబల సమస్య. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో ఆ అవసరం మరింత పెరిగింది. కానీ ఆ సమస్యను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పట్టించుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేయాల్సింది ప్రజలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్నవారు. ప్రభుత్వం సరైన పద్ధతిలో నిధులు కేటాయించకపోతే సంస్థ అభివృద్ధి కుంటుపడటమేకాక, మహాలక్ష్మి స్కీం లబ్ధి కూడా కొద్దిమందికే పరిమితమయ్యే ప్రమాదం వుంది. ప్రజా ప్రభుత్వం అంటున్న ఈ ప్రభుత్వం కూడా ఆర్టీసి కార్మికోద్యమంపై ఆంక్షలు కొనసాగిస్తున్నది. ఎంప్లాయి వెల్ఫేర్ బోర్డులను తిరిగి కొత్తవారితో నింపుతున్నది.

> ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. కానీ ఆర్టీసి పట్ల, ఆర్టీసి కార్మికుల పట్ల పాలకుల వైఖరి మారలేదు అనుకోవలసి వస్తున్నది. ఆర్టీసిని ప్రజా రవాణా సంస్థగా కాకుండా వ్యాపార సంస్థగా చూస్తున్నారు. ఆర్టీసికి ఇవ్వవలసిన రీ-ఎంబర్స్‌మెంట్లు కూడా పూర్తిగా బడ్జెట్‌లో పెట్టడంలేదు. పెట్టినా కూడా పూర్తిగా చెల్లించడం లేదు. ఆర్టీసికి వున్న అప్పులను ప్రభుత్వ పెట్టుబడిగా మార్చి భారం తగ్గించాలని అడుగు తుంటే 'రీ-స్ట్రక్చర్ చేసుకోండి' అంటున్నారు. గత ప్రభుత్వం 2018లో పదిమంది నిపుణులతో 'ఎక్స్‌పర్ట్ కమిటీ' వేసినా, నివేదికను ఇంత వరకు బహిర్గతం చేయలేదు. ఇప్పుడు ప్రభుత్వం సూచనతో మరో కమిటీని నియమిస్తున్నారు. కొత్తబస్సుల కొనుగోలు నిధులివ్వక పోవడ ంతో నేటికీ ప్రయాణికులకు కాలంచెల్లిన బస్సులే దిక్కవుతున్నాయి.

కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించక గత ప్రభుత్వం వలే వ్యవహరిస్తున్నది. సామాజిక భద్రత పథకాలైన పి.ఎఫ్., ఎస్.ఆర్.బి.ఎస్, ఎస్‌బిటి ట్రస్టలకు బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌ను నియమించకుండానే కాలం గడుపుతున్నది. ఆర్టీసి నిర్వహణలో కార్మిక సంఘాల భాగస్వామ్యం లేకుండా చేస్తున్నది. అలాగే కార్మికుల చేత నిర్వహించుకొంటున్న కో-ఆపరేటివ్ సొసైటీకి ఎన్నికలు జరిపేలా చర్యలూ తీసుకోవడం లేదు.

పై విషయాలన్ని గమనించినప్పుడు, మారింది పాలకులే తప్ప, ఆర్టీసి సంస్థ పట్ల పాలకుల వైఖరి మారలేదని అర్థమవుతుంది. ఈ సంస్థ ప్రజాసంస్థగా మనుగడ సాగించాలంటే, మహాలక్ష్మి పథక ప్రయోజనం అందరూ పొందాలంటే ప్రజలు, వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు ఉమ్మడిగా ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నం చేయాలి.అందుకు 12న జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ఒక ప్రాతిపదకను ముందుకు తీసుకొచ్చింది. ఆ సమావేశం పిలుపుమేరకు ఈ నెల19న ఆర్టీసి కార్మికులు 'డిమాండ్స్ డే'ని పాటిసున్నారు. సమీప భవిష్యత్‌లో ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలంతా కదలాలని, ఆర్టీసీని కాపాడుకోవాలని కోరుతు న్నాము.

'నేతన్న'లో చిగురించిన ఆశలు

- ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉచిత చీరలు
- పథకం రూపకల్పనపై కొనసాగుతున్న కసరత్తు
- ఎస్ఎస్ఐ యూనిట్ల ఏర్పాటులో నేతన్నలు నిమగ్నం
- సీఎం ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం




నవతెలంగాణ - గంగాధర :

స్వయం సహాయక బృందాలు(ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ఉచిత చీరల పంపిణీ పథకాన్ని ప్రవేశపెడుతూ వస్త్రోత్పత్తి ఆర్డర్లను చేనేత సంఘాలకే అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి కల్పించిన భరోసాతో చేనేత కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. హైదరాబాద్‌లో ఇటీవల ప్రారంభించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి) ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వేలాది మంది నేతన్నల సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరల తరహాలో ఎస్‌హెచ్‌జీ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించారు. దీంతో పది నెలలుగా పనులు లేక అల్లాడుతున్న గంగాధర మండలం గర్శకుర్తి గ్రామ 'చేనేత' కుటుంబాలు ఎస్‌హెచ్‌జీ పథకం ద్వారా ప్రభుత్వం అందించనున్న వస్త్రోత్పత్తి ఆర్డర్ల వైపు దృష్టి సారించారు. స్వయం సహాయక బృందాలకు ఉచితంగా అందించే చీరల ఉత్పత్తికి అవసరమైన కసరత్తును చేనేత, జౌళిశాఖ అధికారులు ముమ్మరం చేయగా, ఎస్ఎస్ఐ యూనిట్ల ఏర్పాటులో పవర్‌లూమ్స్ యజమానులు నిమగ్నం అయ్యారు. పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి చేసే కలర్ చీరలు, పలు రకాల వస్త్రోత్పత్తులు నిలిచిపోయి ఆగం అవుతున్న నేతన్న కుటుంబాల్లో ప్రభుత్వపరంగా ప్రకటించిన ఎస్‌హెచ్‌జీ పథకం కొత్త ఆశలు రేపుతోంది. ఇక వస్త్ర పరిశ్రమ పరిస్థితి అగమ్యగోచరమేనని భావిస్తున్న తరుణంలో ప్రభుత్వం కొత్త పథకాన్ని అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని ప్రతి చేనేత కుటుంబం ఇంటా ఆనందం వ్యక్తం అవుతోంది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ తర్వాత స్థానంలో వేళ్లూనుకుని ఉన్న గర్శకుర్తి గ్రామంలో వస్త్రోత్పత్తిపై ఆధారపడి 6 వేల చేనేత కుటుంబాలు జీవిస్తున్నాయి. సుమారు 1200 వరకు సాంచలు గ్రామంలో ఉండగా, మండలంలోని ఉప్పరమల్యాల, రంగారావుపల్లి, కాసారం, గంగాధర, గట్టుభూత్కూర్‌తోపాటు పలు గ్రామాల్లో మరో వెయి సాంచల వరకు ఉన్నాయి. వీటిపై ఆధారపడి జీవించే నేతకార్మికులు, ఆసాములు, యజమానులు బతుకమ్మ చీరల ఉత్పత్తి నిలిచి పది నెలలుగా పనులు లేక ఆందోళన చెందుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన బతుకమ్మ చీరల తరహాలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎటువంటి గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు కల్పించలేదు. దీంతో గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లపై ఆశలు వదులుకున్న పవర్ లూమ్స్ యజమానులు కార్మికులతో కలిసి కొంత కాలంగా ఆందోళనలు చేపడుతూ వచ్చారు. దీంతో పవర్‌లూమ్స్ వస్త్ర పరిశ్రమ స్థితిగతులను ఎప్పటికప్పుడు అధ్యాయనం చేస్తూ వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ పాలకులు ఎస్‌హెచ్‌జీ కొత్త పథకానికి శ్రీకారం చుట్టి ఇటీవలే ప్రకటించారు. దీంతో వస్త్రోత్పత్తులు నిలిచి ఆవేదనలో మునిగిన నేతన్న కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నా ప్రభుత్వం ప్రకటించిన ఎస్‌హెచ్‌జీ పథకం ఎప్పుడు అమలు అవుతోందో తెలియని అయోమయమే నెలకొంది.

జారీకాని మార్గదర్శకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్‌జీ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు (నిబంధనలు) ఇంకా జారీ కాలేదు. ప్రభుత్వపరంగా సీఎం రేవంత్‌రెడ్డి కొత్త పథకాన్ని ప్రకటించారే తప్పా విధి విధానాలు ఇంకా ఖరారు చేస్తూ మార్గదర్శకాలు వెలువడనట్టు తెలుస్తుంది. దీంతో చేనేత, జౌళిశాఖ అధికారులకు తెలిసిన పలు రకాల సూచనలను చేశారు. ఇందులో భాగంగానే గతంలో ఏర్పాటు చేసినట్టే కొత్తగా ఎస్ఎస్ఐ యూనిట్లను ఏర్పాటు చేసుకోవాలని దిశా, నిర్దేశం చేశారు. కాని చీరలను ఏ పీక్‌లో తయారి చేయాలని, ఎటువంటి చీరలను ఉత్పత్తి చేయాలనే విధి, విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఈ కొత్త పథకం అమలుకు కొంత సమయం పడుతుందని, నేతన్నలు వేచి చూడాలని అధికారులు సూచించారు.

కొత్త ఎస్ఎస్ఐ యూనిట్లకే గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు

కొత్తగా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ (ఎస్ఎస్ఐ) యూనిట్లు ఏర్పాటు చేసుకున్న చేనేత సంఘాలకే ఎస్‌హెచ్‌జీ పథకం గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం కల్పించనుంది. ఈ దృష్ట్యా చేనేత, జౌళిశాఖ అధికారులు పవర్‌లూమ్స్ యజమానులు, కార్మికులకు ఎస్‌హెచ్‌జీ పథకం అమలు తీరుపై దిశా, నిర్దేశం చేశారు. దీంతో గ్రామంలో ఎస్ఎస్ఐ యూనిట్ల ఏర్పాటుపై పవర్‌లూమ్స్ యజమానులు దృష్టి సారించగా, గతం కంటే రెట్టింపు యూనిట్లు ఏర్పాటు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒక్కో యూనిట్‌కు 20సాంచలకు తగ్గకుండా ఉండాలనే నిబంధనలు ఉన్నట్టు తెలుస్తుండగా, ఆయా యూనిట్ల ఏర్పాటుపై పవర్‌లూమ్స్ యజమానులు తలమునకలు అయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడి పవర్ లూమ్స్‌కు బతుకమ్మ చీరల ఉత్పతికే ఆర్డర్లు ఇవ్వగా, ఆ తర్వాత స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు కల్పించింది. 2022లో 20 లక్షల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు కల్పించగా, 2023లో 32 లక్షల 26 వేల 750 మీటర్ల చీరల తయారికి ఆర్డరు కల్పించింది. అయితే పెరిగిన డిమాండ్‌తో అదే యేటా 2 లక్షల 13 వేల 860 మీటర్ల స్కూల్ యూనిఫామ్స్, 24 వేల మీటర్ల రంజాన్ గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు కల్పించింది. తొలుత 17 స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ (ఎస్ఎస్ఐ) యూనిట్లు ఉండగా, 2023లో మరో 16 కొత్త యూనిట్లకు ఆర్డర్లు కల్పించింది. గ్రామంలో మొత్తం 33 ఎస్-ఎస్ఐ యూనిట్ల ఉండగా, సుమారు 945 పవర్ లూమ్స్‌పై గుడ్డ ఉత్పత్తి జరిగింది. అయితే గతంలో ఉన్న ఎస్ఎస్ఐ యూనిట్లను ప్రస్తుత ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకుండా కొత్తగా ఏర్పాటు చేసుకోవాలనే సంకేతాలు పంపింది. దీంతో గతంలో ఇక్కడ 33 యూనిట్లు ఉండగా, ఆ సంఖ్య పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

పనులు లేక అవస్థ పడుతున్నం : గడ్డం నారాయణ, అధ్యక్షుడు, పవర్ లూమ్స్ కార్మిక సంఘం, గర్శకుర్తి



పది నెలలుగా పనులు లేక అవస్థ పడుతున్నం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని త్వరగా అమలు చేస్తే పనులు లేక అల్లాడుతున్న కార్మికులకు పనులు దొరుకుతవి. ప్రభుత్వం అమలు చేసే కొత్త పథకం ద్వారా కల్పించే చీరల తయారీపై కూలీలకు గిట్టుబాటు ధర కల్పించాలి. కూలీలకు లాభం చేకూరే విధంగా విధి విధానాలు, నిబంధనలు ఖరారు చేయాలని కోరుతున్నం.

కొత్త పథకంపైనే ఆశలు : దూస మల్లేశం, ఆసామి, గర్శకుర్తి



ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎస్‌హెచ్‌జీ పథకంపైనే ఆశలు పెట్టుకున్నం. కలర్ చీరలు నడస్త లేవు. నడిపినా మార్కెట్‌లో గిరాకీ లేదు. ఉన్న సాంచల్లో ఒకటీ అర నడుపుతూ పొట్ట పోసుకుంటున్నం. ప్రభుత్వం ప్రకటించిన పథకాన్ని వెంటనే అమలు చేస్తే ప్రతి ఆసామి, కార్మికుడికి పని కలుగుతుంది.

ప్రజా పాలనలో పారిశుధ్యానికి నిధులు కరువు

- వెలుగని వీధి దీపాలు
- కంపు కొడుతున్న వీధులు


డీజిల్ లేక మూలన పడ్డ జీపీ ట్రాక్టర్

నవతెలంగాణ - కొనరావుపేట

కొనరావుపేట మండలకేంద్రంలో పది రోజులుగా పారిశుధ్య పనులు నిలిచిపోయాయి. ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో మండలకేంద్రంలోని వీధులు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య పనులు చేయకపోగా గత 5రోజులు నుంచి వీధిదీపాలు కూడా వెలగడంలేదు. దీంతో గ్రామ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

డీజిల్ బకాయి రూ.1.10లక్షలు

కొనరావుపేట మండలకేంద్రంలోని జీపీ ట్రాక్టర్ ద్వారా ఇండ్లలోని చెత్తను సేకరించేవారు. ఇందుకోసం స్థానిక పెట్రోల్ పంప్‌లో డీజిల్ ఉద్దెర తీసుకున్న బిల్లు రూ.1.10 లక్షలకు చేరింది. దీంతో వారు డీజిల్ ఉద్దెర పోయడంలేదు. ఫలితంగా పది రోజులుగా జీపీ ట్రాక్టర్ మూలకు పడింది.

ప్రత్యేకాధికారి పర్యవేక్షణ కరవు

సర్పంచుల పదవీకాలం పూర్తవడంతో గ్రామాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. కొనరావుపేటకు ఎంపీడీవో ప్రత్యేకాధికారిగా ఉన్నారు. ఆయన ప్రతి రోజూ కొనరావుపేటకు వస్తున్నా గ్రామపంచాయతీని సందర్శించిన దాఖలాలు లేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రత్యేకాధికారి అనుమతి లేనిది డబ్బులు తీసే అవకాశం లేకపోవడంతో కార్యదర్శి ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాడు. వీటికి తోడు ఇతర ఖర్చుల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారు.

వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయడంలేదు : దేవరకొండ నర్సింహాచారి, మాజీ ఎంపీటీసీ

కొనరావుపేట మండలకేంద్రంలో పారిశుధ్య పనులు సక్రమంగా లేవు. పది రోజులుగా ట్రాక్టర్ తిరగడంలేదు. ఐదు రోజులుగా వీధి దీపాలు కూడా వెలగడంలేదు. ఇళ్లలో చెత్త నిల్వలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని, సాయుధ పోరాట లక్ష్యాలు ఇంకా నెరవేరలేదని ఆ స్ఫూర్తితో జిల్లాలో ఉద్యమించాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపులో భాగంగా జిల్లా అమరుడు కామ్రేడ్ అనబేరి ప్రభాకర్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన అనంతరం ముకుంద లాల్ మిశ్రా భవన్లో వారోత్సవాల ముగింపు సభ కామ్రేడ్ వర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మిల్కూరి వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అని ఈ పోరాటంలో 4200మంది ప్రజలు, కమ్యూనిసులు ప్రాణాలర్పించారని 3000గ్రామాల్లో గ్రామ స్వరాజ్యాలు ఏర్పాటు అయ్యాయని, 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందని ఈ పోరాటం కుల మతాలకు అతీతంగా దున్నే వాడికే భూమి కావాలి అనే నినాదంతో ప్రజలందరూ కలిసికట్టుగా నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జమీందారు విధానానికి వ్యతిరేకంగా ప్రజలందరికీ స్వేచ్ఛ సమానత్వం కావాలని పేద ప్రజలకు భూమి కావాలని సాగిన పోరాటమే తెలంగాణ సాయుధ రైతంగ పోరాటమన్నారు. నగరంలోని అన్ని విగ్రహాలను సుందరీకరణ చేసి, వాటర్ ఫౌంటెన్‌లు ఏర్పాటు చేశారని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం యోధులు అనబెరి ప్రభాకర్ రావు విగ్రహాన్ని విస్మరించారన్నారు. వెంటనే అనభేరి విగ్రహానికి సుందరీకరణ చేయాలని డిమాండ్ చేశారు. నేడు బీజేపీ ఈ పోరాటాన్ని వక్రీకరించి విమోచన దినమని ముస్లిం రాజుకు హిందూ ప్రజలకు జరిగిన పోరాటంగా వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. నైజాం రాచరిక ప్రభుత్వ రద్దు కావాలని, దున్నేవానికి భూమి, రైతాంగానికి భూమి హక్కులు కల్పించాలని, వెట్టి చాకిరీ రద్దు చేయాలని, మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనే ప్రధాన డిమాండ్లతో సాయుధ పోరాటం జరిగిందని, వాస్తవాలు ఎన్నటికీ మరుగుపడవని, జరిగిన పోరాటం చెరిగిపోదని, తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం కమ్యూనిస్టుల ఘనతేనన్నారు. 78 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో నేటికీ ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని పాలక ప్రభుత్వాలు ఇప్పటికైనా పేద బడుగు బలహీన వర్గాల ప్రజా సమస్యలు పరిష్కారం కోసం పనిచేయాలని, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పజెప్పే పనిని మానుకోవాలని, ఎన్నికల ముందు పాలక పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూడా నెరవేర్చాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి. బీమా సాహెబ్ కమిటీ సభ్యులు సుంకరి సంపత్, మక్కాపెల్లి పూజ, కోనేటి నాగమణి, తిప్పారపు సురేష్, పున్నం రవి, రాంమోహన్ రావు, శంకర్ , వినయ్, వామన్ రావు,రాజమల్లు, యాదగిరి, నరేష్, కనకరాజు, రమేష్, అరవింద్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుపై ప్రతిపక్షాలది రాద్ధాంతం

పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



నవతెలంగాణ - జగిత్యాల : సెక్రటేరియట్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. పది ఏళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ తల్లి గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇక గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గల్ఫ్‌లో మరణించిన కుటుంబాలకు 5 లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు సంక్షేమ పథకాలలో ప్రాధాన్యత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టో రూపకల్పనలో భాగంగా గల్ఫ్ కార్మికుల సమస్యలపై రేవంత్ రెడ్డితో చర్చించినట్లుగా గుర్తు చేశారు. రాష్ట్రంలో నూతన రేషన్ కార్డులు జారీ చేయాల్సిన ఆవశ్యకత ఉందని అయితే రేషన్ కార్డుల మంజూరులో ఒకే విధానాన్ని అనుసరించాలన్నారు. పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఒకే వార్షిక ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో ఇప్పటికే సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సూచనలు చేసినట్టుగా వివరించారు. అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో ఓడి నప్పటికీ ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పేదల సర్కార్ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా ప్రజాపాలన ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాలా జ్యోతి, మాజీ చైర్పర్సన్ విజయలక్ష్మి,పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీఎన్జీఓ అధ్యక్షులు



నవతెలంగాణ - కరీంనగర్ : మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో కరీంనగర్ టీఎన్జీవోల ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. జిల్లా పరిషత్ కారుణ్య నియామకాలు గురించి, కారుణ్య నియామకాల అభ్యర్థులతో కలిసి మంత్రి శ్రీధర్ బాబుకి వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డిని ఏం సమస్యలు? ఉన్నాయి అని అడుగగా జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు 8 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయి చెప్పడంతో..మంత్రి స్పందించి వెంటనే సీఎంఓ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ కాల్ చేసి వివరాలు తెలుసుకొని. జిల్లా పరిషత్ కారుణ్య నియామకాలు వీలైనంత త్వరగా చేపిస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ చైర్మెన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంఘం లక్ష్మణరావు, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, టీజీఓ నాయకులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, పట్టణ అధ్యక్షులు సర్దార్ అర్విందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, నేరెళ్ల కిషన్, రాజేశ్వరరావు, అఫ్జల్, నాలుగో తరగతి ఉద్యోగుల అధ్యక్షులు కోటా రామస్వామి, అభ్యర్థులు పాల్గొన్నారు.

షూటింగ్ పోటీలలో రాష్ట్ర స్థాయికి పారమిత విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ - కరీంనగర్ : ఈ నెల 8న షూటింగ్ బాల్ అసోసియేషన్ నిర్వహించిన 43వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి షఉటింగ్ బాల్ పోటీలలో స్థానిక అలుగునూర్‌లోని పారమిత వరల్డ్ స్కూల్ 10వ తరగతి విద్యార్థి జి.ప్రిన్స్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. కాగా ఈనెల 18న కరీంనగర్ జిల్లా కురిక్యాలలో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌లో జరగబోవు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల డైరెక్టర్ వీయుఎం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పారమిత పాఠశాల చైర్మెన్ డాక్టర్ ఈ.ప్రసాదరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్, పీఈటీలు జెట్టి శ్రీనివాస్, శ్రీధర్ పాల్గొన్నారు.

కరాటేలో ఎస్వీజేసీ విద్యార్థి ప్రతిభ



నవతెలంగాణ-కరీంనగర్

ఈనెల 15న నగరంలోని స్థానిక అంబేద్కర్ స్టేడియంలో జరిగిన ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్ టోర్నమెంట్లో భాగంగా కరీంనగర్ శ్రీవెంకటేశ్వర బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి శిలవేరు పవన్ కుమార్ అండర్-17 విభాగంలో పాల్గొని ఇండివిజువల్ కటాలో తగిన ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం, కుమిటి విభాగంలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని చైర్మెన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్ రెడ్డి లు అభినందించారు. చదువుతో పాటు ఆత్మరక్షణకు ఇలాంటి కరాటే కుమిటీలు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన కరాటే ఉపాధ్యాయున్ని, తగిన ప్రోత్సాహం అందించిన విద్యార్థి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం అభినందించారు.

స్వచ్ఛతపై స్కూల్ విద్యార్థులతో ప్రతిజ్ఞ



నవతెలంగాణ - వీణవంక

వీణవంక ఎంపీడీవో శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారానికి రెండు గంటలు స్వచ్ఛందంగా పరిశుభ్రత కోసం ఇంటి పక్కలవారితో కలిసి ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకుంటే అనారోగ్యాల భారిన పడకుండా రక్షించుకోవచ్చని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఏపీవో గట్టు స్వామి, హెచ్‌ఎం పులి అశోక్‌రెడ్డి, టీపీ బిక్షపతి, పంచాయతీ కార్యదర్శి యశోద, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కిల్ యూనివర్సిటీలో విశ్వకర్మలకు కోర్సు

- కరీంనగర్‌లోనూ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు



నవతెలంగాణ - కరీంనగర్

రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీలో విశ్వబ్రాహ్మణులకు కోర్సును ప్రవేశపెడతామని, కరీంనగర్ హెడ్ క్వార్టర్‌లోను స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. విశ్వకర్మల శ్రమ లేనిదే విశ్వంలో ఏ పని జరగదన్నారు. స్కిల్ యూనివర్సిటీలో విశ్వకర్మల నైపుణ్యాన్ని పెంపొందించే కోర్సును ప్రవేశపెడతామని తెలిపారు. కులవృత్తులను ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. కుల వృత్తిదారులకు ఆదాయం కల్పించే మార్గాలను అన్వేషిస్తున్నామన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించి ఉపాధి కల్పించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కరీంనగర్‌లో విశ్వకర్మ భవనం నిర్మించుకునేందుకు ప్రభుత్వ స్థలం పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని కూడా ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, బీసీ సంక్షేమ అధికారి అనిల్, విశ్వకర్మ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాయితోజు బ్రహ్మచారి, మంచిర్యాల బ్రహ్మం, శివప్రసాద్, రవీంద్రచారి, శ్రీధర్ రాజు, రవీంద్రచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పౌరహక్కుల సంఘం నాయకులను అడ్డుకోవడం సిగ్గుచేటు

- మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య

నవతెలంగాణ - జమ్మికుంట

పౌర హక్కుల సంఘం నిజనిర్ధారణను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శనిగరపు తిరుపతయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రఘునాథ పాలెం గ్రామ అడవుల్లో జరిగిన ఎన్కౌంటర్లో మావోయిస్టు పార్టీకి చెందిన 6గురు సాయుధ దళసభ్యులు చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారని, పరస్పరం ఎదురుకాల్పులు జరిగి ఒక పక్షానికి చెందిన సాయుధులు పెద్ద ఎత్తున అక్కడికక్కడే చనిపోతే, ఎదురుకాల్పుల్లో మరోవైపు ఉన్న పోలీసులకు, నూటికి తొంబై తొమ్మిది సందర్భాల్లో, చిన్న గీత కూడా పడదని, ఇటువంటివి ఎలా జరుగుతాయో తెలుగు నేలలో ఉన్న పౌరులందరికీ తెలిసిన విషయమేనన్నారు. సహజంగానే ప్రతి ఎన్కౌంటర్ లాగే ఈ ఎన్ కౌంటర్ పైన కూడా అనుమానం వస్తున్నది కాబట్టి, పౌర హక్కుల సంఘం బాధ్యులు ఈ నెల 14న నిజ నిర్ధారణకు బయలుదేరారని, పోలీసులు ,పౌరహక్కుల సంఘ సభ్యుల ఫోన్లను టాప్ చేసి, బస్సులో వెళ్తున్న వారిని మణుగూరు పట్టణంలో ఆపి, బల ప్రయోగం చేస్తూ, అందరినీ ఒక మారు మూల పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారన్నారు. నిజ నిర్ధారణకు వెళ్లకుండా అడ్డుకుని, తిప్పి పంపించారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యం, ప్రజల స్వేచ్ఛ గురించి ఎన్ని వాగ్దానాలు చేసినప్పటికీ వాస్తవంగా ఆయనకూ, ఆయన పార్టీకీ పాలకులను విమర్శించే పౌరుల ప్రశ్నలను ఎదుర్కొనే సత్తా లేదని, అందుకోసమే ఇలా పౌర ప్రజా సంఘాలనూ, మేధావులనూ భౌతికంగా అడ్డుకుంటు న్నారని విమర్శించారు. రాష్ట్ర హోం మంత్రి తెలంగాణలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పట్ల నిజాయితీ కలిగి ఉంటే పౌర హక్కుల సంఘం బాధ్యులను అడ్డుకున్న పోలీసులపై కేసు నమోదు చేసి, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్కౌంటర్లు చేయటానికి పోలీసులను వాడుకోకూడదన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

నవతెలంగాణ - చొప్పదండి : మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో, మంగళవారం విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని, జిల్లా ఉపాధ్యక్షులు చెల్లోజు సత్యనారాయణ ఆధ్వర్యంలో, ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కర్రె శ్రీనివాస్, చిలుక లింగయ్య, మాజీ ఎంపిటిసి ముద్దసాని రంగన్న, కర్రే సురేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లోజు రాజు, కోటగిరి శ్రీనివాస్, రమేష్, శ్రీను, భూమాచారి, సంగం నాయకులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ..

- అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి



నవతెలంగాణ - కరీంనగర్

కరాటే ద్వారా ఆత్మరక్షణ పొందవచ్చని, ప్రపంచంలో ప్రత్యేకమైన స్థానం ఉందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని స్థానిక కొత్తపల్లిలో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులకు ఆల్ ఇండియా చాంపియన్ షిప్‌లో బంగారు, రజత పతకాలు సాధించిన సందర్భంగా ప్రత్యేక అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడలలో కరాటే క్రీడకు చాలా విశిష్టత ఉందన్నారు. పాఠశాలలోని విద్యార్థులకు కూడా కరాటే పట్ల పట్టు సాధింపచేయడానికి నిపుణులైన కరాటే శిక్షకులచే శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. ఇటీవల కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్‌లో పాఠశాలకు చెందిన యన్ సిద్విక్, కరాటేలోని కుమిటెలో మొదటి స్థానంతోపాటు బంగారు పతకం, తోట సాన్వి, కరాటేలోని కటా విభాగంలో ద్వితీయ స్థానంతోపాటు రజత పతకం, కె.సాయి తన్వి, వ్యక్తిగత కటా విభాగంలో ద్వితీయ స్థానంతో పాటు రజత పతకం, ఆర్.శివరణ్య సెగహ, వ్యక్తిగత విభాగంలో ద్వితీయ బహుమతి, రజత పతకం, పి.శత్రుమ్న, కరాటేలోని కటా విభాగంలో ద్వితీయ స్థానంతోపాటు రజత పతకం గెలుచుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విజేతలందరికి పుష్పగుచ్ఛాలను అందజేసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డు ఆవిష్కరించిన కేంద్ర మంత్రి



నవతెలంగాణ - కరీంనగర్ : కరీంనగర్‌లో మహాశక్తి అమ్మవారి ఆలయ ఆవరణలో జగిత్యాల మున్నూరుకాపు కళ్యాణ మండపం సభ్యత్వ కార్డును కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులతో కలిసి సభ్యులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు కల్యాణ మండపం అధ్యక్షులు బండారి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి తోట మల్లికార్జున్, ఉపాధ్యక్షులు దీటి అంజయ్య పటేల్, సిరిపురం రాజేశం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు వంగల రమేష్, ఎడిపెల్లి అశోక్, మారటి సత్తయ్య, ములాసపు రాజన్న, నులుగొండ సురేష్, ఎర్రం చందన్ కుమార్ పాల్గొన్నారు.

గల్ఫ్ పాలసి ప్రకటన పట్ల హర్షం

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ - మెట్‌పల్లి



ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గల్ఫ్ బోర్డు, ఎన్నారై పాలసీ ప్రకటించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ప్రజా పాలన పురస్కరించుకొని జాతీయ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జట్టిలింగం, మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, సీనియర్ నాయకులు ఆకుల లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి తుమ్మనపల్లి రాంప్రసాద్, కౌన్సిలర్ రాజయ్య, మాజీ వైస్ చైర్మన్ కోఆప్షన్ మార్గం గంగాధర్, పూదారి నర్సాగౌడ్, పొట్ట రాజేశ్వర్, రమేష్, ముఖీమ్, జాకీర్, రాజగోపాల్ ,షేక్ మహ్మద్, శంకర్ ,చరణ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-మల్యాల



ఈనెల 8న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల కోసం జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి వివేకనంద స్టేడియంలో అథ్లెటిక్స్ నిర్వహించారు. ఈ పోటీలలో మల్యాలకు చెందిన జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల నుంచి 8వ తరగతి చదువుతున్న మర్రిపల్లి శ్వాతిక (ట్రైయథ్లిన్) (లాంగ్ జంప్, 60 మీటర్స్ రన్, షాట్‌పుట్) 14 సంవత్సరాల విభాగంలో పాల్గొని, హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 19, 20వ తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినిని జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రధానో పాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చూస్తాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-జగిత్యాల

సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా చూస్తా మని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకు ముందు ప్రభుత్వ విప్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులకు, అధికార అనధికారులకు ప్రజాపాలనా దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విప్ జిల్లా ప్రగతి నివేదికను వివరిస్తూ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ నిజాం పాలన నుంచి విముక్తి పొందిందన్నారు. ఇంతటి ప్రాముఖ్యత గల సెప్టెంబర్ 17వ తేదీని 'తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవం'గా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను పేదలు, నిరుపేదలకు అందిస్తున్నామని తెలిపారు. గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 83,960 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. జిల్లాలో 15 డిసెంబర్ 2023 నుంచి సెప్టెంబర్ 12, 2024 వరకు 2 కోట్ల 20 లక్షల 74 వేల 541 మంది మహిళలు ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 5 లక్షల నుంచి 10 లక్షల రూపాయలకు పెంచి అమలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

చేస్తున్నామన్నారు. కొత్తగా 163 చికిత్సలను ఈ పథకంలో చేర్చిందని, మొత్తం 1837 చికిత్సలకు రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందుతోందన్నారు. ఈ పథకం వల్ల జిల్లాలో 13 వేల 995 మంది పేదలకు ఉచిత చికిత్స అందించామన్నారు. 500లకే గ్యాస్ ద్వారా జిల్లాలో 2 లక్షల 89 వేల 725 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. దీనికి గాను రాష్ట్ర ప్రభుత్వం 10 కోట్ల 86 లక్షల 46 వేల 875 రూపాయలను సబ్సిడీ అందజేసిందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1 లక్షా 93 వేల 686 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అంది స్తున్నామని, 7 కోట్ల 25 లక్షల రూపాయలను సబ్సిడీగా చెల్లించిందన్నారు. జిల్లాలో 58 వేల 852 మంది రైతుల ఖాతాలలో రుణమాఫీ కింద రూ.375 కోట్ల 57 లక్షల రూపాయలను రుణ మాఫీ చేయడం జరిగిందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగు పరచడానికి "తెలంగాణ విద్యా కమిషన్" ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చబోతున్నామన్నారు. ప్రాథమిక పాఠశాలలు మొదలు విశ్వవిద్యాలయాల వరకూ నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ఒక మిషన్ మోడ్‌లో చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. నియోజకవర్గంలో ఒకే ఆవర ణలో 25 ఎకరాల స్థలంలో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్లు పి. రాంబాబు, గౌతమ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆడువాల జ్యోతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాసాచారికి సన్మానం



ఏఎంసీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఎండపల్లి

ఏఎంసీ కమిటీలో డైరెక్టర్‌గా ఎన్నికైన కొత్తపేట గ్రామానికి చెందిన పోలోజు శ్రీనివాసాచారిని విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు సిపల్లి శంకరయ్య మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో విశ్వకర్మలు ఉన్నత స్థానంలో నిలవాలని, విశ్వకర్మలను ప్రభుత్వం రాజకీయంగా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఆచారి కొత్తపేట విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు పోలోజు శ్రీనివాసాచారి, చింతల మురళిచారి, చొప్పదండి చంద్రయ్యచారి, చిలకలూరి సత్యంచారి, చొప్పదండి రవీందర్‌చారి, సిపెల్లి లక్ష్మీకాంతంచారి, చింతల తిరుపతిచారి, చింతల వెంకటేష్ పాల్గొన్నారు.

మండలలో విశ్వకర్మ జయంతి వేడుకలు



పాల్గొన్న విశ్వకర్మలు

నవతెలంగాణ-ఎండపల్లి

ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఎండపల్లి మండల కేంద్రంలో స్థానిక విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు సింహరాజు సత్యనారాయణ విశ్వకర్మ భగవాన్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఎండపల్లి మండల అధ్యక్షుడు సీపెల్లి శంకర్, గౌరవ అధ్యక్షుడు తంగళ్లపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి మడుప మనోహర్, కోశాధికారి నూక సముద్రంలో శ్రీనివాస్ విశ్వకర్మ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

నవతెలంగాణ- ఎండపల్లి

మండలంలోని ముంజంపల్లి గ్రామంలో అనారోగ్య కారణాలతో మరణించిన వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. వారి చిత్రపటాలకి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాలకుర్తి మాజీ ఎంపీపీ వ్యాల్ల అనసూర్య రాంరెడ్డి ,మండల అధ్యక్షుడు సింహాచలం జగన్, గాజుల మల్లేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకు చెట్లను నరుకుతున్న వ్యక్తిని పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామంలోని అడవిలో అక్రమంగా టేక్ చెట్లను నరికి వేస్తున్నారనే సమాచారం మేరకు ఫారెస్ట్ అధికారులు ఘటనాస్థలానికి వెళ్లి చెట్లను కొడుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి టేకు చెట్లను కొట్టుమని చెప్పడంతో టేకు చెట్లను కొట్టడం జరిగిందని వివరించారు. నాలుగు టేకు చెట్లు కొట్టినట్టు అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి విషయాలు వెల్లడిస్తామని అటవీశాఖ అధికారి చైతన్యశ్రీ తెలిపారు.

కాంగ్రెస్‌తో తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం

నవతెలంగాణ-మెట్‌పల్లి

తెలంగాణ అస్తిత్వానికి కాంగ్రెస్ పార్టీ ప్రమాదకరంగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం స్థానిక నాయకులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ నాయకులు తెలంగాణ సంస్కృతిని తుంగలో తొక్కుతూ సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ రానావేణి సుజాత సత్యనారాయణ, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, కౌన్సిలర్ మొరపు గంగాధర్, ధ్యావనపెల్లి రాజారాం, భీమనాతి సత్య నారాయణ, పూజగిరి శ్రీనివాస్, ఉజ్జల శ్రీనివాస్, దశరథ్‌రెడ్డి, డబ్బా నరసన్న, రాజాగౌడ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో శనివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యకతన, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కన్వీనర్‌గా గల్ఫ్ కార్మికులు ఎక్కువగా వుండే నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గల్ఫ్ భాధితులకు సంబంధించిన 5 అంశాలపై సమావేశంలో చర్చించారు. ఆ సమావేశంలో చర్చించిన అంశాలపై ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరుతూ జీవో విడుదల చేశారు. గల్ఫ్ కార్మికుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు ధన్యవాదలు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకటరెడ్డి, సెల్ అధ్యక్షుడు దుదిగం గంగాధర్, కిసాన్ సెల్ అధ్యక్షులు క్యాతం తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మేడికొండ రమేష్, యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు రాగుల గణేష్, ఉటూరి ప్రదీప్ కుమార్, దామేరా శ్రీను, రాజేశ్వర్, జీసిబి శంకర్, భాధనకుర్తి భూమన్న పాల్గొన్నారు.

ఫామ్ హౌస్ పరిపాలన కావాలా.. ప్రజాపాలన కావాలా.?

కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

నవతెలంగాణ- మెట్‌పల్లి :తెలంగాణ ప్రజలు ప్రజాపాలన అందించాలని కాంగ్రెస్ పార్టీని గెలిపించారని, కానీ ప్రజా అభిప్రాయమే తప్పు అన్నట్టు స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను తప్పు పడుతూ.. వ్యక్తిగత విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పరిపాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమై పాలన సాగించారని, దేశంలోనే ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అందించని అసమర్ధ పరిపాలన బీఆర్ఎస్ పాలనలో విమర్శించారు. పదవులు పోగానే బీఆర్ఎస్ నాయకులకు మానసిక స్థితి చేసిందన్నారు.దోపిడీ పాలన వద్దనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చించారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన పీఆర్టీయూ నూతన కార్యవర్గం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ టీఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద్‌రావు, యాల్ల అమర్నాథ్‌రెడ్డి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను వారు అభినంది ంచారు.

ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకుని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాయి లింగారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీధర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శులు వెంకటేష్ యాదవ్, రణధీర్, లవంగ శేఖర్, పుస్తెం మహేందర్,కమ్మర్ రవి ,కుక్క దువ్వ మారుతి, పాల్గొన్నారు.

మెట్‌పల్లి: భారతదేశ ప్రధాని జన్మదిన వేడుకలను మెట్ పల్లి బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి, బోడ్ల నాగేష్, సత్యనారాయణ గౌడ్, లావణ్య, శ్రీనివాస్, రజిని, కుమార్, తోకల సత్యనారాయణ ,తదితరులు పాల్గొన్నారు.

మోహన్ యోగీని సన్మానించిన రజక యువసేన సభ్యులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండలంలోని బర్దిపూర్ గ్రామ రజక యవసేన సభ్యులు బోలేనాథ్ కర్రల వ్యవస్థాపకులు సొంతి మోహన్ యోగిని ఘనంగా సన్మానించారు. వినాయక మండపం దగ్గర మోహన్ యోగి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రజక యువసేన సభ్యులు వినోద్ అజయ్, అశోక్, దిలిప్, అఖిలేష్, జగదీష్, మధు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన తక్కల్లపల్లి విద్యార్థి

నవతెలంగాణ-కథలాపూర్



కథలాపూర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ తక్కళ్లపల్లి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని డి. సింధు యు-16 విభాగంలో 60 మీటర్స్, 600 మీటర్స్ పరుగు పందెం రెండు విభాగాల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకొని రాష్ట్ర స్థాయికి సెలెక్ట్ అయినట్లు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎలేటి ముత్తయ్య రెడ్డి తెలిపారు. ఈనెల 19,20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఓయూ క్యాంపస్ గ్రౌండ్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు. విద్యార్థిని క్రీడల్లో రాణించడానికి కృషి చేసిన పీఈటీ రాజేశ్‌ను ప్రధానోపాధ్యాయులు రవీందర్ అభినం దించారు.

తహసీల్దార్‌ను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలానికి బదిలీపై వచ్చిన నూతన తహసీల్దార్‌ను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజాపాలనలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ పేదల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, ఎద్మల లక్ష్మారెడ్డి ట్రస్ట్ చైర్మన్ సంతోష్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు పిడుగు తిరుపతిరెడ్డి, మాజీ కొండస్వామి దేవస్థానం చైర్మన్ జెడి రవి, జీవన్, కొనరావుపేట గంగారెడ్డి, సతీష్, ప్రశాంత్, కిషోర్‌రెడ్డి, పుప్పాల గంగాధర్ పాల్గొన్నారు.



4వేల మంది అమరుల రక్తతర్పనతో తెలంగాణ భారతదేశంలో విలీనం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో 4వేల మంది కమ్యూనిస్టు వీరుల రక్త తర్పనతో తెలంగాణ విలీనం అయిందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి. తిరుపతి నాయక్ అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో పార్టీ జెండాను ఎగువేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు తెలంగాణ సమాజం అనుభవిస్తున్న స్వేచ్ఛ వాయువుల వెనుక వేలాది మంది కమ్యూనిస్టుల త్యాగం దాగి ఉందన్నారు. భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం సాగిన మహోన్నత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటంలో దొడ్డి కొమరయ్య, భీమిరెడ్డి, నరసింహారెడ్డి, షేక్ బందగి, షోయబుల్లాఖాన్, రావి నారాయణరెడ్డి, చాకలి ఐలమ్మ వంటి ఎందరో వీరులు పోరాటంలో పాల్గొనీ తమ జీవితాలను తెలంగాణ కోసం ధారపోశారని తెలిపారు. నిజాం రాచరిక, నిరంకుశ పాలన మీద తిరుగుబాటుగా మారి పెత్తందారులకు వ్యతిరేకంగా ఊర్లకు ఉర్లే ఏకమై ప్రజలు



జెండా ఆవిష్కరణ చేస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

సంఘటితంగా పోరాడారని పేర్కొన్నారు. 4000 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేశారని, పది లక్షల ఎకరాల భూమిని రైతాంగానికి పంపిణీ చేశారన్నారు. అక్రమంగా తాకట్టులో ఉన్న భూమిని విముక్తి చేయడమే కాకుండా పశువుల పంపిణీ చేపట్టి పన్నుల వసూలను కూడా రద్దు చేశారని వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచి మహిళను నిర్ణయాలలో భాగస్వాములను చేసి రుణపత్రాలను సైతం రద్దు చేసిన ప్రపంచ చారిత్రక పోరాటామని అన్నారు. జమీందారీ దోపిడీకి అణచివేతకు వ్యతిరేకంగా సాగిన ఈ రైతాంగ పోరాటంలో కుల పట్టింపులు కొట్టుకపోయి వివక్ష అంటరానితనం అంతమైందని అన్నారు. ప్రపంచ చరిత్రలో 5 సంవత్సరాల పాటు సాగిన సుదీర్ఘ మహోన్నత పోరాటం గురించి బిజెపి వంటి మతోన్మాద పార్టీలు రెండు వర్గాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిం చడం తగదని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఏమాత్రం సంబంధం లేని బీజేపీ తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదని అన్నారు. రాజకీయ అవసరాల కోసం చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీకి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కోమటి చంద్రశేఖర్, వెంకటచారి, గర్వందుల రమేష్, సిరికొండ చంద్రయ్య, మల్యాల సురేష్, మహమ్మద్ రఫీ, మహిపాల్ నాయక్, నరేష్ నాయక్, కుంటాల లచ్చయ్య, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



జెండాకు వందనం చేస్తున్న గ్రామస్తులు



గౌరవ వందనం చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్



గౌరవ వందనం చేస్తున్న కొండగట్టు ఈవో

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ బోరిగం రాజు జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాల యంలో ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, డబ్బా గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రవళి జెండా ఆవిష్కరణ చేశారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, ఉపాధ్యక్షులు ఎలాల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి, డబ్బామాజీ సర్పంచ్ పుప్పాల నర్సయ్య, జాన శంకర్, కిసాన్ సెల్ అధ్యక్షుడు క్యాతం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలో ఆర్‌డీవో, తహసీల్దార్, ఎంపీడీవో మున్సిపల్, మార్కెట్ యార్డుతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

రాయికల్ : పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అబ్దుల్ ఖయ్యూం, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చిరంజీవి జాతీయ పతాకావిష్కరణ చేసి తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ గీతాలాపన చేసిన విద్యార్థినులకు తహ సీల్దార్, ఎంపీడీవో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పట్టణ పురపాలక సంఘం వద్ద వైస్ చైర్ పర్సన్ గండ్ర రమాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్య దర్శులు గ్రామపంచాయతీల వద్ద ప్రజాపాలన కార్య క్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛతహి సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని చెత్తా చెదారం బయట వేయకుండా పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ వారానికి స్వచ్ఛందంగా రెండు గంటలు పని చేయాలని కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.జగదీశ్వర్‌గౌడ్, ఎంపీఓ సుష్మా మేనేజర్ బి.వెంకటి, ఆర్.ఐ.పద్మయ్య,దేవదాస్ ఆయా కార్యాలయల సిబ్బంది పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ జెండాను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, డీఎస్పీ రఘు చందర్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్స్ అసోసియేషన్స్ కార్యాలయాల ఆవరణల్లో ప్రజా పాలన దినోత్సవం వేడుకలు నిర్వహించారు. జాతీయ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. జిల్లా అంబుడ్స్ మెన్ అధికారి, రిటైర్డు జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, టీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ భోగ శశిధర్, టీఎన్‌జీఓ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగిత్యాల: టీఎన్జీవో జిల్లా శాఖ కార్యాలయంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్ అధ్యక్షతన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పుర స్కరించుకొని జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్, టీఎన్జీఓ నాయకులు సాహెద్ బాబు, రవీందర్, రాజేందర్, రవి కుమార్, మధుకర్, రాజేశం, అరుణ, సీనియర సిటిజన్స్ సంఘం నాయకులు విశ్వనాథం, ప్రకాష్, యాకూబ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్యాల : కొండగట్టు అంజన్న ఆలయ కార్యాలయంలో జాతీయ జెండాను ఈఓ ఎం.రామకృష్ణరావు అర్చకుల వేద మంత్రాల పూజల అనంతరం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అంజయ్య, పర్యవేక్షకులు చంద్ర శేఖర్, సునీల్, హరిహరనాథ్, సీనియర్ అసిస్టెంట్స్ ఉమా మహేశ్వర్‌రావు, చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ధర్మేందర్, స్థానాచార్యులు కపిందర్, ప్రధానార్చకులు జితేందర్, రామకృష్ణ, రాజేశ్వర శర్మ, వేద పండితులు, అర్చకులు, పోలీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి :మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుజాత, వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖరరావు, మున్సిపల్ కమిషనర్ టి. మోహన్, మేనేజర్ వెంకటలక్ష్మి, ఆర్ఐ అక్షయ్, ఇన్‌చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ , కౌన్సిలర్ మొరపు గంగాధర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

నవతెలంగాణ-కథలాపూర్

కథలాపూర్ మండలంలోని భూషన్‌రావు పేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లోకబాపురెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వ్యతిరేకంగా తెలంగాణ వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రంలో మాజీ జడ్పీటీసీ నాగం భూమయ్య,వైస్ ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్స్ గుండారపు సౌజన్య గంగాధర్, వైస్ చైర్మన్ సోమా దేవేందర్, మాజీ సర్పంచులు జావిడి ప్రతాప్, గజ్జెల స్వామి,ఎంపీటీసీ కొండ ఆంజనేయులు,బి ఆర్ ఎస్ పార్టీ మండల శాఖ మాజీ అధ్యక్షులు కల్లెడ శంకర్, తిట్ల శంకర్, వేముల గంగరాజం, బద్దం మహేందర్,పురుకుటపు గంగారెడ్డి, పుండ్ర జనార్దన్, ముస్కు శ్రీనివాస్, కొత్తపెల్లి శ్రీను, ఏజిబి మహేందర్, బాల్క సంజీవ్, తెడ్డు ప్రశాంత్, వంగ మహేందర్, జనార్దన్, జావిడి తిరుపతి రెడ్డి, గడ్డం శేఖర్ రెడ్డి, జావిడి జలపతి, రాహుల్, వంగరి రాజు, పురుకుటపు సంతోష్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న లోకబాపురెడ్డి

దేశం గర్వించదగ్గ వ్యక్తి కెప్టెన్ విజయ రఘునందన్ రావు

నవతెలంగాణ-సిరిసిల్ల

దేశం గర్వించదగ్గ వ్యక్తి భారత వీర చక్ర అవార్డు గ్రహీత కెప్టెన్ విజయ రఘునందన్ రావు అని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. కెప్టెన్ విజయ రఘు నందన్ రావు వర్ధంతి సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధి 10వ వార్డు చిన్నబోనాలలో ఆయన విగ్రహాన్ని స్థానిక కౌన్సిలర్ బోల్గం నాగరాజ్ గౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ చిన్నబోనాలలో జన్మించిన రఘునందన్ రావు చిన్నతనం నుండే దేశ భక్తి కలిగి, దేశ సేవ కోసం ఆర్మీలో చేరి కెప్టెన్ స్థానానికి చేరుకున్నారన్నారు. 1965లో ఇండియా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరుడయ్యారన్నారు.



నేటి యువత కెప్టెన్ రఘునందనరావుని ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు.

స్వచ్ఛత హీసేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

నవతెలంగాణ-సిరిసిల్ల



సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం క్రింద చేపట్టాల్సిన కార్యక్రమం షెడ్యూల్ వివరాలను స్వచ్ఛ భారత్ మిషన్ అధికారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, 17 సెప్టెంబర్ నుంచి 02 అక్టోబర్ వరకు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛత హి సేవా అంశం పై పాఠశాలలో విద్యార్థుల కు వ్యాస రచన పోటీలు, ఆర్ట్ పోటీలు నిర్వహించాలని, పారిశుధ్య నిర్వహణ, ప్రాముఖ్యత పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. నిర్దేశించిన షెడ్యూలు తూచా తప్పకుండా పాటించాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, స్వచ్ఛత హి సేవా కార్యక్రమ సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, స్వచ్ఛభారత్ మిషన్ అధికారి సురేష్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మరిమడ్లలో పిచ్చికుక్క దాడి

ఇద్దరికీ తీవ్ర గాయాలు

నవతెలంగాణ-కొనరావుపేట



కొనరావుపేట మండలం మర్రిమడ్లలో తిక్కల జాహ్నవి (5) ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గ్రామంలోని పుల్కం జలంధర్‌పై దాడిచేసింది. దీంతో తీవ్రంగా గాయపడిన చిన్నారి జాహ్నవిని కుటుంబ సభ్యులు కోనరావుపేట పీహెచ్‌సీకి తరలించారు. జాహ్నవికి తీవ్ర గాయాలవడంతో ట్రీట్మెంట్ చేసి టీకాలు వేసిన డాక్టర్ వేణుమాధవ్ మెరుగైన వైద్యం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామంలో సమస్యలను పరిష్కరించాలి


నవతెలంగాణ-వీర్నపల్లి



గ్రామంలో అన్ని సమస్యలను పరిష్కరించాలని యువకుడు జాలపెల్లి మనోజ్ కుమార్ తెలిపారు. వీర్నపల్లి మండలం అడవిపదిర గ్రామంలో పలు సమస్యలపై గ్రామ కార్యదర్శి మహేష్ వినతి పత్రం అందజేసి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాలపెల్లి మనోజ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో చెరువు వద్దకు వెళ్లే రోడ్డు, క్రీడా ప్రాంగణం వద్దకు వెళ్ళే రోడ్లు వర్షాలకు కోతకు గురై రైతులకు, ప్రజలకు క్రీడాకారులకు వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాకేష్, నరేష్, జాషువా,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వం ప్రజల హామీలను నెరవేరుస్తుంది

- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం
- జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-సిరిసిల్ల

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలుచేయడం ప్రారంభించిందని ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తెలంగాణ అమరవీరులకు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్, ఎస్పీ నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17,1948లో తెలంగాణ నాటి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో ఐక్యమై 76 సంవత్సరాలు పూర్తి చేసుకుని 77వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ రోజును తెలంగాణ ప్రజా పాలన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. 1948 సెప్టెంబర్ 17న సువిశాల భారత దేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వతంత్ర్య భారతావనిలో 60 ఏండ్ల స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ నేడు అభివృద్ధి పథంలో ముందంజలో ఉన్నదని చెప్పడానికి చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆకాంక్షల అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు దీరిందని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రభుత్వం ఏర్పాటైన 48 గంటల్లోనే అమలు ప్రారంభించి చరిత్ర సృష్టించింది. ఆడబిడ్డల కన్నీళ్లు తుడవాలన్న లక్ష్యంతో ప్రారంభించిందే మహాలక్ష్మీ పథకంలోని మరో పథకం 500 రూపాయలకే వంట గ్యాస్ ఇవ్వాలన్న ఆలోచన. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన ప్రారంభించామన్నారు. పేద, బడుగు వర్గాల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇండ్లు పేరుతో నూతన గృహనిర్మాణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. భద్రాద్రిలో పరమ పవిత్రమైన శ్రీరాముని సన్నిధిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ పథకం ద్వారా ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3 వేల 500 ఇళ్ళ చొప్పున రాష్ట్రంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 4 లక్షల 50 వేల ఇళ్ళ నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ మొహినోద్దీన్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట వారసులు

- సిరిసిల్ల పోరాటాల గడ్డ
- సీపీఐ(ఎం)రాష్ట్ర కమిటీ సభ్యులు టి.స్కైలాబ్ బాబు

నవతెలంగాణ-సిరిసిల్లటౌన్



కమ్యూనిస్టులే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసులని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలు నడిపింది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. నాడు దొరలకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని బీజేపీ ముస్లింలకు, హిందువులకు మధ్య జరిగిన ఘర్షణగా చిత్రీకరిస్తుందన్నారు. తెలంగాణలో కమ్యూనిస్టులు చేసిన సాగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య, షేక్ బందగి, రాన్ నాయక్, షోయబుల్లాఖాన్ లాంటి ఎందరో వీరులు అశువులుబాసారన్నారు. ముస్లీం నాయకులు సైతం నిజాంపైన పోరాటం చేశారన్నారు. బీజేపీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుమడం సరికాదన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన బద్దం ఎల్లారెడ్డి, అమృత్ లాల్ శుక్ల, కర్రోలి నరసయ్య, గడ్డం తిరుపతి రెడ్డి, భూపతి రెడ్డి ల విగ్రహాలను ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలన్నారు. కమ్యూనిస్టుల స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని, మతోన్మాదం, కార్పొరేట్ సంస్థలతో కలిసి ప్రజలపై చేసిస్తున్న దాడులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ముశం రమేష్ జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ మల్లారపు అరుణ్ కుమార్, జవ్వాజి విమల, సూరం పద్మ,ఎర్రబెల్లి నాగరాజు, ముక్తి కాంతా అశోక్, మల్లారం ప్రశాంత్, గురజాల శ్రీధర్, నక్క దేవదాస్, సిరిమల సత్యం,మిట్టపల్లి రాజమల్లు,రాపల్లి రమేష్, ఉడుత రవి మంద అనిల్, రామంచ అశోక్, సామనపల్లి రాములు గీస బిక్షపతి,జగదీష్ కమలాకర్, బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాటుదాం... అమ్మపేరుమీద మొక్క..

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట



మొక్కలు నాటుతున్న ఎంపీడీవో

ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీడీవో సత్తయ్య ఆమ్మ పేరు మీద మొక్క నాటడం కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి హామి ఉద్యోగస్తులు, అంగన్‌వాడీ ఆశ కార్యకర్తలతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీవో కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రాజు, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ఏపీవో కొమురయ్య, టీఏలు రాజు, నాగరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్, బిల్ కలెక్టర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, క్షేత్ర సహాయకులు నరేష్‌లు పాల్గొన్నారు.

ఎందరో త్యాగల ఫలితమే స్వరాష్ట్రం

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట



తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తల్లి సోనియా గాంధీ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జాతీయ జెండాను మండల కాంగ్రెస్ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ ఎందరో త్యాగాల ఫలితమే స్వరాష్ట్రం సాధించుకున్నా మన్నారు. పోరాటాలు, సంఘర్షణలతో సాధించుకున్న తెలంగాణ ప్రపంచ దేశాలకు ఆదర్శమని అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిర్మాణాత్మక ప్రణాళికలతో అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు షేక్ గౌస్, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, మెండే శ్రీనివాస్ యాదవ్, సూడిది రాజేందర్, గుండాడి రామిరెడ్డి, రఫీక్, పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు, బండారి బాల్‌రెడ్డి, నంది కిషన్, గంట కార్తీక్ గౌడ్, మాజీ సర్పంచ్ రవీందర్‌గుప్తా, అంతేర్పుల గోపాల్, పాల్గొన్నారు.

గౌడ సంఘం ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి శశికాంత్ గౌడ్

నవతెలంగాణ-కొనరావుపేట

కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ గౌడ సంఘం ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి శశికాంత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం గౌడ సంఘం సభ్యులందరూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌడ సంఘం ఉపాధ్యక్షుడిగా పొన్నం పరశురాములు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంగలి దేవయ్య గౌడ్, కోశాధికారిగా ఎదురుగట్ల రాజేశం గౌడ్ లను ఎన్నుకున్నారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి, గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండలం కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో రఘురాం కార్యదర్శులతో సమావేశం నిర్వహించి 15 రోజుల పాటు జరిగే స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలపై అవగాహన కల్పించి ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ కార్యక్రమాలు గ్రామాల్లో చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీహరి, ఏపీఎం నర్సయ్య, టీఏ వనిత, కార్యదర్శులు ఉన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుడి మృతి

నవతెలంగాణ-ముస్తాబాద్



ముస్తాబాద్ మేజర్ గ్రామపంచా యతీ కార్మికుడిగా పనిచేస్తున్న మీసా లక్ష్మీపతి మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని గ్రామపంచాయతీ ఈవో పరామర్శించి పూల దండలు వేసి నివాళులర్పించారు. లక్ష్మీపతి మంచి వర్కర్ అని ఎంత పని అయినా కష్టపడి పనిచేసేవాడని ఈవో రమేష్ అన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు పంచాయతీ కార్మికులు అధికారులను కోరారు.

కార్మికుడికి నివాళులర్పిస్తున్న ఈవో

తెలంగాణ తల్లికి పాలాభిషేకం



ముస్తాబాద్‌లో...

నవతెలంగాణ-ముస్తాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులోని సచివాలయం ముందు అధికారికంగా రాజీవ్ గాంధీ విగ్రహంను నెలకొల్పడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద ఉన్న తెలంగాణ తల్లికి బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహంకు పాలాభిషేకం నిర్వహించినట్లు మండల అధ్యక్షుడు సురేందర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డి అధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వ్యతిరేకంగా తెలంగాణ తల్లి చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బంజార సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళా, మండల సీనియర్ నాయకులు రవి, రామ స్వామి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రుద్రంగి

సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణకు వ్యతిరేకంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు చేయాలని పార్టీ నాయకులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునివ్వగా ఆయన ఆదేశాల మేరకు రుద్రంగి మండల అధ్యక్షుడు దేగవత్ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పాలభిషేకం చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆసలు తెలంగాణకు రాజీవ్ గాంధీకి సంబంధం లేదని తెలంగాణ ఆత్మ గౌరవానికి ప్రతిక డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయాంలో ఆటూ త్యాగాలకు నిదర్శనమైన ఆమరజ్యోతి మధ్యలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం అంటే తెలంగాణ ప్రజలకు ఉన్న భావోద్వేగాలను పేగు బంధాలను తెంపడమే అన్నారు. ఈ కార్యక్రమంలో, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, మడిశెట్టి ఆనందం,గంగం మహేష్, కంటే రెడ్డి,తలారి నర్సయ్య, చెప్యాల గణేష్,కోడిగంటి శ్యామ్,గొళ్ళెం నర్సింగ్,అల్లూరి గంగారెడ్డి,బొడ్డు మల్లయ్య పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహనికి బదులు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చందుర్తి

సచివాలయం ముందు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడంతో దానికి నిరసనగా మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహంకు పాలాబిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ తల్లికి అవమానం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వంను విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్యలు పాల్గొన్నారు.



చందుర్తిలో...

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుమితే ప్రజలే బుద్ధి చెబుతారు

సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రవెల్లి నాగరాజు

నవతెలంగాణ-కొనరావుపేట



కోనరావుపేట మండల్ సుద్దాల గ్రామంలో తెలంగాణ రైతంగా సాయుధ పోరాట అమరవీరులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగసాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు సాగించాలని, మతోన్మాదం, కార్పొరేట్ సంస్థల కలిసి ప్రజలపై చేపిస్తున్న దాడులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రజలను పట్టిపీడించి, వెట్టిచాకిరి చేయించుకున్న వారిలో విసునూరు రాంచంద్రారెడ్డి, జన్నారం ప్రతాప రెడ్డి లాంటి హిందువులైన జమీందారులు, జాగిర్దారులు, దొరలు, దేశ్ ముఖ్‌లు, భూస్వాములు, పటేల్, పట్వారిలే మెజారిటీగా ఉన్నారని, వీరి ఆగడాలకు వ్యతిరేకంగానే ప్రజలంతా కుల, మతాలకతీతంగా ఐక్యంగా సాగించిన పోరాటాన్ని మతం పేరుతో ఎలా వక్రీకరిస్తారని ఆయన విమర్శించారు. బీజేపీ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుమితే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమాంటి ఎల్లారెడ్డి, సీపీఐ(ఎం) నాయకులు మాసం సురేష్, కుంటెల్లి రాజయ్య, పవన్, రవి అంజయ్య,ఆనందం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి మాడల్ స్కూల్ ఎఫ్ఏసీ ప్రిన్స్‌పాల్‌గా అశోక్

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండలం కేంద్రంలో మాడల్ స్కూల్ ఎఫ్ఏసీ ప్రిన్స్‌పాల్‌గా అశోక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా ఎలగందల్ మండలం మాడల్ స్కూల్‌లో పీజీటీ కామర్స్‌గా విధులు నిర్వర్తించాను. ప్రభుత్వం బదిలీ చేపట్టడంతో వీర్నపల్లి ఎఫ్ఏసీ ప్రిన్స్‌పాల్‌గా వచ్చానన్నారు. ఇంతకు ముందు ఉన్న ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ విశ్వనాథం జులపల్లి మండలం బదిలీపై టీచర్‌గా వెళ్ళారు.

నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

మాదిగ సంక్షేను సంఘం పట్టణ కమిటీని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నేదూరి లక్ష్మణ్ తెలిపారు. గౌరవ సలహాదారులుగా కత్తెర దేవదాస్, ఆకునూరి బాలరాజు, గౌరవ అధ్యక్షుడు నక్క నరసయ్య, ఉపాధ్యాక్షులు గోల్లపెల్లి పరశురాములు, కోమ్ము త్యాగరాజు, మెట్ట రాజు, ప్రధాన కార్యదర్శి గడ్డం హన్మంతు, కోశాధికారి ఆకునూరి బాలకిషన్, సహాయక కార్యదర్శులుగా ఆకునూరి రమేష్ బాబు, ఎడ్ల నరేష్ గడ్డం ప్రసాద్, ఆకునూరి సురేష్‌లను కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



వీర్నపల్లిలో...

నవతెలంగాణ-వీర్నపల్లి

వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మారుతిరెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో రఘురాం, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ ఎల్లయ్యగౌడ్, మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్,అంబేద్కర్ పాఠశాలలో రఘుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భూత శ్రీనివాస్ పాఠశాలలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నవతెలంగాణ-రుద్రంగి

ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి స్థానిక నాయకులతో కలసి జెండా ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నిజాం పరిపాలనలో ఉన్న హైదారాబాద్ ప్రాంతాన్ని నిజాంల చెరలో నుండి దేశ మొదటి ప్రధానమంత్రిగా ఉన్న జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలో క్యాబినెట్‌లో సర్దార్ వల్లాభాయ్ పటేల్ ఆర్థిక మంత్రిగా ఉండి నిజాం రాజుల మెడలు వంచి మన ప్రాంతానికి సెప్టెంబరు 17న స్వేచ్ఛా వాయువులను అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, డీసీసీ కార్యదర్శి చెలుకల తిరుపతి, ప్యాక్స్ డైరెక్టర్ సర్సారెడ్డి, ఆలయ చైర్మన్ కొమిరె శంకర్, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్,పాల్గొన్నారు.

నవతెలంగాణ-ముస్తాబాద్

మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సురేష్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో భాస్కర్ మేజర్ గ్రామపంచాయతీలో ఈవో రమేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిందని పేద బడుగు బలహీన నిరుపేద వర్గాల ప్రభుత్వం కాంగ్రెస్ కాబట్టి ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు.

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ ప్రజాపరిపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ జాతీయ పతాకావిష్కరణ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్‌లో..

నవతెలంగాణ-చందుర్తి

కాంగ్రెస్ అంటేనే ప్రజాపాలన అని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకులు కూడా తెలంగాణ రాష్ట్రంను నైజం వ్యవస్థగా మార్చారని తెలిపారు. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం జరుపుకోవడం గర్వకరణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ మండల అధ్యక్షుడు రామస్వామి,గొట్టే ప్రభాకర్, మాజీ ఎంపీటీసీ గణేశ్, బొజ్జ మల్లేశం, శ్రీనివాస్, దారం చంద్రం ఉన్నారు.

గణనాథుడికి ఘనమైన వీడ్కోలు

- పండగలా నిమజ్జనోత్సవాలు
- మానేరు తీరంలో పోటెత్తిన భక్తులు



నవతెలంగాణ సిరిసిల్ల టౌన్/రూరల్

జై గణేశా.. బై బై గణేశా.. అంటూ భక్తులు ఆది గణపతికి ఘనమైన వీడ్కోలు పలికారు. తొమ్మిది రోజులుగా నిత్యం పూజలు, అన్నదానాలు నిర్వహించిన భక్తులు గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చారు.

వినాయక చవితి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని నిమజ్జన ఉత్సవాలు జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగాయి. అందంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను పెట్టి భక్తిపాటల హోరులో శోభాయాత్ర నిర్వహించారు. యువతి యువకులు నృత్యాలు చేసుకుంటూ గణనాథుని ఊరేగింపుగా తీసుకెళ్తూ మానేరు తీరంలో నిమజ్జనం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు మానేరు తీరం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
పెద్దపల్లి
బుధవారం | సెప్టెంబర్ 18, 2024 | www.navatelangana.com

కాంట్రాక్ట్ పద్ధతిలో 23 మంది వైద్యులు విధుల్లో చేరిక

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



నవతెలంగాణ-పెద్దపల్లి
రామగుండం జనరల్ ఆసుపత్రి/సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో కాంట్రాక్ట్ పద్ధతులు 23 మంది వైద్యులు విధుల్లో చేరడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 16 నుంచి ఆగస్టు 30 వరకు సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్వహించిన వాక్ ఇన్‌ఇంటర్వ్యూలో మొత్తం 36 మంది అభ్యర్థులు ఎంపిక కాగా, 23 మంది అభ్యర్థులు విధులలో చేరడం జరిగిందని, 1 అసోసియేట్ ప్రొఫెసర్, 11 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ,4 సీనియర్ రెసిడెంట్, 7 మంది ట్యూటర్/డ్యూటీ మెడికల్ అధికారులు విధులలో చేరారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అనవసరంగా ఏఐటీయూసీపై విమర్శలు చేయడం మానుకోవాలి

నవతెలంగాణ-గోదావరిఖని:



హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ అనవసరంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీపై విమర్శలు చేయడం మానుకోవాలని ఉప ప్రధాన కార్యదర్శి వైవి.రావు, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామిలు అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎఐటీయూసీపై విమర్శలు మానుకోకపోతే కార్మికులే తగిన బుద్ధి చెబుతారని రియాజ్‌ను వారు హెచ్చరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు అక్టోబర్‌లో జరిగే స్ట్రక్చర్ సమావేశాల్లో కృషి చేస్తామని అన్నారు. వరద బాధితులకు సహాయంలో రాజకీయాలు అవసరం లేదని అన్నారు. సమావేశంలో ఎఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్, నాయకులు జూపాక రాంచందర్, ఎస్.వెంకట్ రెడ్డి, ఎంఎ.గౌస్, ఎం.చక్రపాణి, దొంత సాయన్న పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం. రామాచారి

నవతెలంగాణ-రామగుండం



22న హైదరాబాదులో జరిగే రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం. రామాచారి పిలుపునిచ్చారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, బోనస్ చెల్లింపు, కార్మిక చట్టాల అమలు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మంగళవారం రామగుండం రైల్వే డిపో వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోనస్ లాంటి చట్టబద్ధమైన హక్కులు అమలుకు అవడం లేదని, హౌస్ కీపింగ్, కోల్ వ్యాగన్ క్లీనింగ్, కార్మికులకు జీవో ప్రకారంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ బిక్షపతి, రైల్వే కాంట్రాక్ట్ కార్మిక నాయకులు బి.శివ నాయక్, ఇఫ్తార్, బాలు నాయక్ పాల్గొన్నారు.

రామగుండం కమిషనరేట్‌లో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-గోదావరిఖని:



ప్రజాపాలన దినోత్సవ వేడుకలను రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాల యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ మొదటపోలీస్ గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ కమిషనరేట్ కార్యాలయం భవనం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ ప్రజాపాలన దినోత్సవ వేడుకల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ దామోదర్, ఆర్ఎస్ఐ శ్రావణి, వెంకట్ పాల్గొన్నారు.

ఆర్‌జీ-3 ఏరియాలో పర్యటించిన ఉపరితల గనుల జీఎం

నవతెలంగాణ-రామగిరి



ఉపరితల గనులలో పూర్తిస్థాయిలో యంత్రాలను వినియోగించి, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలని ఉపరితల గనుల జనరల్ మేనేజర్ డీవీఎస్. సూర్య నారాయణ రాజు అన్నారు. మంగళవారం ఆయన రామగుండం-3 ఏరియాలోని జీఎం కార్యాలయంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి, ఉపరితల గనులలో యంత్రాల వినియోగం, వాటికి కావలసిన విడిభాగాలు,పరికరాలు మొదలగు విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపరితల గనులలో యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి కావలసిన ప్రణాళికలను, చర్యలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ప్రాజెక్ట్ అధికారి ఎస్.రాధాకృష్ణ, ఏరియా సేఫ్టీ అధికారి జె రాజశేఖర్, సీహెచ్‌పీ డీజీఎం కాశీ విశ్వేశ్వరరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు ఉదయ్ భాస్కర్,ఎం. నాగరాజుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో గర్భిణీ మహిళలకు మెరుగైన వసతుల కల్పన

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి : మాతా శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలో ఉన్న మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ విభాగం, మందుల విభాగం, చిన్నపిల్లల వైద్య విభాగాలను పరిశీలించిన కలెక్టర్ ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆస్పత్రిలో గర్భిణీ స్త్రీలు కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, 3 సీటర్ బెంచ్ లను వెంటనే అవసరమైన మేర కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-ఓదెల



కరీంనగర్ పట్టణంలో మంగళవారం ఉద్యమ కారుల రాష్ట్ర కన్వీనర్,పెద్దపెల్లి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఉద్యమ కారులు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లను కలిసి వారి చేతులు మీదుగా పెద్దపెల్లి జిల్లా ఉద్యమకారుల చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో జరిగే ఉద్యమకారుల ఘన సన్మానంకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పించాలని,ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి,తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందించి క్యాబినెట్ బెటీలో చర్చించి కృషి చేస్తామని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉద్యమకారుల ఫోరం చైర్మన్ కనకం కుమారస్వామి,రాష్ట్ర నాయకులు బత్తుల శంకర్,బింగి రాజు, సందీప్,కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దిశగా ప్రజాపాలన

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద



నవతెలంగాణ-పెద్దపల్లి
రాచరిక పాలన నుంచి ప్రజాస్వా మ్యం దిశగా హైదరాబాద్ సంస్థా నం విలీనమైన రోజున మనం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించు కుంటున్నామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంగళవారం ఉదయం ముఖ్య అతిథి పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం మాట్లాడుతూ 1948 సంవత్సరం సెప్టెంబర్ 17వ తారీఖు చరిత్రలో చాలా ప్రాముఖ్యత ఉందని, 76 సంవత్సరాల క్రితం ఇదే రోజున హైదరాబాద్ సంస్థానం రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య భారత దేశంలో అంతర్భాగంగా మారిందని అన్నారు. తెలంగాణ ప్రజాస్వామిక స్వేచ్ఛను పొందడం కోసం ఆనాటి యావత్ సమాజం ఉద్యమించిందని, ఆదివాసీ యోధుడు కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, భీంరెడ్డి నర్సింహారెడ్డి, వీరవనిత చాకలి ఐలమ్మ, ప్రజా ఉద్యమానికి సేనాధిపతిగా నిలిచిన ఆరుట్ల రామచంద్రారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్, దేవులపల్లి వేంకటేశ్వర్ రావు, బద్దం ఎల్లారెడ్డి వంటి ప్రజా నేతల త్యాగాలను సగర్వంగా స్మరించుకుందామని, తమ అక్షరాలతో ప్రజల్లో ఉత్తేజాన్ని నెలకొల్పిన సురవరం ప్రతాపరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మగ్దూం మొహియుద్దీన్, దాశరథి కృష్ణమాచార్య, సుద్దాల హనుమంతు, బండి యాదగిరి, షోయబుల్లాఖాన్ వంటి సాహితీ మూర్తులకు ఘనమైన నివాళు లర్పిద్దామని అన్నారు. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీ పథకాలను అమలు చేసే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 2 రోజుల వ్యవధిలోనే మహాలక్ష్మీ పథకం క్రింద మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని,500 రూపా యలకే గ్యాస్ సిలిండర్ సరఫరా పథకాన్ని ప్రారంభించామని, రాష్ట్రంలోని పేదలకు గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిందని అన్నారు. రైతు సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని, ఏకకాలంలో రుణమాఫీ అంశాన్ని ప్రస్తుత ప్రజా ప్రభుత్వం సుసాధ్యం చేసిందని, 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ప్రిన్సిపాల్ జిల్లా, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణా రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్, అదనపు కలెక్టర్లు జె.అరుణశ్రీ, శ్యాం ప్రసాద్ లాల్, డీసీపీ ఎం.చేతన, ఆర్డీవో బి.గంగయ్య, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద నగరాలకు ధీటుగా రామగుండంను అభివృద్ధి పరుస్తాం

రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నగరాన్ని ఉత్తర తెలంగాణలోని ఇతర పెద్ద నగరాలకు ధీటుగా అభివృద్ధి చేస్తామని రామగుండం శాసన సభ్యులు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ బంగి అనిల్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలో ఆయన పాల్గొని జాతీయ పతాకం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరానికి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా అలాగే ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార, విద్య, వైద్య కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని అన్నారు. మూత పడిన జెన్‌కో విద్యుత్ సంస్థను అప్ గ్రేడ్ చేయించి సుమారు 8000 కోట్ల వ్యయంతో 800 మెగావాట్ల ప్రాజెక్టను మంజూరు చేయించుకోవడంలో రామగుండం నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, స్థానిక నాయకులు ఎంతో సహకరించారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు బాల రాజ్ కుమార్, ముస్తఫా, నాయకులు పాతపెల్లి ఎల్లయ్య, అద్దాల రామస్వామి, నగర పాలక సంస్థ ఈఈ రామన్, పాల్గొన్నారు.

ముమ్మాటికి సెప్టెంబర్ 17 విద్రోహ దినమే

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే.రాజన్న



నవతెలంగాణ-గోదావరిఖని:
ముమ్మాటికి సెప్టెంబర్ 17 విద్రోహ దినమేనని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్య దర్శి కే.రాజన్న అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17ను విద్రోహ దినంగా పాటిస్తూ గోదావరిఖని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పార్టీ జిల్లా నాయకులు ఈ.నరేష్ అధ్యక్షతన నిరసన సభ నిర్వహించారు. ఈ సదస్సులో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ చరిత్రను మరచిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అమర వీరుల త్యాగాలను పోరాటాలను పక్కదోవ పట్టిస్తూ, విలీనమని, విమోచ అని పాలకులు ఈ రోజును వక్రీకరిస్తున్నారని అన్నారు. ఈ దేశంలో పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సభలో నాయకులు ఐ.కృష్ణ, బి.అశోక్, శంకర్, కే.మల్లేష్, మెరుగు చంద్రయ్య, ఎం.దుర్గయ్య, ఎం.కొమరయ్య, కే.మొగిలి, పైడిపల్లి రమేష్, జనార్ధన్, సదానందం తదితరులున్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మంథని
ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంథని సింగిల్ విండో కార్యాలయంలో సంఘ అధ్యక్షులు కొత్త శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పెంద్రి రమ-సురేష్ రెడ్డి, ఎంపీడీవో,ఆర్డీవో కార్యాలయంలో మంథని ఆర్డీవో హనుమాన్ నాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.లక్ష్మీనారాయణ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు మంగళవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజాకార్ల అరాచకాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో అసువు లు బాసిన అమరవీరుల త్యాగం మరువ లేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపా ధ్యక్షులు బెల్లంకొండ ప్రకాష్ రెడ్డి,డైరెక్టర్లు ఆకుల రాజబాపు,లెక్కల కిషన్ రెడ్డి,కొత్త శ్రీనివా స్, దేవళ్ల విజయ్ కుమార్,మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, కమిషనర్ మల్లికార్జున స్వామి,ఎంఎసి మాజీ చైర్మన్ అజీం ఖాన్ పాల్గొన్నారు.

జూలపల్లి-పెద్దపల్లి డబుల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలి

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండల కేంద్రం నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్డు నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ, జూలపల్లి వాగుపైన నూతన బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు, అమరగాని ప్రదీప్ కుమార్ పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. పదేళ్లుగా జూలపల్లి మండల ప్రజలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొం టున్నారని, వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని గురువారం రోజున జూలపల్లి మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమరగాని ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా పెద్దపల్లికి వెళ్లే రోడ్డు గుంతలమయమై నరకప్రాయంగా మారిందని, తాము చేసిన ఉద్యమాల కారణంగా గత ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డు నిర్మాణానికై నిధులు మంజూరు చేశామని, గత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ భూమిపూజ చేపించినట్లుగా ఫోజులు ఇచ్చారని ఆరోపించారు. పదేళ్ళయినా పెద్దపల్లికి డబుల్ రోడ్డు, జూలపల్లిలోని వాగుపైన పాత బ్రిడ్జ్ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రెండురోజుల్లో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా, వాగుపైన నూతన బ్రిడ్జ్ నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో రెండు రోజుల అనంతరం మండల కేంద్రంలో దీక్షలు చేపడతామని, పాదయాత్రలు చేపట్టి, ఎమ్మెల్యే ఇల్లు ముట్టడి సైతం చేసి పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టి ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కంకణాల జ్యోతిబసు, తీగల అశోక్ గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్లు కొమ్మ ఐలయ్య,పాల్గొన్నారు.

మహబూబాబాద్ ఎంపీకి వినతి

నవతెలంగాణ-గోదావరిఖని:



ఎంపీకి వినతి అందజేస్తున్న సింగరేణి పెన్షనర్

బొగ్గు ఉద్యోగుల పెన్షన్ పెంపొందించుటకు అఖిల భారత పెన్షన్ అసోసియేషన్ కన్వీనర్ పీకే సింగ్ రాథోర్ పంపిన వినతి పత్రాన్ని మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌కు హన్మకొండలోని హోటల్ హరిత కాకతీయలో వరంగల్‌లో నివాసం ఉంటున్న సింగరేణి పెన్షనర్ యర్రం దామోదర్ ద్వారా మంగళవారం అందజేసినట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రాంచందర్ రావు తెలిపారు. దీనికి వెంటనే స్పందిస్తూ బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ వ్రాస్తానని, రాబోయే పార్లమెంట్ శీతాకాల సమావేశంలో కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-గోదావరిఖని:



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన జెండా కార్యక్రమం సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో గోదావరిఖనిలోని ఇల్లందు విశ్రాంతి భవనంలో విడిది తీసుకున్న శాసన మండలి డిప్యూటీ చైర్మన్, తెలంగాణ ముదిరాజ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షులు బండ ప్రకాష్ ముదిరాజ్‌కు రామగుండం నియోజకవర్గ అధ్యక్షులు జిట్టవేన ప్రశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రామగుండం మహిళా అధ్యక్షురాలు గొలుసు జ్యోతి, నాయకులు చిట్టవేని వేణు, తిప్పారవేని స్వరూప తదితరులున్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మంథని



తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరిం చుకు ని మంగళ వారం మంథని మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో పాలాభి .షేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మలి దశ ఉద్యమాలు జరిగాయన్నారు. 2001లో కేసీఆర్ సారథ్యంలో ప్రారంభమైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భ వించిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిరభవించాక అధికారంలోకి వచ్చిన కేసీఆర్ సర్కార్ అద్భుతమైన పరిపాలన సాగించి తెలంగాణ రాష్ట్ర ప్రగతికి బంగారు బాటలు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఏగోలపు శంకర్ గౌడ్,నాయకులు కనవేణ శ్రీనివాస్,ప్రసాద్ రావు,కాయతి సమ్మయ్య,ఆకుల రాజబాబు, మంథని లక్ష్మణ్, పెగడ శ్రీనివాస్,పాల్గొన్నారు.

మండలంలో ప్రజా పాలన దినోత్సవం

నవతెలంగాణ-ఓదెల



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించడంతో ఓదెల మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓదెల తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ యాకన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో ఎంపీడీవో తిరుపతి, మెడికల్ ఆఫీసర్, వ్యవసాయ అధికారి అధికారి భాస్కర్, పాల్గొన్నారు.

ఏసీఎంవోగా పదోన్నతి పొందిన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి ఏసీఎంవోగా పదోన్నతి పొందిన డాక్టర్ కిరణ్ రాజ్‌కుమార్‌కు జాతీయ మాల మహానాడు సంఘం పట్టణ అధ్యక్షుడు మాలెం మధు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం టౌన్ అధ్యక్షుడు పిట్టల వెంకటి, కొండ కుమార్, కత్తెరమల్ల రమేష్, మర్రి ఐలయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు మండలంలో విశ్వకర్మ జయంతి

నవతెలంగాణ-జూలపల్లి/ ఎలిగేడు



ఎలిగేడు మండలంలోని పలు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణులు మండల అధ్యక్షులు తాటికొండ అనిల్ చారి, ఉపాధ్యక్షులు కసువోజ్వాల సత్యనా రాయణ చారి ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు తాటికొండ కృష్ణ చారి, సలహాదారులు, కనుకాచారి, తాటికొండ సందాచారి,అనిల్ ,వీరయ్య చారి, తిరుపతి చారి,దయానంద చారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అడవి శ్రీరాంపూర్‌లో తెలంగాణ విమోచన దినోత్సవం

నవతెలంగాణ-ముత్తారం:



సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినంగా పాటిస్తూ ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు బిరుదు గట్టయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మిఠాయిలు పంపిణీ చేశారు.

అంతర్విభాగాల వార్షిక క్రీడలు ప్రారంభం

నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్జీ-1 ఏరియా వర్క్ ఫీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్విభాగాల వార్షిక క్రీడా పోటీలు 2024-25 మంగళవారం ప్రారంభం అయ్యాయి. ముఖ్య అతిథులుగా 11 గ్రూప్ ఏజెంట్ చిలక శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ జీఏ చీఫక్ష కో ఆర్డినేటర్, పర్సనల్ మేనేజర్ కిరణ్ బాబు హాజరై వాలీబాల్ పోటీలతో ప్రారంభించారు. ఈ పోటీల్లో జిడికె 1 గ్రూప్, జిడికె 11 గ్రూప్, పలు డిపార్ట్‌మెంట్‌ల ఉద్యోగులకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-1 ఏరియా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ గౌరవ కార్యదర్శి బంగారు సారంగపాణి, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరి అరెల్లి పోషం, సీఎంవోఏఐ ప్రతినిధి క్రాంతి కుమార్, ఏరియా ఇంజనీర్ దాసరి వెంకటేశ్వర్ రావు, ఎజిఎం ఐఈడి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు



వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



జెండా వందనం చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ప్రజలకు ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు జిల్లా ప్రగతి నివేదికను వివరించారు. ఈ వేడుకల్లో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పేయి, మేయర్ సునీల్ రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సుడా కార్యాలయంలో..

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా స్థానిక సుడా కార్యాలయంలో సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులు, డిప్యూటీ కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

సహకార భవనంలో..

ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా సహకార భవనంలో కరీంనగర్ జిల్లా జాయింట్ రిజిస్టర్ సహకార శాఖ అధికారి ఎస్.రామాంజనచర్య సమక్షంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ రిజిస్టర్ అధికారి మాట్లాడుతూ..ఎందరో త్యాగధనుల వల్ల మనకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం కొత్త పథకాలను అమలుపరుస్తున్న సందర్భంగా ప్రతి ఉద్యోగి ప్రజల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాలని, తెలంగాణ రాష్ట్రం ఇచ్చే పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ కార్యదర్శి కే.జమున రాణి, మంజుల, లక్ష్మణచారి, శైలజ, కె.అశోక్ కుమార్, సువర్ణ, సహకార శాఖ నాన్-గెజిటెడ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జలాలో ద్దీన్ అక్బర్, కే.అనిల్ కుమార్, ఎస్.రాజమౌళి, కార్యదర్శి, ప్రీత్ పాల్ సింగ్, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో మంగళవారం అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరి, మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ మద్రి ఓదెలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజేశ్వర్ రావు లు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వరలక్ష్మీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి జాతీయ పతాకాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం నీరజ ఎగరవేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కే నాగరాజు, తాసిల్దార్ పి నవీన్ కుమార్, ఎస్సై అనూష, మేనేజర్ డి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

వీణవంక : మండల కేంద్రంలో ప్రజా పాలన సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎమ్మార్వో, పోలీస్ స్టేషన్ లలో జెండా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, పోలీస్ శాఖ పాల్గొన్నారు.

హుజురాబాద్ : భారతదేశంలో హైదరాబాదు సంస్థానాన్ని సెప్టెంబర్ 17న విలీనం చేసిన సందర్భంగా మంగళవారం పట్టణంలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు కార్యాలయాల్లో ప్రజా పాలన దినోత్సవం పురస్కరించుకొని జాతీయ పతాకాలను ఎగురవేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి హుజురాబాద్ ఆర్డిఓ రమేష్ బాబు జాతీయపతాక ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్పర్సన్ గందె రాధిక, గ్రంథాలయంలో లైబ్రేరియన్ కనక రత్నం, ఎమ్మార్వోలో, ఆర్ అండ్ బి కార్యాలయంలో, ఆర్డీవో కార్యాలయంలో, రెవిన్యూ కార్యాలయంలో, వివిధ ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో ఆయా ప్రధానోపాధ్యాయులు అధికారులు జాతీయ పతాకార ఆవిష్కరించి వందనం చేశారు.

గంగాధర : మండలంలోని గ్రామ గ్రామాన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంపై ఎంపీడీవో జనార్ధన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేయగా, ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ జాగీరపు రజిత-శ్రీనివాసరెడ్డి జెండాలను ఎగుర వేశారు. అదేవిధంగా ప్రతి కార్యాలయంతోపాటు ప్రతి జీపీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాలను ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జాగీరపు రజిత మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఏఎంసీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, డైరెక్టర్లు చందు, శ్రీధర్, మధు, శంకరయ్య, మహేశ్, గరుగంటి కరుణాకర్, ఏడీఏ ప్రియదర్శిని, ఆయాశాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



చొప్పదండి: ప్రభుత్వ ప్రజా పాలన పథకాలను, అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలోని, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని, మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జాతీయ జెండాను ఎగరవేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వంలోనే, సుపరిపాలన అందిస్తున్నామని, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన మాట మేరకు, అన్ని హామీ లను నెరవేరుస్తున్న మని తెలిపారు. అనంతరం మహాలక్ష్మి పథకంలో భాగంగా 500 రూపాయలకే సిలిండర్ , ప్రొసీడింగ్ లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

నిజాం పరిపాలనకు చరమ గీతం పాడింది కమ్యూనిస్టు పార్టీ

- చరిత్రను వక్రీకరించాలని చూస్తే ఊరుకోం.
- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

నవతెలంగాణ - భగత్ నగర్ :

హైదరాబాద్ సంస్థానంలో నిజాం పరిపాలనకు చరమగీతం పాడింది కమ్యూనిస్టు పార్టీయేనని, చరిత్రను వక్రీకరించాలని చూస్తే సీపీఐ చూస్తూ ఊరుకోదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్ నగరంలోని సాయుధ పోరాట యోధుడు, సీపీఐ కరీంనగర్ జిల్లా మొట్టమొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్ రావు విగ్రహానికి మర్రి వెంకటస్వామి పూలమాలవేసి నివాళులర్పించారు. హైదరాబాద్ సంస్థానానికి (తెలంగాణ రాష్ట్రానికి) స్వాతంత్ర్యం సిద్ధించిన సెప్టెంబర్ 17 ను పురస్కరించుకొని కరీంనగర్ సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద జాతీయ పతాకం తో పాటు సీపీఐ పతాకాన్ని వెంకటస్వామి ఎగురవేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధిస్తే హైదరాబాద్ సంస్థానానికి (తెలంగాణ ప్రాంతానికి) స్వాతంత్ర్యం రాలేదని నిజాం నవాబ్ ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తుండేవాడని, వెట్టి చాకిరి, బానిసత్వం, దున్నేవానికి భూమి కావాలని, భూమి కోసం, భుక్తి కోసం, దాస్య శృంఖలాల విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ,ఆంధ్ర మహాసభ నాయకులు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూమ్ మొహియుద్దీన్ లు 1947 సెప్టెంబర్ 11న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని, ఆ పిలుపునందుకొని, వేలాది గ్రామాలు,పట్టణాలు వాడవాడలో పెద్ద ఎత్తున ప్రజలు చైతన్యమై నిజాం నవాబు,రజాకార్, దేశ్ ముఖ్,పటేల్ పట్వారిలకు వ్యతిరేకంగా పోరాడి తరిమికొట్టారని, సాయుధ పోరాటం ఉధతంగా జరిగిన సందర్భంలో 4,500 వందల మంది ఆ మహత్తర పోరాటంలో అసువులు బాసారని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, వీరోచితంగా సాగిన ఆ పోరాట పలితంగానే 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబు హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడని వెంకటస్వామి తెలిపారు. కొంతమంది మత చాందసవాదులు ఈ మహత్తర పోరాటాన్ని వక్రీకరించడానికి కుట్ర చేస్తున్నారని,ఆనాటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, కేంద్ర హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ వల్లనే నిజాం నవాబు లొంగిపోయాడని దుష్ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి కమ్యూనిస్టుల పోరాటం ఉధృతంగా సాగడాన్ని గమనించిన నిజాం నవాబు భయభ్రాంతులకు గురై హైదరాబాద్ సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేశాడని వెంకటస్వామి గుర్తు చేశారు. 1948 సెప్టెంబర్ 17న తర్వాత కూడా కేంద్ర బలగాలు తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టులను, ప్రజలను అణిచివేసారని అన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,కరీంనగర్,సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,జాగీరు సత్యనారాయణ,జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బోయిని తిరుపతి, పైడిపెల్లి రాజు,కిన్నెర మల్లవ్వ,కంది రవీందర్ రెడ్డి,పంజాల శ్రీనివాస్, మచ్చ రమేష్,నలువాల సదానందం,న్యాలపట్ల రాజు,సాయ వేని రాజమల్లు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అధికారుల నిర్లక్ష్యం..
అంధకారంలో గణపతుల ఊరేగింపు



నవతెలంగాణ - వీణవంక :

మండలంలోని గన్ముకుల గ్రామంలో సోమవారం గణపతుల ఊరేగింపు ఉత్సవాలను భక్తులు గ్రామంలో వీధి దీపాలు లేక చీకట్లో చేసుకోవాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పెషల్ ఆఫీసర్ పాలనతో గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని, కనీసం విద్యుత్ దీపాలు పండుగ పూట లేకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, మండల అధికారులు గ్రామంలో వెంటనే వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

30 వరకు ఓపెన్ టెన్త్ ఇంటర్ అడ్మిషన్లు

కరస్పాండెంట్ కె.దేవానంద్

నవతెలంగాణ - చొప్పదండి



ఎక్సెంట్ కరస్పాండెంట్ కే దేవానంద్

చొప్పదండి మండల కేంద్రంలోని ఎక్సెంట్ హైస్కూల్లో, ఓపెన్ టెన్త్, ఇంటర్ ఈనెల 30వరకు ఫైన్‌తో అడ్మిషన్లు జరుగుతున్నాయని, పాఠశాల కరస్పాండెంట్ కె.దేవానంద్ మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ చదవలేక పోతున్నామని బాధపడుతున్న, విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాల కోసం ఫైన్‌తో అడ్మిషన్లు ఈ నెల 30వరకు జరుగుతాయని తెలిపారు. అడ్మిషన్లు తీసుకునేవారు, ఎక్సెంట్ హై స్కూల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భక్తు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ - హుజూరాబాద్

మండలంలోని పెద్ద పాపయ్యపల్లి గ్రామంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంఘం ఐలయ్య ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముకుందరెడ్డి, దయాకర్‌రెడ్డి, శ్రవణ్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన అల్ఫోర్స్ విద్యార్థులు

నవతెలంగాణ - రామడుగు



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి నరేందర్ రెడ్డి

రాష్ట్రస్థాయి షుటింగ్ బాల్ పోటీలకు అల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల7వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ అండర్16 విభాగంలో మండలంలోని అల్ఫోర్స్ గోపాల్‌రావుపేట పాఠశాలకు చెందిన 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు వి.వంశీక, ఆర్ సంహిత, కె సృజన, బి.శ్రీహర్ష, సిహెచ్, కార్తీక్, కె.సుశాంత్ మంచి ప్రతిభ కనబరిచి, ఈనెల 18న కరీంనగర్ జిల్లా కురిక్యాలలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పేరియర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ - హుజురాబాద్

పెరియార్ ఇవి రామస్వామి 146వ జయంతి వేడుకలు మంగళవారం హుజురాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, మున్సిపల్ కార్యాలయ సమీపంలో వేర్వేరుగా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పెరియార్ ఫ్లెక్సీ కి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..తమిళనాడులో జన్మించిన పెరియార్ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సమాజంలో అసమానతలకు కారణమైన వాటిపై పోరాటం చేశాడని అన్నారు. పెరియార్ సంఘంలో మార్పుల కోసం కషిచేసిన సంస్కర్త అని అన్నారు. జంతు బలులను వ్యతిరేకించాడని, కమ్యూనిజాన్ని బలపరిచాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్ తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్ సాదుల రవీందర్ బాబు, వేల్పుల రత్నం, పాక సతీష్, ప్రభాకర్ , కొలిపాక సారయ్య, ఈశ్వర్ రెడ్డి,ఎల్. సారయ్య, మానవ వికాస వేదిక రాష్ట్ర నాయకులు బుచ్చయ్య, సంధ్యల వెంకన్న, భోగం రమేష్, కలకోటి వెంకటేష్, మాడ్గుల ఓదెలు,వేల్పుల మల్లేశ్, స్వామి, రాజు, రఫి, రాజు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా కాంగ్రెస్ దినోత్సవం

నవతెలంగాణ - చొప్పదండి



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ 40వ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.100తో మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి నేరెళ్ల కవిత, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటి స్వరూప, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గణేష్ నిమజ్జనం

నవతెలంగాణ - మానకొండూర్

మంగళవారం ప్రారంభమైన వినాయక నిమజ్జనం బుదవారం మధ్యాహ్నం 1 గంట వరకు ప్రశాంతంగా ముగిసింది. చిన్న, పెద్ద గణేష్ విగ్రహాలు కలిపి భక్తులు సుమారు 722 చెరువులో నిమజ్జనం చేసినట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన ప్రదేశంలో అధికారులు తాగు నీటి వసతి, విద్యుత్, పార్కింగ్ తో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ తో పాటు చుట్టూ పక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేయడంతో ఒక దాని పై ఒకటి పడ్డాయి. పెద్ద విగ్రహాలను నిమజ్జనం చేదానికి 4 క్రేన్ లను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టారు.



అన్నదానం చేస్తున్న ఒడితల కుటుంబ సభ్యులు

ఆశ్రమానికి అండగా ఉంటాం

నవతెలంగాణ - జమ్మికుంట

మానవసేవయే మాధవ సేవ అని మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటామని ఒడితల కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం మాజీ రాజ్యసభ సభ్యులు వొడితల రాజేశ్వరరావు సతీమణి శారదా దేవి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మారుతీనగర్‌లో గల సాయి మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులందరికీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ అభివృద్ధికి చేయూతనిస్తున్న వొడితల కిషన్‌రావు, వొడితల శ్రీనివాసరావు హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు ఆశ్రమ వ్యవస్థాపకులు బుచ్చి రాములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటోనగర్ యూనియన్ ప్రెసిడెంట్ కృష్ణస్వామి, డాక్టర్ బుచ్చిబాబు, సంతోష్, ప్రముఖ వ్యాపారవేత్త ముక్క బాబన్న పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం

నవతెలంగాణ - తిమ్మాపూర్



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మండలంలోని మన్నెంపల్లి గ్రామంలో సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహ ఆవిష్కరణకు వ్యతిరేకంగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు రావుల రమేష్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఉల్లెంగుల పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ డైరెక్టర్ అలవాల కోటికి ఘన సన్మానం

నవతెలంగాణ - తిమ్మాపూర్



సన్మానిస్తున్న పాలక వర్గ సభ్యులు

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ గా ఎన్నికైన, నుస్తులాపూర్ సహకార సంఘం మాజీ చైర్మన్ అల్వాల కోటిని మంగళవారం నుస్తులాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు గుజ్జుల రవీందర్ రెడ్డి పాలకవర్గ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సంఘాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, సీఈఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో పైలం పిలగా మూవీ టీం సందడి



మాట్లాడుతున్న చిత్ర బృందం

నవతెలంగాణ - భగత్ నగర్

కరీంనగర్‌కు చెందిన హీరో, డైరెక్టర్, ప్రొడ్యూసర్ నిర్మిస్తున్న సినిమా 'పైలం పిలగా' తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబర్ 20న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో చిత్ర బృందం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో సాయి తేజ కల్వకోట, నటుడు ప్రణవ్ సోను, దర్శకుడు ఆనంద్ గుర్రం, గీత రచయిత చంద్రమౌళి, నిర్మాత రామకష్ణ సినిమా విశేషాలను పంచుకున్నారు. హ్యాపీ హార్స్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నిర్మించిన 'పైలం పిలగా' సినిమా పాటలు ఇప్పటికే రిలీజ్ కాగా టీజర్‌కు, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోందన్నారు. ఈ గ్లోబలైజేషన్ యుగంలో యువత ఉద్యోగాల కన్నా సొంత స్టార్టప్‌లు, వ్యాపారాలవైపే పరుగులు పెడుతున్నారు. కోట్లు సంపాదించాలని కలలు కంటున్నారు. ఇలాంటి ఒక యువకుడు తన ఊర్లోనే, తన భూమిలోనే సొంత వ్యాపారం ప్రారంభించి జీవితంలో ఎదగాలనుకున్నప్పుడు పంచాయతీ ఆఫీస్ నుంచి సెక్రెటేరియట్ ఆఫీస్ వరకు ప్రశ్నలు, సవాళ్లు, అవినీతి, అలసత్వం నిండిన బ్యూరోక్రసీ సిస్టంలో ఇరుక్కొని ఎన్ని బాధలు పడ్డాడో తెలిపే హాస్యభరిత వ్యంగ చిత్రమే పైలం పిలగా అని వివరించారు. సాయి తేజ కల్వకోట, పావని కరణం జంటగా నటించారు. ఈ చిత్రం లోని ప్రముఖ సింగర్ రామ్ మిర్యాల పాడిన పాటను సెన్సిబుల్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల రిలీజ్ చేయగా ఇప్పుడు యూత్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఇక చిత్ర టీజర్‌ను సెన్సేషనల్ డైరెక్టర్ హరీష్ శంకర్, ట్రైలర్‌ను డైరెక్టర్ వెంకటేష్ మహా లాంచ్ చేసి చిత్రంలోని డైలాగ్స్, పాటలు చాలా ఆకట్టుకుంటున్నాయని మూవీ టీంను అభినందించారు. నందమూరి బాలకృష్ణ టీజర్, ట్రైలర్‌ను చూసి తెలంగాణ యాసలోని డైలాగ్స్‌కు ఫిదా అయి సినిమా డైరెక్టర్‌ను, చిత్ర బృందాన్ని ప్రశంసించి ఆల్ ది బెస్ట్ చెప్పారు . నందమూరి బాలకష్ణ, విక్టరీ వెంకటేష్, వంటి టాలీవుడ్, బాలీవుడ్ అగ్రనటులతో సహా వందకి పైగా యాడ్ ఫిలిమ్స్‌కు దర్శకత్వం వహించిన ఆనంద్ గుర్రం దర్శకత్వంలో వస్తోన్న మొదటి చిత్రం 'పైలం పిలగా' విడుదలకు సిద్ధమవుతోంది. హ్యాపీ హార్స్ ఫిలిమ్స్ బ్యానర్‌పై రామకృష్ణ బొద్దుల, ఎస్ కే.శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రంలో డబ్బింగ్ జానకి, చిత్రం శీను, మిర్చి కిరణ్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. యశ్వంత్ నాగ్ ఆరు అద్భుతమైన పాటలతో మెలోడియస్ సంగీతాన్ని అందించారు. కెమెరా సందీప్ బద్దుల, ఎడిటింగ్ రవితేజ, శైలేష్ దారేకర్, స్టైలిస్ట్ హారిక పొట్ట, లిరిక్స్ ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సంతోష్ ఒడ్నాల పనిచేసిన ఈ చిత్రానికి రవి వాషింగ్టన్, కృష్ణ మసునూరి, విజయ్ గోపు సహ నిర్మాతలుగా వ్యవహరించారు.

ఉత్సవాలలో మున్సిపల్ కార్మికుల సేవలు భేష్

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ ప్రతినిధులు

నవతెలంగాణ - కరీంనగర్



పుష్పగుచ్ఛం అందిస్తున్న కాంగ్రెస్ ప్రతినిధులు

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కార్మికులు ఎంతో శ్రమపడి వ్యర్థాలు పేరుకుపోకుండా కృషి చేయడం పట్ల 30వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతి గోపి నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పక్షాన మున్సిపల్ కార్మికులు, అన్ని విభాగాల సిబ్బంది సేవలను ప్రశంసిస్తూ సోమవారం నగర మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పేయికి పుష్పగుచ్ఛం అందజేసి, కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి బాబు, యూత్ కాంగ్రెస్ నాయకులు పొన్నం మధు, పలు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పోరండ్ల రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అమెర్, గంగుల దిలీప్, కొలగాని అనిల్, ఆశిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



సన్నవడ్లకు రూ.500 బోనస్

- ఈ ఏడాది నుంచే రైతుకూలీలకు రూ.12వేలు
- అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ
- పంటల బీమా.. రైతు సంక్షేమ కార్యక్రమాల అమలు
- జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ నియామకాలు
- మున్నేరు వరద బాధితులను సంపూర్ణంగా ఆదుకుంటాం :రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

భూమి లేని రైతు కూలీల కుటుంబాలకు ఏడాదికి రూ. 12 వేల ఆర్థిక సహాయం ఈ ఏడాది నుంచే ప్రారంభిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. అర్హులైన రైతులందరికీ రూ. రెండు లక్షల రుణమాఫీ, సన్న వడ్లకి రూ.500 బోనస్, పంటల బీమా పథకం వంటి రైతు సంక్షేమం కార్యక్రమాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు. మున్నేరు వరద బాధితులకు సంపూర్ణ సహాయం అందిస్తామని అన్నారు. ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రపంచంతో పోటీపడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేశామని, జిల్లాలోని 1,15,180 మంది రైతుల రుణ ఖాతాలకు సంబంధించి రూ.766.66 కోట్లకు పైగా రుణమాఫీ చేశామన్నారు. అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతు భరోసా పథకాన్ని అర్హులైన రైతులకు వర్తింపజేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పంటల బీమా పథకాన్ని ఈ ఏడాది నుంచి వర్తింపజేసేలా రైతు చెల్లించాల్సిన ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు.

సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, 2030 నాటికి విద్యుత్ డిమాండ్‌ను అంచనా వేస్తూ ఉత్పత్తి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రామాల్లోని రైతులకు పూర్తిస్థాయిలో సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ క్యాలెండర్ ప్రకటించామని, ప్రభుత్వ నియామకాలు పారదర్శకంగా భర్తీ చేస్తున్నామని తెలిపారు. ప్రయివేటులో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించేలా వారి నైపుణ్యాలు పెంపొందించే దిశగా స్కిల్ యూనివర్సిటీతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 63 ఐటీఐ కేంద్రాలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అప్ గ్రేడ్ చేస్తున్నట్టు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రోత్సహించే దిశగా విద్యా కమిషన్‌ను ప్రభుత్వం నియమించిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, అంగన్ వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మార్చుతున్నామని అన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ విద్యార్థుల కోసం సమీకృత మోడల్ స్కూల్స్ నిర్మించబోతున్నామని తెలిపారు. ప్రస్తుత ఏడాది రూ.120 కోట్లు పైగా ఖర్చు చేసి దాదాపు 50 నుంచి 60 సమీకృత మోడల్ స్కూల్స్ ప్రారంభించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలు నిర్వాహణకు చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ వాడకంపై అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నామని అన్నారు.

మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటులో..
సందేహాలకు సమాధానమేదీ..?

- ఊటలను నిర్లక్ష్యం చేసిన ఇంజనీర్లు
- కొన'సాగు'తున్న పరీక్షలు..
- ఎన్‌డీఎస్‌ఏ తేల్చేనా..?
- సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలో గోదావరిపై 108 కి.మీ నిడివిలో నిర్మించిన మూడు భారీ బ్యారేజీల నిర్మాణంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిన విషయం తెలిసిందే. తక్కువ కాలంలో ప్రాజెక్టును పూర్తి చేయాలని.. కనీస జాగ్రత్తలు పాటించకపోవడం, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంలో శాస్త్రీయ అధ్యయనాలను విస్మరించడంతో పాటు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం, నీటిపారుదల శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనపడుతోంది. కాగా, మేడిగడ్డ బ్యారేజీ (లక్ష్మీ బ్యారేజీ) కుంగిపోవడానికి గల కారణాలపై నేటికీ స్పష్టత రాకపోవడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ గేట్లను తెరిచిపెట్టడంతో భారీ వరద సముద్రం పాలవుతుంది. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు చేస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. మరో 6 నెలలపాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని సమాచారం. ఇదిలా వుంటే మేడిగడ్డ బ్యారేజీ డిజైన్‌లోనే లోపాలున్నాయన్న చర్చ తెరపైకి వచ్చిన విషయం విదితమే.

బ్యారేజీ నిర్మాణంలో లోపాలు..

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలోనే పలు లోపాలున్నట్టు ఎన్‌డీఎస్‌ఏ పరిశీలనలో ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. జియాలజిస్ట్ నివేదిక, సెటిల్‌మెంట్ క్రైటీరియా, సేఫ్ బేరింగ్ కెపాసిటీల ఆధారంగానే బ్యారేజీల డిజైన్‌లను ఖరారు చేస్తారు. బ్యారేజీ నిర్మాణానికి ప్రధానమైన ఈ విషయాల్లో లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజీకి సరైన ౦౦ండిజైనింగ్‌ను ఇవ్వలేకపోయారన్న వాదన వినిపిస్తుంది. అంతేకాదు, సెడిమెంటేషన్ విశ్లేషణ చేయించడంలో, నీటి నిల్వపై సమగ్రంగా అధ్యయనం చేసి అంచనాలు వేయడంలోనూ లోపం ఉన్నట్టు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం సందర్భంలో బ్లాక్ 6, 7, 8ల్లో సెటిల్‌మెంట్ క్రైటీరియా 100 మిల్లీమీటర్ల కంటే అధికంగా వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. 100 మి.మీపైగా వస్తే





పునాదికి అదనపు బలాన్ని (స్టబిలైజేషన్ ఆఫ్ ఫౌండేషన్) ఇవ్వాల్సి ఉంటుంది. ఇది నీటిపారుదల శాఖ అధికారులు గాని, ఎల్ అండ్ టీ కంపెనీ ఇంజనీర్లు గాని చేయలేదు. అందుకే పునాది దెబ్బతిందన్న వాదనలు న్నాయి. సెటిల్‌మెంట్ క్రైటీరియా ఏ ప్రాజెక్టు నిర్మాణంలోనైనా 75-100 మిల్లీమీటర్ల మధ్యనే ఉండాలి. ఇంతకంటే అధికంగా ఉంటే ఆ నిర్మాణానికి ప్రమాదమని నీటిపారుదల శాఖ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే గుత్తేదారులు, అధికారులు మాత్రం సెటిల్‌మెంట్ ఆఫ్ క్రైటీరియా చేశామని చెబుతున్నారు. దాంతో విజిలెన్స్ అధికారులు ఈ నివేదికలను సమర్పించాల్సిందిగా కోరారు. అంతేకాదు, డ్యామ్ గాని, బ్యారేజీ నిర్మాణంలోగాని హార్డ్ రాక్ వచ్చేవరకు లోతుకు వెళ్లాల్సి ఉంటుంది. మేడిగడ్డలో ఇది లోపించినట్టు సమాచారం. ఈ కారణాల రీత్యానే మేడిగడ్డలో ఆకస్మికంగా బ్యారేజీ కుంగిందన్న బలమైన వాదనలు వినిపిస్తున్నాయి.

> కాళేశ్వరం ఎత్తిపోతల పథకం కేంద్రం ఆధీనంలోకి వెళ్లడంతో ఈ బ్యారేజీల గేట్లను మూసివేయాలన్న, తెరవాలన్న కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సంస్థ ఎన్‌డీఎస్‌ఏ ఆదేశాలకు లోబడి చేయాల్సి ౦దే. వారి ఆదేశాల మేరకు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ అన్ని గేట్లను ఎత్తిపెట్టడంతో గోదావరి జలాలు దిగువకు వెళ్తున్నాయి. గేట్లు తెరిచినప్పటి నుంచి నేటి వరకు మేడిగడ్డ నుండి 1,700
>
> **సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలు**
>
> టీఎంసీలు, అన్నారం నుంచి 160 టీఎంసీలు, సుందిళ్ల బ్యారేజీ నుంచి 160 టీఎంసీల గోదావరి జలాలు దిగువకు వెళ్లిపోయాయి. ఈ జలాలు పోలవరం నుంచి సముద్రంలో కలిసిపోయాయి. కాగా, మరమ్మతులు పూర్తి చేసినా, కేంద్రం చెప్పేంత వరకు గేట్లు మూసివేసే పరిస్థితి లేకపోవడంతో రైతుల ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి.

భూగర్భ శాస్త్రవేత్తల నివేదిక ఏదీ..?

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం చేయడానికి ముందు ఈ ప్రాంతంలో భూగర్భ శాస్త్రవేత్తల నుంచి నివేదిక తీసుకోలేదనే వాదన వినిపిస్తుంది. ఏ ప్రాజెక్టుకు సంబంధించిన ఆనకట్ట, బ్యారేజీలను నిర్మించాలన్నా అందుకు ముందుగా భూగర్భ శాస్త్రవేత్తలతో ఆ ప్రతిపాదిత స్థలాన్ని అధ్యయనం చేయించి వారిచ్చే నివేదికను పరిగణనలోకి తీసుకోవాలి. దాని ఆధారంగానే అక్కడ నిర్మించాలా? లేదా? అనేది తేల్చుకుంటారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం విషయంలో అది జరగలేదని విశ్వసనీయంగా తెలిసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో ఈ ప్రాజెక్టులోని లోపాలపై అధ్యయనం చేస్తున్న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) కూడా ఈ నివేదికను అడగకపోవడం గమనార్హం. అదేవిధంగా అవక్షేపణ విశ్లేషణ (సెడిమెంటేషన్ ఎనాలిసిస్) కూడా చేయాల్సి ఉంది. నీటిలో ఇసుక పేరుకుపోయే విధానంతో పాటు ఇసుక కోత ఏ మేరకు ఉందో నిర్ధారించుకోవడానికి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్షను సైతం చేయలేదని సమాచారం. అంతేకాకుండా బ్యారేజీ నిర్మిస్తే బ్యారేజీ వెనుక నిలిచిపోయే నీటి నిలువ ప్రవాహాన్ని (ఇంటిగ్రేటెడ్ బ్యాక్ వాటర్ స్టడీ) సైతం అధ్యయనం చేయకపోవడం ఒక లోపంగా చెబుతున్నారు.

కొన'సాగు'తున్న ఎన్‌డీఎస్‌ఏ పరీక్షలు

మేడిగడ్డ బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ శాస్త్రవేత్తలు నిర్వహిస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. మరో 6 నెలలపాటు ఈ పరీక్షలు కొనసాగుతాయని తెలుస్తుంది. తాజాగా ఇంటిగ్రేటెడ్ బ్యాక్ వాటర్ స్టడీని ఎగువ, దిగువ పరివాహక ప్రాంతాల్లో నిర్వహించినట్టు సమాచారం. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రూ.5 కోట్లను విడుదల చేసి బ్యారేజీ మరమ్మతులు చేయడానికి ఉన్న అవకాశాలతోపాటు 5 పరీక్షలను నిర్వహించి వెంటనే నివేదికను సమర్పించాలని ఆదేశించారు. దాంతో శాస్త్రవేత్తలు ఈ పరీక్షలను ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. జియో ఫిజికల్, అకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫిలర్స్ టెస్ట్ (ఏడీసీపీ)తోపాటు మరికొన్ని పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ఊటలను నిర్లక్ష్యం చేసిన ఇంజనీర్లు

2020లో మేడిగడ్డ బ్యారేజీ ప్రారంభించినప్పటి నుంచి మెయింటెనెన్స్‌లోనూ తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంది. ఫలితంగా 20వ గేటు కుంగిపోయిందని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిన 2020 నుంచి ప్రతియేటా 2021, 22లోనూ 7వ బ్లాకులోని 17, 18, 19, 20 స్తంభాల వద్ద ఊట బహిర్గతమైనా పట్టించుకోకపోవడంతో బ్యారేజీకి 2023లో భారీ ప్రమాదం సంభవించింది. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఈ ఊటలు బహిర్గతమయ్యాయి. అన్నారం బ్యారేజీలో ఊట బహిర్గతమైనప్పుడు కెమికల్ గ్రౌటింగ్ చేసి నివారించారు. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ 7వ బ్లాక్ కుంగిన నేపథ్యంలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు అడ్‌మిక్చర్, సిమెంట్, ఇసుక మిక్చర్‌తో గ్రౌటింగ్ చేశారు. సుమారు 37వేల క్యూబిక్ మీటర్ల మిక్చర్‌ను మరమ్మతులకు వినియోగించారు. పగుళ్లలో సిలికాన్ మైక్రో కాంక్రీట్‌తో మరమ్మతులను పూర్తి చేశారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు 20వ గేటును పూర్తిగా తొలగించారు. దాంతో ఇప్పటికీ ఈ మూడు బ్యారేజీల నుంచి గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి.

బాలికపై లైంగికదాడి

- మేడిపల్లిలో ఘటన.. పరారీలో నిందితుడు

నవతెలంగాణ-బోడుప్పల్

చదువు కోసం బంధువుల ఇంట్లో ఉంటున్న బాలికపై ఓ దుండగుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాచకొండ కమిషనరేట్ మేడిపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. మేడిపల్లి పోలీసులు, బాలిక బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలిక బంధువుల వద్ద ఉంటోంది. అదే ప్రాంతంలో ఉండే కేశవరెడ్డి బాలికను బంధించి లైంగికదాడి చేశాడు. విషయాన్ని బాధితురాలు తన బంధువులకు చెప్పడంతో వారు మేడిపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని, బాలిక స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు.

బై బై గణేశా

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాల్లోని చెరువుల్లోనూ నిమజ్జనం జరిగింది. పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేయగా, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి, సీపీ సివి.ఆనంద్ తదితరులు నిమజ్జనాన్ని పర్యవేక్షించారు.

మధ్యాహ్నామే మహా గణపతి నిమజ్జనం

పదకొండు రోజులపాటు పూజలందుకున్న ఖైరతాబాద్ శ్రీసప్తముఖ మహాశక్తి గణపతి నిమజ్జన పర్వం మధ్యాహ్ననికి పూర్తయింది. గ్రేటర్‌వాసులతో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన అశేష జనవాహిని నడుమ మహాగణపతికి వీడ్కోలు పలికారు. ఉదయం 6.32గంటలకు మండపం నుంచి బయలుదేరిన మహా గణపతి ట్యాంక్‌బండ్.. ఎన్టీఆర్ మార్గ్ మీదుగా క్రేన్ నెం.4 వద్దకు చేరుకోగా.. మధ్యాహ్నం 1.39 గంటలకు గంగమ్మ ఒడికి చేరాడు. దాదాపు 7గంటలపాటు సాగిన శోభాయాత్రలో సందర్శకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల రాకతో హుస్సేన్‌సాగర్ ప్రాంగణం కిక్కిరిసింది. ఏడాదికో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న ఖైరతాబాద్ గణేశ్ ఈ సారి 70 అడుగులు ఎత్తుతో.. విగ్రహానికి కుడివైపున 14 అడుగుల ఎత్తులో శ్రీనివాస కళ్యాణం, ఎడమవైపు శివపార్వతుల కళ్యాణం విగ్రహ మూర్తులతో కనిపించారు. ఈ శోభాయాత్ర సందర్భంగా నిర్వహించిన నృత్యాలు, భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు, డీజే పాటలు అలరించాయి. అనుకున్న సమయాని కంటే 20 నిమిషాలు ముందుగానే మహాగణపతి నిమజ్జనం ముగిసింది. సోమవారం రాత్రి 9గంటలకే మహా హారతి, ఇతర పూజ కార్యక్రమలు ప్రారంభించారు. కమిటీ సభ్యులు చివరిసారిగా పూజ చేసిన అనంతరం గణనాథున్ని వాహనంలో ఎక్కించారు. ఈ శోభా యాత్ర కోసం పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.

మంత్రి పొన్నం, అధికారులతో ఏరియల్ వ్యూ..

గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాన్ని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీజీపీ జితేందర్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ కాట ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా నగరంలో గణేశ్ విగ్రహాల శోభాయాత్ర, హుస్సేన్ సాగర్ వద్ద నిమజ్జనాల తీరును పరిశీలించారు. ఆ తర్వాత చార్మినార్, బాలాపూర్,



గచ్చిబౌలి ప్రాంతాలను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శోభాయాత్ర, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ ఏర్పడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లూ చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది నగరంలోని వివిధ ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో విగ్రహాలను ఏర్పాటు చేశారని, బుధవారం ఉదయం వరకు నిమజ్జనాలు పూర్తవుతాయని ఆశిస్తున్నామని తెలిపారు. నేడు వర్కింగ్ డే కాబట్టి తొందరగా నిమజ్జనం చేసేందుకు మండపాల నిర్వాహకులు ముందుకు రావాలని కోరారు.

> **సీఎం రేవంత్ పర్యవేక్షణ**
>
> గతంలో ఎన్నడూ లేని విధంగా గణేశ్ నిమజ్జనానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. క్రేన్ నెంబర్.4 దగ్గర మహా గణపతి నిమజ్జన ఏర్పాట్లతో పాటు మిగతా సౌకర్యాలను పరిశీలించారు. క్రేన్ల డ్రైవర్లతో పాటు ఇతర సిబ్బందికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చూడాలని, షిఫ్టుల వారీగా పని చేయించుకోవాలని, ఎలాంటి అవాంతరాలూ లేకుండా నిమజ్జనం పూర్తయ్యేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. సీఎం ఆదేశాలతో క్రేన్ ఆపరేటర్స్, హెల్పర్స్ రెస్టు కోసం బస్సులను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. సాగర్, సరూర్‌నగర్ లేక్, ఐడీఎల్ లేక్ వద్ద రెస్టు బస్సులు ఏర్పాటుకు ఆయా జోనల్ కమిషనర్లు చర్యలు తీసుకున్నారు. సీఎం వెంట పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి కాట, నగర సీపీ సీవీ ఆనంద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉన్నారు.

సాయుధ పోరాట సారథులు-వారసులు కమ్యూనిస్టులే

(మొదటిపేజీ తరువాయి)

పేదలంతా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఏకమై పోరాటానికి దిగారని గుర్తుచేశారు. దేవరుప్పుల మండలంలోని కడవెండిలో శాంతియుతంగా పోరాడుతున్న పేదలపై గడీల్లో ఉన్న రజాకర్ గూండాలు ఆకస్మికంగా తుపాకులతో దాడి చేశారన్నారు. దాంతో ఆ పోరాటానికి నాయకత్వం వహిస్తున్న దొడ్డి మల్లయ్య ప్రాణాలు కాపాడటానికి అడ్డు వెళ్లిన ఆయన తమ్ముడు దొడ్డి కొమురయ్య రజాకార్ల తుపాకీ తూటాలకు బలయ్యారని, దాంతో ఆ పోరాటం పతాకస్థాయికి చేరిందని తెలిపారు. ఈ క్రమంలో నైజాం రాచరిక ప్రభుత్వం రద్దు కావాలని, దున్నేవానికి భూమి ఇవ్వాలని, రైతాంగానికి భూమి హక్కులు ఇవ్వాలని, వెట్టిచాకిరీ రద్దు కావాలని, మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనే ప్రధాన డిమాండ్లతో ఈ పోరాటం జరిగిందని వివరించారు. ఫలితంగా తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూమి పంచడంతో పాటు 3 వేల గ్రామాల్లో ప్రజారాజ్యం ఏర్పడిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎలాంటి భాగస్వామ్యం లేని బీజేపీ ఈ పోరాటాన్ని ముస్లీం వ్యతిరేక పోరాటంగా వక్రీకరిస్తుందన్నారు. ఈ పోరాటంలో కీలక పాత్ర పోషించిన షేక్ బందగీ, మగ్దూం, షోయబుల్లాఖాన్ ముస్లిం నేతలేనన్నారు. నిజాంకు తొత్తులైన భూస్వాములు, జాగీర్దార్ల ఆగడాలకు వ్యతిరేకంగా హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా సామాజిక దోపిడీ, పీడనకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని తెలిపారు. ఈ పోరాట స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ప్రజా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, 1946 నుండే తెలంగాణ ప్రాంతంలో రైతాంగ సాయుధ పోరాటం ప్రారంభమై కొనసాగిందన్నారు. నిజాంను గద్దెదించాలని కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ పోరాటం పతాకస్థాయికి చేరిందన్నారు. ఆ ఉద్యమం అలాగే కొనసాగితే గోల్కొండ ఖిల్లాపై ఎర్రజెండా రెపరెపలాడుతుందన్న ఉద్దేశంతో నాటి ప్రధాని నెహ్రూతో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ మంతనాలు జరిపారని తెలిపారు. దాంతో సెప్టెంబర్ 13న భారత సైన్యం తెలంగాణకు వచ్చిందని, 17న నిజాం ఎలాంటి రక్తపాతం లేకుండా కేంద్ర ప్రభుత్వానికి లొంగిపోయాడన్నారు. ఈ క్రమంలో సాయుధ పోరాటం అవసరం లేదని, నెహ్రూకు స్వాగతం పలకాలని పలువురు కమ్యూనిస్టు నేతలు అభిప్రాయ పడగా, పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య తదితరులు కమ్యూనిస్టుల అణచివేతకే సైన్యం వచ్చిందని అభిప్రాయపడ్డారని తెలిపారు. దాంతో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయిందన్నారు. నిజాం లొంగినా భారత సైన్యం ఇక్కడే ఉండి 4 వేల మంది కమ్యూనిస్టులను పొట్టనపెట్టుకున్నారని తెలిపారు. పోరాటం అనంతరం భూ పంపిణీపై నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలో ఎన్నో చట్టాలు తెచ్చినా పంపిణీ మాత్రం జరగలేదన్నారు. నెహ్రూ ఆరు కోట్ల ఎకరాలు పంచుతానని చెప్పి ఆరెకరాలు కూడా పంచలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ సీఎంలుగా ఉన్న ఎన్టీఆర్, వైఎస్ఆర్ ఎన్నో మాటలు చెప్పినా, ఆచరణలో అమలు కాలేదని ఆరోపించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి పదేండ్లలో కేవలం 16 వేల ఎకరాలు మాత్రమే పంచారని తెలిపారు. పేదలకు భూములు పంచాలంటే కొనుగోలు చేసి ఇవ్వడం కాదని, భూస్వాముల నుంచి లాక్కొని పేదలకు పంచాలన్నారు. భూములను కొని పంచడం సాధ్యం కాదని, పోరాడితేనే భూములను సాధించగలుగుతామని స్పష్టంచేశారు. ఈ సభలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, ఎం. చుక్కయ్య జిల్లా కమిటీ సభ్యులు టి. ఉప్పలయ్య రాగుల రమేష్, గొడుగు వెంకట్, డి. తిరుపతి, జి.రాములు, కాడబోయిన లింగయ్య, లచ్చుల్ దీవ, నాయకులు



వాంకుడోతు వీరన్న, మంద సంపత్, డి. భాను నాయక్, సోముల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులు : జూలకంటి రంగారెడ్డి

తెలంగాణ సాయుధ పోరాటాన్ని ఓట్ల కోసం కాంగ్రెస్, బీజేపీ పార్టీలు చరిత్రను వక్రీకరిస్తున్నాయని, సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి స్పష్టంచేశారు. నల్లగొండ జిల్లా వేముపల్లి మండకేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయం నుంచి రావులపెంట వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. రావులపెంటలోని సాయుధ పోరాట అమరవీరుల స్థూపం వద్ద వార చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాయుధ పోరాటంలో అమరులైన పుట్ట మల్లయ్య భార్య లక్ష్మమ్మకు సీనియర్ నాయకులైన చింతకుంట్ల రాములు, గాదే పద్మ, బంగారయ్య లకు శాలువా పూలదండలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా జరిగిన సభలో జూలకంటి మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ విముక్తి కోసం నిజాం నవాబుకు వ్యతిరేకంగా కులమతాలకతీతంగా ప్రాణాలను పణంగా పెట్టి సామాన్యులతో పాటు కమ్యూనిస్టులు వీరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆనాడు బీజేపీ లేదని, చరిత్ర తెలియని బీజేపీ నాయకులు.. ఈ పోరాటాన్ని ముస్లిం, హిందువుల పోరాటంగా చిత్రీకరించి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిజాం నవాబు పాలనలో కీలకంగా ఉన్న నాయకులకు పదవులు ఇచ్చి కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేసేందుకు కుట్రలు చేశారని చెప్పారు. అంతకుముందు సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ యర్రా వెంకన్న 40వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని శ్రీ టౌన్ ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంతంలో 1946 నుండి 1951 వరకు కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రజాసైన్యం ఏర్పడి వీరోచితంగా పోరాటం జరిపిందని చెప్పారు. కామ్రేడ్ యర్రా వెంకన్న తెలంగాణ సాయుధ పోరాటంలో మంచికంటి, చిర్రావూరి నాయకత్వంలో దళాల్లో పనిచేసి జైలుకు వెళ్లి అనేక నిర్బంధాలను ఎదుర్కొని కమ్యూనిస్టు ఉద్యమం కోసం అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. తల్లాడ మండలంలోని కుర్నవల్లిలో ఈలపోలు చిన్న భూషయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామంలో సాయుధ పోరాట యోధుడు ఫకీర్ స్తూపం వద్ద రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ నివాళి అర్పించారు. ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో అమరుల స్తూపాలకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేష్ నివాళి అర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో పార్టీ జెండా ఆవిష్కరించారు. అశ్వారావుపేట మండలం నందిపాడులో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు మడకం పెద్ద ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ ప్రాంత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిన నున్న ముత్తయ్య ఆశయాలకు యువత పనిచేయాలని కోరారు.

పేదలకు భూములు పంచిన ఘనత ఎర్ర జెండాదే: జాన్ వెస్లీ

(మొదటిపేజీ తరువాయి)

దినంగా జరపడం సిగ్గుచేటన్నారు. చరిత్రను వక్రీకరిస్తే ప్రజలే వారికి బుద్ధి చెబుతారని తెలిపారు. సాయుధ పోరాట యోధుల ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పొలంపల్లి గ్రామ శివారులోని కేవల్ కిషన్ సమాధి దగ్గర నిర్వహించిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడారు. తెలంగాణలోని కార్మిక వర్గాన్ని, ప్రజలను ఐక్యం చేసి దొరలపై పోరాడిన చరిత్ర సీపీఐ(ఎం)ది అని అన్నారు.

రాజకీయాలకోసం సెప్టెంబర్ 17కు వక్రీకరణ

౦(మొదటిపేజీ తరువాయి)

లేదంటే ప్రజాపాలన దినోత్సవమంటూ జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌ను దూషిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న రేవంత్ రెడ్డికి చేతనైతే ఇచ్చిన హామీలను అమలు చేయాలని సవాల్ విసిరారు. రైతుబంధు, వద్దులకు రూ.4 వేల ఫించన్, 2 లక్షల ఉద్యోగాల కల్పన తదితర హామీల అమలు మరిచారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల బండ్లకు పెట్రోల్‌కు బిల్లులు కట్టడం లేదనీ, పాఠశాలల్లో చాక్‌పీస్‌లు లేని పరిస్థితి, మాజీ సర్పంచ్‌లకు బిల్లుల కోసం బాధలతో రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహం పెడదామన్న చోట రాహుల్ గాంధీ తండ్రి విగ్రహం పెట్టారనీ, ఢిల్లీ మెప్పు కోసం రేవంత్ రెడ్డి ఇలా చేశారని దుయ్యబట్టారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఏమి తెలియదనీ, ఆ విషయం కూడా ముఖ్యమంత్రికి తెలియదని ఎద్దేవా చేశారు. చార్లెస్ బాబ్బెజ్ కనిపెట్టిన కంప్యూటర్‌ను రాజీవ్ గాంధీ కనిపెట్టారని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆ కంప్యూటర్‌ను 1955లో భారత దేశానికి టాటా గ్రూప్ పరిచయం చేసిందే తప్ప రాజీవ్‌గాంధీ కాదని స్పష్టం చేశారు. పారిశుధ్యాన్ని నిర్లక్ష్యం చేయడంతో చికెన్ గున్యాలు, విష జ్వరాలు,, డెంగ్యూలతో ప్రజలు బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆరోగ్య అత్యవసర పరిస్థితి నెలకొన్నదని తెలిపారు. గురుకులాల్లో పిల్లల మీద ఆఘాయిత్యాలు జరుగుతున్నాయనీ, గురుకుల టీచర్లను తొలగిస్తున్నారని విమర్శించారు. డైవర్షన్ రాజకీయాలు ఆపి పాలనపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు వెంట పడతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తా మని తెలిపారు. ఇష్టముంటే రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ విగ్రహాన్ని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో పెట్టుకోవాలని సూచించారు.


తెలంగాణ తల్లికి పాలాభిషేకం చయకుండా అడ్డుకున్న తమ విద్యార్థి నేతలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మొలకలు తింటున్నారా..?

మొలకల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా మీ డైట్‌లో యాడ్ చేస్తే కేలరీస్ తక్కువగా తీసుకుంటారు. ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీంతో జీర్ణశక్తి సరిగ్గా జరుగుతుంది. అయితే, వీటిని ఎప్పుడు తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదో తెలుసుకోండి.

ఏ టైమ్‌లో తీసుకుంటే మంచిది..

వీటిని బ్రేక్‌ఫాస్ట్ నుంచి మధ్యాహ్నం టైమ్‌లో తీసుకోవడం మంచిది. ఎందుకంటే, వీటిని తినడం వల్ల బాడీకి ఎనర్జీ అందుతుంది. రోజంతా మీ పనులని మీరు హ్యాపీగా చేసుకోవచ్చు. నీరసం ఉండదు.



రాత్రుళ్ళు తింటే..

కొంతమంది మొలకల్ని రాత్రుళ్ళు డిన్నర్ టైమ్‌లో తీసుకోవాలనుకుంటారు. కానీ, ఇది అస్సలు మంచిది కాదు. దీని వల్ల జీర్ణ సమస్యలొస్తాయి. కడుపు ఉబ్బరం, గ్యాస్ పట్టేసినట్లుగా ఉంటుంది. దీంతో మీ నిద్ర డిస్టర్బ్ అవుతుంది. సాధారణంగా మొలకల్లో రిచ్ న్యూట్రియెంట్స్ ఉంటాయి. వీటిని తినడం వల్ల రోజంతా ఎనర్జీగా ఉంటారు. అదే రాత్రుళ్ళు నిద్రపట్టదు. నిద్ర సరిగా లేకపోతే జీర్ణ వ్యవస్థ సరిగా పనిచేయదు. నిజానికీ మొలకలు తిన్నప్పుడు గ్యాస్ సమస్య ఉన్నప్పటికీ.. అది మీరు మోతాదులో తిన్నప్పుడు ఎప్పుడు మరీ అంతలా ఇబ్బంది పెట్టదు. అదే విధంగా.. ఉదయాన్నే తినప్పుడు ఎనర్జీగా ఉంటారు. పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వీటితో పాటు కాల్షియం, పొటాషియం, ఫోలేట్, మెగ్నీషియంలు ఉంటాయి. కాబట్టి, బ్రేక్‌ఫాస్ట్‌లో యాడ్ చేస్తే మీరు ఎనర్జీగా ఉంటారు.

బాలింతలకు నారీ కేర్





మొదటి సారి తల్లి అయినపుడు ఆమె ఆనందానికి అవధులుండవు. అప్పటి వరకు తను పడ్డ బాధ మొత్తం క్షణంలో మాయమైపోతుంది. ఇదే సమయంలో కొన్ని సవాళ్లు కూడా ఉంటాయి. బిడ్డకు పాలు పట్టే దగ్గర నుండి ఇది మొదలవుతుంది. అలాంటి సమస్యే ఎదుర్కొంది గాయత్రి కనుమూరి. బిడ్డకు పాలివ్వడంలో సరైన అవగాహన లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. తనలా మరే తల్లీ బాధ పడకూడదని నారీ కేర్ ప్రారంభించింది. ఇంతకీ ఆమెకు ఎదురైన సమస్యలేంటీ? నారీ కేర్ ఎలా తల్లులకు సహాయం చేస్తుందో తెలుసుకుందాం...

వైజాగ్‌కు చెందిన గాయత్రికి 2020లో బిడ్డను ప్రసవించిన తర్వాత ఆసుపత్రిలో అంతా బాగానే ఉంది. ఇంటికి వచ్చిన తర్వాత బిడ్డకు పాలివ్వడం సవాలుగా మారింది. పాలిచ్చేటపుడు కొన్నిసార్లు బాధాకరంగా ఉండేది. అప్పుడప్పుడు రక్తస్రావం కూడా అయ్యేది. ఒక సారి పాలిచ్చిన తర్వాత తిరిగి 20 నుండి 40 నిమిషాల వరకు ఆమెకు చిరాగ్గా ఉండేది. బిడ్డ ఏడుస్తున్నా పాలివ్వడం చాలా కష్టంగా అనిపించేది. 'ఆ సమయంలో నా బిడ్డ ఆకలితో అలమటిస్తున్నట్లు అనిపించేది. అంటే నా దగ్గర తగినంత పాల ఉత్పత్తి లేదు. అది మన ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. ఇలాంటి సమస్యలతో మొదటి సారి తల్లి అయిన వారు విపరీతమైన ఒత్తిడిలో ఉంటున్నారు' అంటూ ఆమె మనతో పంచుకుంటున్నారు. ఇలాంటి సమస్యలు ఎంతో మంది అనుభవిస్తున్నారు. భారతదేశంలో పాలిచ్చే తల్లులకు సరైన సపోర్ట్ సిస్టమ్ లేదనే ఉద్దేశంతో గాయత్రి నారీ కేర్‌ను ప్రారంభించారు.

నారీ కేర్‌కు పునాది

లాస్ ఏంజెల్స్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్న గాయత్రి బిడ్డ పుట్టిన తర్వాత భారతదేశానికి తిరిగి వచ్చారు. ఓ తల్లిగా తాను అనుభవించిన ఇబ్బంది ఇతరుల్లో ఎలా ఉందో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. తన అనుభవాల నుండి ఇతరులకు మార్గనిర్దేశం చేయడం ప్రారంభించారు. 'అయితే కేవలం నా చుట్టూ ఉన్న మహిళలకు మాత్రమే సహాయం చేస్తే సరిపోదని కొద్దికాలంలోనే గ్రహించాను. ఎక్కువ మంది మహిళలకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను' అని ఆమె జతచేస్తున్నారు. ఈ ఆలోచనే నారీ కేర్‌కు పునాది రాయిగా నిలిచింది. 2022లో దీన్ని ప్రారంభించారు. వైజాగ్ ఆధారిత ఈ స్టార్టప్ సర్టిఫైడ్ ల్యాక్టేషన్ కన్సల్టెంట్‌లతో తల్లులకు అవగాహన కల్పిస్తుంది. 'నా ప్రసవానంతర కాలంలో నేను ఎదుర్కొన్న సమస్యలు ఇతర తల్లులు ఎదుర్కోకూడదని వీలైనంత ఎక్కువ మంది తల్లులకు సహాయం చేయాలనుకుంటున్నాను' అని ఆమె అంటున్నారు.

తల్లిపాలకు సవాళ్లు

ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం మొదటి ఆరు నెలలు శిశువుకు తల్లిపాలే ఇవ్వాలి. ఆ తర్వాత ఇతర పోషక ఆహారంతో పాటు బిడ్డకు రెండు మూడేండ్లు నిండేవరకు తల్లిపాలను కొనసాగించాలి. చాలా మంది తల్లులు ఎంతో సహజంగా పాలిస్తారు. అయితే చాలా మంది తల్లులు పాలు తక్కువ ఉండడం లేదా లాచింగ్ వంటి సమస్యలు ఎదుర్కొంటారు. చనుబాలివ్వడంలో కూడా నిపుణులు శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్నేషనల్ బోర్డ్ సర్టిఫైడ్ లాక్టేషన్ కన్సల్టెంట్ ప్రకారం భారతదేశంలో 204 మంది నిపుణులు ఉన్నారు. చాలా మందికి తల్లిపాల సమస్యలకు నిపుణులు ఉన్నారనే విషయమే తెలియదు. గాయత్రి కూడా మొదట్లో తన సమస్యను పరిష్కరించుకునేందుకు ఓ శిశువైద్యుడిని కలిశారు. అతను ప్రత్యామ్నాయంగా కొన్ని సూచనలు చేశారు. అయితే తల్లి పాలలో ఉండే పోషకాలు అందులో ఉండవు. డాక్టర్ సూచన కాస్త ఊరటనిచ్చినా గాయత్రి బిడ్డకు తనపాలే పట్టాలనుకున్నారు. దానికోసం ఓ కన్సల్టెంట్‌తో అపాయింట్‌మెంట్ బుక్ చేసుకున్నారు. తన పాల ఉత్పత్తిని ఎలా అంచనా వేయాలో, బిడ్డను ఎలా పాలు పట్టాలో, బిడ్డ ఆకలి సమస్యలను ఎలా నిర్వహించాలో తెలుసుకున్నారు.

తల్లిపాలను అందించడం

కొత్తగా ఈ ప్రోగ్రామ్‌లో చేరిన తేజశ్రీ మాట్లాడుతూ 'బిడ్డను చూసుకోవడంలో నాకు మద్దతు లేదు, ఎవరితో మాట్లాడాలో తెలియదు. పాలు సరిగా రావడం లేదని బిడ్డకు పోతపాలు పట్టాను. అయితే రెండవసారి గర్భవతి అయినప్పుడు సహాయం కోసం వెతుకుతున్నాను. అప్పుడే నారీ కేర్ గురించి తెలుసుకున్నాను. ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది. ఆమె నాపై నాకు నమ్మకం కలిగించారు. నా శరీరాన్ని విశ్వసించడం నేర్పించారు' అన్నారు. తేజశ్రీకి తల్లిపాలు పట్టించే పద్ధతులు, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ మద్దతు గురించి వారు నేర్పించారు.

సపోర్టివ్ కమ్యూనిటీ

నారీ కేర్ ఓ నెల ప్రణాళికను మహిళలకు అందిస్తుంది. ఇక్కడ తల్లులు చనుబాలివ్వడం కన్సల్టెంట్‌తో ఒకరితో ఒకరు సంప్రదింపులు, రెండు గంటల బ్రెస్ట్ ఫీడింగ్ కోర్సుతో పాటు వాట్సాప్ బ్రెస్ట్ ఫీడింగ్ సపోర్ట్ గ్రూప్ ద్వారా ఒక నెల టెక్స్ట్ సపోర్ట్ పొందుతారు. ఇది వారు ఒకరి అనుభవాల నుండి మరొకరు నేర్చుకోగలిగే సపోర్టివ్ కమ్యూనిటీని ఏర్పరుచుకుంటూ నిపుణులను నేరుగా ప్రశ్నలు అడగడానికి వీలు కల్పిస్తుంది. నారీ కేర్ ప్రస్తుతం దేశంలో ఐదు కన్సల్టెంట్లను నిర్వహిస్తోంది. ఇందులో మూడు, ఆరు నెలల ప్లాన్‌లు కూడా ఉన్నాయి. వీటి ధర వరుసగా రూ.4,500 నుండి రూ.10,000. ఆరు నెలల ప్లాన్‌లో వన్-టు-వన్ ఫాలో-అప్ టెక్స్ట్‌తో పాటు పోషకాహార నిపుణులతో కాల్ సపోర్ట్, బిడ్డకు ఘనపదార్థాలను పరిచయం చేయడంపై వర్క్‌షాప్ కూడా ఉంటుంది. అదనపు ఫాలో-అప్‌లు, న్యూట్రిషన్ సపోర్ట్, ప్రసవానంతర యోగా తరగతులు, పిల్లల పోషకాహారం, నిద్ర, ప్రసవానంతర మానసిక ఆరోగ్యం వంటి అదనపు ప్రయోజనాలు ఉంటాయి. అదే సేవలను కలిగి ఉన్న మరో మూడు విస్తృతమైన ప్రోగ్రామ్‌లను స్టార్టప్ అందిస్తుంది.

భవిష్యత్‌లో...

ఇప్పటి వరకు నారీ కేర్ భారతదేశం అంతటా సుమారు 400 మంది మహిళలకు చేరువైంది. స్టార్టప్ తన క్లయింట్‌లకు పంపులు, స్టెరిలైజర్‌ల వంటి బ్రెస్ట్ ఫీడింగ్ ఉత్పత్తులను అందించడానికి స్పెక్ట్రా, మెడెలా, డాక్టర్ బ్రౌన్స్, కొమోటోమో వంటి బ్రాండ్‌లతో భాగస్వామ్యం కలిగి ఉంది. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తల్లిపాల గురించి అవగాహన కల్పిస్తుంది. 'తల్లిపాలు పట్టడం మొదటి కొన్ని వారాలు చాలా కష్టం. కాలక్రమేణా తల్లులకు ఇది ఇతర సమస్యలను తెచ్చిపెడుతుంది. అందుకే భవిష్యత్తులో తల్లిపాలు మాత్రమే కాకుండా ఇతర అంశాలపై మా అవగాహన కార్యక్రమాలు పెంచాలని పరిశీలిస్తున్నాం. అయితే ప్రస్తుతం పాలివ్వడంలో సమస్యలను ఎదుర్కొంటున్న తల్లులకు సహాయం చేయడమే మా లక్ష్యం' అంటూ గాయత్రి తన మాటలు ముగించారు.



బాలాపూర్ లడ్డూ రూ.30 లక్షలు

- వేలంలో కొలను శంకర్‌రెడ్డి సొంతం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ గణేశ్ లడ్డూ మరోసారి రికార్డు ధర పలికింది. మంగళవారం ఉదయం బాలాపూర్‌లో లడ్డూ వేలం నిర్వహించగా.. రూ.30 లక్షల వెయ్యి రూపాయలకు బీజేపీ నేత కొలను శంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. గతేడాదికన్నా మూడు లక్షలు ఎక్కువ పలికింది. కిందటేడాది దాసరి దయానంద్‌రెడ్డి రూ.27 లక్షలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కొలను శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. లడ్డూను వేలంలో దక్కించుకోవడం సంతోషంగా ఉందన్నారు. లడ్డూను ప్రధాని నరేంద్ర మోడీకి.. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ద్వారా అందజేస్తానని తెలిపారు. ఈ వేలం పాటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జెడ్పీ చైర్మెన్ తీగల అనిత హరినాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ పోలీసే బందోబస్తు మధ్య శోభాయాత్ర

వేలంపాట అనంతరం బాలాపూర్ గణేష్ నిమజ్జన శోభాయాత్ర భారీ పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా హుసేన్ సాగర్ వరకు కొనసాగింది. నిమజ్జనం సందర్భంగా బాలాపూర్‌లో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకామేశ్వరి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన బాలాపూర్ గణనాథుడు తన నియోజకవర్గంలో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు.

రికార్డు ధర రూ.1.87 కోట్లు పలికిన లడ్డు

- బండ్లగూడ కీర్తి రీచ్‌మండ్ విల్లాస్‌లో వేలం
- లడ్డు దక్కించుకున్న ఆర్వీ దియా చారిటబుల్ ట్రస్టు
- వేలం డబ్బును సేవా కార్యక్రమాలు వినియోగం

నవతెలంగాణ-గండిపేట్

తెలుగు రాష్ట్రాల్లో కానీ విని ఎరగని రీతిలో రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కీర్తి రిచ్ మాండ్ విల్లాస్‌లో నిర్వహించిన వినాయక లడ్డు వేలంలో లడ్డు రూ.1.87 కోట్లు ధర పలికింది. సోమవారం నిర్వహించిన లడ్డూ వేలంలో రికార్డు స్థాయిలో లడ్డూ ధర పలికింది. గత ఏడాది ఇక్కడే లడ్డు 1.20 కోట్లు పలుకగా.. ఈ సారి మరింత పెరిగి రికార్డు సృష్టించింది. వినాయక చవితి సందర్భంగా కీర్తి రిచ్ మాండ్ విల్లాస్‌లోని ఆర్వీ దియా చారిటబుల్ ట్రస్టు ద్వారా విల్లాస్‌లో ఉండే వారి నుంచి డబ్బులు సేకరిస్తారు. ఆ డబ్బుతో లడ్డూ వేలం పాటను పాడతారు. ట్రస్టు ఈ ఏడాది రూ.1.87 కోట్లు సేకరించింది. ఆ మొత్తాన్ని లడ్డు వేలానికి ఉపయోగించింది. అయితే ఆ డబ్బులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తారు. ట్రస్టు నిర్వాహకులు ఆకులు పూర్ణిమ దేశ్‌పాండే మాట్లాడుతూ.. కీర్తి రీచ్ మండ్ విల్లాలో దాదాపు 25 గ్రూపులు ఉన్నట్టు తెలిపారు. వారు పెద్ద పెద్ద వ్యాపారస్తులని, వారి నుంచి సేకరించిన విరాళాలను లడ్డు వేలానికి వినియోగించినట్టు తెలిపారు. సేకరించిన ప్రతి రూపాయినీ తిరిగి అనాథశ్రమం, పేదలకు, సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తామని తెలిపారు.

జమ్మూకాశ్మీర్‌లో నేడు తొలి దశ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

విస్తృత స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేసినట్లు కాశ్మీర్ జోన్ ఐజీపీ వికె బిర్ది తెలిపారు. సెంట్రల్ ఆర్మ్‌డ్ పారామిలిటరీ ఫోర్స్ (సీఏపీఎఫ్), జమ్ముకాశ్మీర్ ఆర్మ్‌డ్ పోలీస్, జమ్ముకాశ్మీర్ పోలీస్ సిబ్బందితో బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు. సీపీఐ(ఎం) నాయకులు మహమ్మూద్ యూసఫ్ తరిగామి పోటీ చేస్తున్న కుల్గాం నియోజకవర్గానికి తొలిదశలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ నుంచి వరసగా ఐదో విజయంపై తరిగామి దృష్టి పెట్టారు. కుల్గాంతో పాటు పాంపోర్, త్రాల్, పుల్వామా, రాజ్‌పోరా, జైనాపోరా, షోపియాన్, డిహెచ్ పోరా, దేవ్‌సర్, దూరు, కోకెర్‌నాగ్ (ఎస్‌టి), అనంతనాగ్ వెస్ట్, అనంతనాగ్, శ్రీగుఫ్వారా-బిజ్‌బెహరా, షాంగస్-అనంతనాగ్ ఈస్ట్, పహల్గాం, ఇందర్వాల్, కిష్త్వార్ భదర్వా, దోడా, దోడా వెస్ట్, రాంబన్, బనిహాల్ నియోజకవర్గాల్లో బుధవారం పోలింగ్ జరగనుంది.

ఫాం హౌజ్ ముఖ్యమంత్రిని కాదు..ప్రజల సీఎంను

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడారు. "ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని.. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు.. నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని నిజాం రాచరికానికి వ్యతిరేకంగా నినదించిన దాశరథి గీతంతో తన ప్రసంగాన్ని సీఎం ప్రారంభించారు. "తెలంగాణ బానిస సంకెళ్లు తెంచిన చారిత్రాత్మక ఘట్టం 1948 సెప్టెంబర్ 17న ఇదే హైదరాబాద్ గడ్డపై ఆవిష్కృతమైంది. తెలంగాణ అంటే త్యాగం... ఆ త్యాగాలకు ఆద్యుడు దొడ్డి కొమురయ్య. నాటి సాయుధ పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. ఆ నాటి అమరులకు ఈ సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నా. ఈ శుభదినాన్ని ఎలా నిర్వచించుకోవాలన్న విషయంలో ఇప్పటి వరకు భిన్నాభిప్రాయాలున్నాయి. కొందరు విలీనమనీ, మరికొందరు విమోచనమని సంబోధిస్తున్నారు. మేం అధికారం చేపట్టిన తర్వాత సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం. ప్రజా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష. వారి ఆలోచన, సమైక్యతను దెబ్బతీసేలా వివాదాస్పదం చేయడం సరికాదు" అని సీఎం హితవు పలికారు. సెప్టెంబర్ 17 స్ఫూర్తితో పదేండ్ల నియంత పాలన నుంచి తెలంగాణను విముక్తి చేశామని రేవంత్ అన్నారు. గత సర్కార్ చేసిన రూ. ఏడు లక్షల కోట్ల అప్పుకు ప్రతి నెలా రూ. 6,500 కోట్ల మేర అసలు, వడ్డీ కలిపి బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితుల్లో బాధ్యతలు స్వీకరించామని చెప్పారు. అప్పుల కుప్పగా ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తూ, ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులెదురైనా ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీని ఏకకాలంలో చేశామని చెప్పారు. అక్కడక్కడా కొన్ని ఇబ్బందులున్నా వాటన్నింటిని అధిగమించి అందరికి రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. "అధికారం చేపట్టిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించాం. ఇప్పటి వరకు 87 కోట్ల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ. ఐదు లక్షల నుంచి రూ. పది లక్షలకు పెంచాం. రాష్ట్రంలోని 43 లక్షల కుటుంబాలకు రూ. 500 వంట గ్యాస్ అందిస్తున్నాం. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న 49 లక్షల కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీని కోసం ఇప్పటి వరకు రూ.965 కోట్ల మేర సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది 4,50,000 గృహాలను నిర్మించబోతున్నాం. నేతన్నల కోసం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ ప్రారంభించాం. దీనికి తెలంగాణ ఉద్యమ దిక్సూచి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాం" అని సీఎం తొమ్మిది నెలల తమ పాలనలో చేసిన వృద్ధిని వివరించారు.. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు, పన్నుల వాటాల గురించి పలు మార్లు ఢిల్లీకి వెళ్లి ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిశామని చెప్పారు. ఈ పర్యటనను కూడా కొంతమంది రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిల విషయంలో ఎన్ని సార్లైనా ఢిల్లీకి వెళ్తానని స్పష్టం చేశారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 50 శాతం వాటా ఇవ్వాలని సీఎం డిమాండ్ చేశాం. ఇటీవల 16వ ఆర్థిక సంఘం ముందు కూడా గట్టిగా వాదనలు వినిపించామని గుర్తు చేశారు. "రాష్ట్రాన్ని ప్రపంచ వేదికపై ఫ్యూచర్ స్టేట్ గా బ్రాండ్ చేస్తున్నాం. బేగరి కంచె వద్ద ఫోర్త్ సిటీకి శంకుస్థాపన చేశాం. మూసీ సుందరీకరణతో హైదరాబాద్ రూపు రేఖలు మారనున్నాయి. మాదక ద్రవ్యాల నియంత్రణ, నిర్మూలన విషయంలో కఠినంగా ఉంటున్నాం. టీ - న్యాబ్ ను బలోపేతం చేశాం. క్రీడలను ప్రోత్సహిస్తున్నాం. ఈ క్రమంలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి శ్రీకార చుట్టాం. యువతలో నైపుణ్యాలను పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం" అని సీఎం వెల్లడించారు. విద్యా వ్యవస్థలో సమూలాల మార్పులు తెచ్చేందుకు తెలంగాణ విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మూడు నెలల్లో 30 వేల ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వడంతో పాటు గ్రూప్ 1 ప్రాథమిక పరీక్షలు ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామని అన్నారు. వచ్చే ఐదేండ్లలో 63 లక్షల మంది మహిళలకు రూ. లక్ష కోట్ల రుణాలు ఇవ్వాలని సంకల్పించామని తెలిపారు. విదేశాల్లో మరణించిన గల్ఫ్ కార్మికుల కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారంతో పాటు. వారి సమస్యల పరిష్కారానికి ప్రజాభవన్‌లో "ప్రవాసీ ప్రజావాణి కేంద్రం" ఏర్పాటు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

సాంస్కృతిక పునరుజ్జీవనానికి శ్రీకారం

"పదేండ్లలో విధ్వంసమైన తెలంగాణను సాంస్కృతికంగా, ఆర్థికంగా పునరుజ్జీవం చేయాల్సిన అవసరాన్ని గుర్తించాం. అధికారంలోకి రాగానే అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించి అందుకు శ్రీకారం చుట్టాం. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జరపబోతున్నాం. సాంస్కృతిక సారథి గద్దర్ పేరుతో సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పేరు పెట్టాం. ఇలా ప్రతి ఆలోచనలో తెలంగాణ సాంస్కృతిక పూర్వ వైభవం దిశగా సాగుతున్నాం" అని సీఎం పేర్కొన్నారు. "తెలంగాణ ప్రజలే రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ, వారి ఆకాంక్షలే మా కార్యచరణ" అంటూ సీఎం తన ప్రసంగాన్ని ముగించారు.

ఎన్ని అడ్డంకులెదురైనా హైడ్రా ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

తాండవం మనం చూశాం. ఆ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు. హైడ్రా వెనుక రాజకీయ కోణం లేదు. స్వార్థం అంతకన్నా లేదు. పేదలను ముందు పెట్టి హైడ్రా లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నంలో భూ మాఫియా ఉంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా హైడ్రా ఆగదు" అని సీఎం స్పష్టం చేశారు.

ఎర్రజెండా రాజ్యం వస్తేనే బతుకుల్లో మార్పు

(మొదటిపేజీ తరువాయి)

చిత్రపటానికి ఎంపీ అమ్రారాం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపీ అమ్రారాం మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాట పురిటి గడ్డను చూసి తన హృదయం పులకించిపోయిందని అన్నారు. రైతాంగ పోరాటాల గడ్డ రాజస్థాన్ సికార్‌లో బీజేపీని ఓడించి ఎంపీగా గెలిచి ఇక్కడికి వచ్చిన తనకు సంతోషంగా ఉందని, ఇలాంటి మంచి కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు పార్టీ శ్రేణులకు విప్లవ అభినందనలు తెలియజేశారు. ప్రపంచ చరిత్ర పుటల్లో సువర్ణ అక్షరాలతో వీర తెలంగాణ సాయుధ పోరాటం లిఖించబడిందని కొనియాడారు. సీపీఐ(ఎం) నిర్వహిస్తున్న పోరాటాల వైపు రాష్ట్రం ఎదురుచూస్తుందన్నారు. రైతులు తలచుకున్నారు కాబట్టే నల్ల చట్టాలు బయటపడేయగలిగారని, ఇవే విధానాలను మళ్లీ కొనసాగిస్తే.. నరేంద్ర మోడీని సైతం రైతులు విసిరి వేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఎర్రజెండా రాజ్యం వస్తేనే దేశంలో ప్రజల బతుకులు మారుతాయని స్పష్టంచేశారు. ఎర్రజెండా రాజ్యస్థాపన కోసం వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటు : ఎండీ అబ్బాస్

కిషన్ రెడ్డి, బండి సంజయ్.. వంటి బీజేపీ నాయకులు వీర తెలంగాణ సాయుధ పోరాటాన్ని వక్రీకరించడం సిగ్గుచేటని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రజాకారులు, కమ్యూనిస్టులు ఒకటేనని మాట్లాడటం.. వారికి చరిత్ర పట్ల, రాజకీయాల పట్ల ఉన్న అవగాహనా లేమికి నిదర్శనమన్నారు. వాస్తవ చరిత్ర తెలుసుకోవాలని, రజకారులు, భూస్వాములను తరిమికొట్టింది, రక్త తర్పణ చేసింది కమ్యూనిస్టు యోధులేనని గుర్తు చేశారు. నిజం నిప్పులాంటిదని, చరిత్రను వక్రీకరించే మతోన్మాదులకు ప్రజా క్షేత్రంలో ఎప్పటికైనా ప్రజలు గుణపాఠం చెప్పకతప్పదని హెచ్చరించారు. తెలంగాణ విమోచన దినోత్సవం కాదని తెలంగాణ విలీన దినోత్సవమని తెలిపారు. తెలంగాణకు విమోచన, విముక్తి జరగలేదని, విముక్తి కోసం పోరాటం కొనసాగుతున్నదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గంగసాని రఘుపాల్, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. శోభన్ నాయక్, సీఐటీయూ నాయకులు పుప్పాల శ్రీకాంత్, యాటల సోమన్న, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, బోట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మండల కార్యదర్శి జి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో రామ రామ..

(మొదటిపేజీ తరువాయి)

చేసి కామాంధులను శిక్షించాలని కాళ్లా వేళ్లాపడినా పోలీసులు లైట్ తీసుకున్నారు.ఈ దారుణంపై యూపీలో రాజకీయం వేడెక్కింది. పోలీసులపై చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీలు, మహిళా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అసలేం జరిగింది..?

అయోధ్య జిల్లాలోని సహదత్‌గంజ్‌కు చెందిన వంశ్ చౌదరి తనను "పర్యాటక" ప్రదేశాలను చూపిస్తానంటూ..తీసుకెళ్లాడని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది."ఆగస్టు 16న నన్ను గెస్ట్ హౌస్‌కి తీసుకెళ్లి అక్కడే నిర్బంధించాడు. అతను, తన మరో ఇద్దరు స్నేహితులతో కలిసి తనపై సామూహిక లైంగికదాడి చేశాడని,, ఆపై తన స్నేహితులైన వినయ్ కుమార్, మహ్మద్ షరీక్‌లను పిలిపించి మరీ అఘాయిత్యం చేశారని వివరించింది. అయోధ్య పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం బీఏ విద్యార్థినిగా చదవుతూ.. ఆమె రామజన్మభూమి ఆలయంలో క్లీనింగ్ సిబ్బందిగా కూడా పనిచేస్తున్నారు. "మా కుటుంబ సభ్యులందరినీ చంపుతామని బెదిరించటంతో.. భయపడి, నేను పోలీసుల వద్దకు వెళ్లలేదు. అయితే ఆగస్టు 25న నేను గుడికి వెళ్తుండగా వంశ్ మళ్లీ నన్ను అపహరించాడు. అతనితో పాటు ఉదిత్ కుమార్, సత్రం చౌదరి, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నారు. వారు కారులో నాపై లైంగికదాడికి యత్నించారు.కానీ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. వారి బారి నుండి పారిపోవడానికి నాకు సమయం దొరికింది, "అని గురువారం ఫిర్యాదులో ఆమె పేర్కొన్నట్లు పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. బాలిక నేరం జరిగిన ప్రదేశాలుగా గుర్తించిన ప్రాంతాలు టెంపుల్ టౌన్‌లోని హైసెక్యూరిటీ జోన్ కిందకి వస్తాయి. అలాంటి అయోధ్యలో రామమందిరం శుభ్రపరిచే సిబ్బంది పలుమార్లు సామూహిక లైంగికదాడికి పాల్పడుతున్నా..పోలీసుల నిఘా నేత్రాలు ఏమయ్యాయి.? దోషుల వెనుక ఎవరు ఉన్నారు..? అన్నదానిపై దుమారం రేగుతోంది.పోలీసులు బాధితురాలికి న్యాయం చేయాల్సింది పోయి ఆమెనే బెదిరించారని, కనుక ఆ పోలీసులను సస్పెండ్ చేయాలని లక్నో లోని ఊర్మిళ వర్మ అనే మహిళా నాయకురాలు డిమాండ్ చేశారు. ఇలాంటి చాలా సంఘటనల్లో ఫిర్యాదు చేయడమే కష్టంగా మారుతోందని దీనితో నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారని సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఈ కేసు విషయంలో బాధితురాలికి న్యాయం చేయాలనీ, నేరస్థులపై, ఫిర్యాదు నమోదు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రేవంత్‌రెడ్డి సూపర్

- సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు : రాజాసింగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణేశ్ నిమజ్జనం కోసం ప్రభుత్వం చేసిన ఏర్పాట్లపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సూపర్ అంటూ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో వినాయక నిమజ్జన శోభాయాత్రలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి ప్రభుత్వ వ్యవస్థలన్నీ చాలా బాగా పనిచేశాయని కొనియాడారు. పోలీసు వ్యవస్థ పనితీరు బాగుందని ప్రశంసించారు. ఉత్సవాల ఏర్పాట్ల నుంచి నిమజ్జనం వరకు అన్నింటినీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని విధంగా ఈసారి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డినే ఖైరతాబాద్ బడా గణేశ్‌ని దర్శించుకోవడం, నిమజ్జన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించడం సంతోషంగా ఉందన్నారు. ఎండ కారణంగా నిమజ్జనాలు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయని చెప్పారు.

100 రోజుల్లో ఎన్నో విజయాలు సాధించాం

- ప్రధాని మోడీ

భువనేశ్వర్ : ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ 100 రోజుల పాలనలో ఎన్నో విజయాలు సాధించామని ప్రధాని మోడీ మంగళవారం పేర్కొన్నారు. మొదటి 100 రోజుల్లోనే పేదలు, రైతులు, యువత, మహిళల కోసం ఎన్నో ముఖ్యమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఒడిశా ప్రభుత్వం మహిళల కోసం రూపొందించిన సుభద్ర యోజన పథకాన్ని మోడీ ప్రారంభించారు. ఈ పథకం లబ్దిదారులతో భువనేశ్వర్‌లో నిర్వహించిన కార్యాక్రమంలో మోడీ పాల్గొన్నారు.

రుణం తీర్చుకుంటా..

వేములవాడ నియోజకవర్గంలో నిరంతర సేవకునిగా.. ప్రజాబంధువుగా ఉంటా

- ఏ ఆపద వచ్చినా.. అర్ధరాత్రి నా తలుపుతట్టవచ్చు..
- దక్షిణకాశీ వేములవాడను అభివృద్ధియే నా ముందున్న లక్ష్యం
- ఆలయ విస్తరణ సహా అనేకాభివృద్ధి పనులకు ప్రణాళికలు
- ప్రతి పేదింట ఆర్థిక స్వావలంబనకు కృషి
- 'నవతెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

'వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.. ఈయన పట్టువదలని విక్రమార్కుడు' అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. వెలమల కంచుకోగా ఉన్న వేములవాడ అసెంబ్లీకి 2009 నుంచి 15ఏండ్లు నిర్విరామ పోరాటం చేసి ఎట్టకేలకు విజయాన్ని సొంతం చేసుకున్న బీసీ నేతగా ఎదిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో తలపడిన ప్రతిసారీ స్వల్పఓట్ల తేడాతో గెలుపు అంచువరకూ వెళ్లి వెనుదిరిగినా.. ఏనాడూ జనంలో తిరగడం మానలేదు. ఓడిన ప్రతిసారీ ప్రజల్లో తన నమ్మకాన్ని, బలాన్ని పెంచుకుంటూ వచ్చారు. ఇప్పుడు అధికారంలో ఉన్న ఆయన నిరంతర ప్రజా సేవకునిగా తనదైన ముద్ర వేసుకుంటూ రేయింబవళ్లూ ప్రజల మధ్యనే ఉంటున్నారు. ఉదయం 8గంటల నుంచి మొదలుకుని రాత్రి 11దాటినా ప్రజలు ఏ సమయాన వచ్చినా వారి గోడు వింటూ పరిష్కార దిశగా పని చేస్తున్న ఈయన 'ఇన్నేండ్ల ఎన్నికల పోరులో ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా' అంటూ 'నవతెలంగాణ'కు నేడు తన పుట్టిన రోజు సందర్భంగా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఘంటాపథంగా చెప్పకొచ్చిన విశేషాలివీ...

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

నవతెలంగాణ : మీ ముందున్న కర్తవ్యాలు?

ఆది శ్రీనివాస్ : ప్రస్తుతం నా ముందున్న తక్షణ కర్తవ్యం వేములవాడ ఆలయాభివృద్ధి. ఈ నియోజకవర్గ ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే. నాపై నమ్మకంతో ఎమ్మెల్యేగా, ప్రభుత్వంలో విప్‌గా అధికారాన్ని అందించిన ప్రజలకు ఏ ఆపద వచ్చినా.. అర్ధరాత్రి అపరాత్రి అనే తేడా లేకుండా వారి గోడు తీర్చే ప్రజాపాలన అందించడమే నా లక్ష్యంగా పెట్టుకున్నా. ఉదయం 8గంటల నుంచి మొదలుకుని రాత్రి 11 దాటినా నా ఇంటి తలుపుతట్టి వచ్చే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటున్నా.

నవతెలంగాణ : వేములవాడ ఆలయాభివృద్ధి చేపట్టిన పనులు.. తీసుకుంటున్న నిర్ణయాలు ఏమిటి?

ఆదిశ్రీనివాస్: దక్షిణకాశీగా పేరున్న వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టాం. ఇందుకు ఆలయ పరిసరాల్లో నిర్మాణాలపై గతంలో ఇచ్చిన జీవో నెంబర్ 149 రద్దుపై ఇప్పటికే ప్రభుత్వ పెద్దలతో చర్చించాను. అధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ విస్తరణకు అడుగులు వేగిరం చేశాం. సీఎంఓ ఓఎస్డీ సహా జిల్లా, ఇక్కడి ఆలయాధికారుల బృందంతో కర్నాటకు వెళ్లి శృంగేరి పీఠం జగద్గురు భారతి తీర్థ మహా స్వాములు, విధిశేఖర భారతి స్వాములను కలిశాం. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాం. రాజన్న భక్తులకు సులభంగా, వేగంగా దర్శనం, వసతి ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్రేక్ దర్శనమూ అమలు చేస్తున్నాం. భక్తులకు నిత్యం అన్నదానం అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. రోజుకు 15వేల మందికి తగ్గకుండా భోజనం చేసే విధంగా భవనాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం.

నవతెలంగాణ : మీరు చేపట్టిన అభివృద్ధిలో ఇటీవల చేపట్టిన పనులు?

ఆది శ్రీనివాస్ : ప్రధానంగా ఇక్కడి ప్రజల మౌలిక వసతులు, విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టిసారించాం. రాజన్నసిరిసిల్ల డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో వేములవాడలో మెగా జాబ్‌మేళాను నిర్వహించగా వచ్చిన 46కంపెనీల ఇంటర్వ్యూలో వందలాది మందికి ఉద్యోగాలు లభించాయి. అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్య సేవల కోసం వచ్చేవారికి వెనువెంటనే ఎల్‌ఓసీలు అందిస్తున్నాను. అదే సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ సైతం బాధితులకు అందించేందుకు ప్రత్యేక దృష్టిసారించాను. జులై చివరినాటికైతే ఎమ్మెల్యేగా 317మందికి రూ.కోటీ26లక్షల విలువైన చెక్కులు అందించాను. విద్యుత్ సమస్యలు తలెత్తుతున్న చందుర్తి, భీమారం, మేడిపల్లి వంటి మండలల్లో 33/11కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నాం. కాచారం సబ్‌స్టేషన్‌ను 132/22 కేవీ సబ్‌స్టేషన్‌గా అప్‌గ్రేడ్ కోసం ఇప్పటికే ఉప ముఖ్యమంత్రికి వినతిపత్రం అందించాం. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నాం. ఇప్పటికే పలు స్వశక్తి సంఘాలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్, ఎంటర్‌ప్రైజెస్, టెయిలరింగ్, కంప్యూటర్, ఎంబ్రాయిడింగ్ వర్క్, నాటు కోళ్ల మదర్ యూనిట్లు.. ఇలా పలు యూనిట్లు మంజూరు చేయించి ఉపాధి చూపెడుతున్నాం.





నవతెలంగాణ: జిల్లా నుంచి ప్రభుత్వ విప్‌గా సిరిసిల్ల వస్త్రపరిశ్రమ, ఇక్కడ ఎక్కువగా ఉన్న గల్ఫ్‌బాధితుల కోసం చేపట్టిన చర్యలు ఏమిటి?

ఆదిశ్రీనివాస్ : సిరిసిల్లవస్త్ర పరిశ్రమను ఆదుకునేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకు ఇప్పటికే జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్, సెస్ చైర్మన్, పవర్‌లూమ్ యజమానులు, ఆసాములతో సమావేశమై వారి బాధలు, గాథలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించాం. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా కట్టుబడి ఉంది. ఇప్పటికే పలుమార్లు బతుకమ్మ చీరల బకాలు విడుదల చేసింది. స్కూల్ యూనిఫాంక్లాత్ ఆర్డరును అందజేసింది. కోర్టు పరిధిలో ఉన్న అంశాలు మినహా అన్ని సమస్యలను పరిష్కరించేందే దిశగా కృషి చేస్తోంది. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ 'టీజీకో'పై సమీక్షించిన సీఎం ఇతర రాష్ట్రాల్లో పవర్‌లూమ్ పరిశ్రమకు అందిస్తున్న రాయితీలు ప్రోత్సాహకాలపై ప్రభుత్వం పరిశీలిస్తున్నారు. ఇక గల్ఫ్‌కార్మికు సంక్షేమం కోసం తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పొన్నం అధ్యక్షతన, ప్రభుత్వ విప్‌గా నేను కన్వీనర్‌గా వ్యవహరించి నిర్వహించిన సమావేశంలో పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. గల్ఫ్ బాధితులకు సంబంధించిన ఐదు అంశాలను వెంటనే అమలు చేయాలని గల్ఫ్‌బోర్డు, ఎన్నారై పాలసీపైనా ప్రభుత్వం జీవో సైతం విడుదల చేసింది.

నవతెలంగాణ : మిడ్‌మానేరు నిర్వాసితులపై సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు?

ఆది శ్రీనివాస్: మధ్యమానేరు ముంపు గ్రామల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఆరెపల్లి, సంకేపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో చీర్లవంచలో సమావేశాన్ని సైతం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాం. తమ ఇండ్లకు పరిహారం, పట్టాలు, 18ఏండ్లు నిండిన వారికి పరిహారం, ఆలయాలకు పరిహారం రాలేదని, ఇతర సమస్యల విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూల స్పందన వచ్చింది. అలాగే ముంపు గ్రామాల పరిధిలో వెలిసి రియల్ ఎస్టేట్‌వెంచర్లకు అనుమతులపై, ప్రభుత్వ భూములపై సర్వే చేసి నివేదిక తీసుకుని అక్రమాలపైనా దృష్టిసారించాం.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.